www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 24-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 86 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: తదియ రా. 1.23 తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 3.54 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా.7.40-9.10, దుర్ముహూర్తం: మ.12.43-1.35, మ.3.20 తదుపరి 4.12, అమృతఘడియలు: ఉ.9.48-11.20, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.46, సూర్యాస్తమయం: 6.48 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శ్రీ సిటీ కంప్రెసర్స్ ప్లాంట్ విస్తరణ: డైకిన్

న్యూఢిల్లీ: డైకిన్ ఎయిర్‌కండిషనింగ్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్, శ్రీసిటీలోని తన కంప్రెసర్ల ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందు కోసం మరో 33 ఎకరాల భూమిని తీసుకుంది. 2030 నాటికి ఈ విస్తరణ పూర్తయితే కంప్రెసర్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 50 లక్షల యూనిట్లకు చేరుతుందని కంపెనీ సీఎండీ కన్వల్‌జీత్ జావా తెలిపారు. ఇందులో 40 లక్షల యూనిట్లు భారత్‌లో అమ్ముడుపోయినా, మిగతా 10 లక్షల యూనిట్లను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 20 లక్షల ఎయిర్ కండీషనర్స్ (ఏసీ) విక్రయించాలని డైకిన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే ఏడు లక్షల యూనిట్లు కంపెనీ విక్రయించింది.

ఈ ఏడాది 400 కొత్త శాఖలు

ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: నెట్‌వర్క్ విస్తరణ ప్రణాళికలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొత్తగా 400 శాఖలు ప్రారంభించనుంది. గత ఏడాది బ్యాంక్ 137 కొత్త బ్రాంచీలు ప్రారంభించింది. వాటిలో 59 కొత్త గ్రామీణ బ్రాంచీలున్నాయి. బ్రాంచీల ద్వారా అడ్వైజరీ, వెల్త్ సర్వీసులను బ్యాంక్ అందించనుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చి ముగిసే నాటికి ఎస్‌బీఐ దేశవ్యాప్తంగా 22,542 బ్రాంచీలను నిర్వహిస్తోంది.

ఓఎన్‌జీసీకి గుదిబండగా దీన్ దయాళ్ బ్లాక్

సహజ వాయువు నిల్వలపై 'గ్యాస్' కొట్టిన జీఎస్‌పీసీ

న్యూఢిల్లీ: కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని దీన్ దయాళ్ వెస్ట్ బ్లాక్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి గుదిబండలా మారింది. 2017 జనవరిలో గుజరాత్ ప్రభుత్వ రంగంలోని గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ (జీఎస్‌పీసీ) ఈ క్షేత్రంలో తనకు ఉన్న 80 శాతం వాటాను ఓఎన్‌జీసీకి 120 కోట్ల డాలర్లకు విక్రయించింది. కేంద్ర ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ఓఎన్‌జీసీ ఈ బ్లాక్‌ను కొనుగోలు చేసిందని అప్పట్లోనే వార్తలు గుప్పుమన్నాయి.

అరకొర నిక్షేపాలే: ఓఎన్‌జీసీకి ఈ బ్లాక్‌ను విక్రయించే సమయంలో ఈ క్షేత్రంలో దాదాపు 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయని, రోజూ 20 నుంచి 30 కోట్ల ఘనపుటడుగుల గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని జీఎస్‌పీసీ చెప్పింది. తీరా చూస్తే ఇక్కడ ఉన్న గ్యాస్ నిక్షేపాలు 1.94 టీసీఎఫ్ మాత్రమేనని తేలింది. అయినా ఆశ చావక ఓఎన్‌జీసీ పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ఈ బ్లాక్‌లో ఇప్పటి వరకు మొత్తం ఏడు బావులు డ్రిల్లింగ్ చేసింది. అందులో నాలుగు బావుల్లో మాత్రమే స్వల్ప పరిమాణంలో గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయి. మరో మూడు బావుల్ని వివిధ సాంకేతిక సవాళ్లతో మూసేయాల్సి వచ్చింది.

ఆశ చావని ఓఎన్‌జీసీ: దీన్ దయాళ్ వెస్ట్ బ్లాక్‌పై ఓఎన్‌జీసీకి ఇప్పటికీ ఆశ చావలేదు. మంచి టెక్నాలజీ, పుష్కలంగా నిధులు ఉన్న విదేశీ ఆయిల్ కంపెనీలతో ఈ బ్లాక్‌లో మరోసారి అన్వేషణ చేయించి, మరిన్ని బావులు తవ్వాలని నిర్ణయించింది. ఇందుకు ఆసక్తి ఉన్న సంస్థలు ముందుకు వస్తే ఆ సంస్థలకు కొంత భాగస్వామ్యం కూడా ఇస్తామని తాజాగా టెండర్ ఫ్లోట్ చేసింది. ఆసక్తి ఉన్న సంస్థలు ఈ ఏడాది సెప్టెంబరు 12లోగా తమ బిడ్స్ సమర్పించాలని కోరింది. ఈ బ్లాక్ కొన్న పాపానికి ఓఎన్‌జీసీకి ఇప్పటికే చేతి చమురు వదిలించుకోవటమే కాకుండా కంపెనీ రిజర్వు నిధులు తగ్గిపోయాయి. జీఎస్‌పీసీ మాత్రం ఓఎన్‌జీసీ చెల్లించిన డబ్బులతో తన అప్పులు గణనీయంగా తగ్గించుకుంది.

సేల్స్ రిటర్న్ సవరించే సౌలభ్యం

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మండలి, జీఎస్‌టీ చెల్లింపుదారులకు మరో సౌలభ్యం కల్పించింది. పన్ను చెల్లింపునకు ముందు తమ సేల్స్ రిటర్న్ (జీఎస్‌టీఆర్-1)ను సవరించే ఆప్షన్ కల్పించింది. నెల లేదా మూడు నెలలకు కలిపి ఈ ఆప్షన్ లభిస్తుంది. ఈ ఆప్షన్ ఉపయోగించుకోవాలనుకునే పన్ను చెల్లింపుదారులు జీఎస్‌టీఆర్-1ఏ ద్వారా ఈ ఆప్షన్ ఉపయోగించుకోవచ్చు. జీఎస్‌టీ ఆర్-3బీ రిటర్న్ ఫైల్ చేసే లోపే ఈ ఆప్షన్‌ను ఉపయోగించుకోవాలి.

గౌతమ్ అదానీ వార్షిక జీతం రూ. 9.26 కోట్లు



ఏఈఎల్ డైరెక్టర్ వార్షిక జీతం రూ.89.37 కోట్లు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ.. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ తర్వాత దేశంలో రెండో అతి పెద్ద సంపన్నుడు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ తాజా ఇండెక్స్ ప్రకారం ఆయన ఆస్తుల విలువ 10,600 కోట్ల డాలర్లు (సుమారు రూ.8.85 లక్షల కోట్లు). అంతర్జాతీయంగా చూస్తే 14వ అతిపెద్ద సంపన్నుడు. అయితే గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో గౌతమ్ అదానీ తన గ్రూప్‌లోని కంపెనీల నుంచి తీసుకున్న జీతభత్యాలు మాత్రం రూ.9.26 కోట్లు మాత్రమే. అదే అదానీ గ్రూప్‌లోని ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) డైరెక్టర్ వినయ్ ప్రకాష్ తీసుకున్న జీతభత్యాలు అక్షరాలా రూ.89.37 కోట్లు. కుటుంబాల నిర్వహణలోని ఇతర పారిశ్రామికవేత్తలతో పోల్చినా.. ఒక్క ముకేశ్ అంబానీ తప్ప మిగతా అందరూ గత ఆర్థిక సంవత్సరం గౌతమ్ అదానీ కంటే భారీగా జీతభత్యాలు తీసుకున్నారు. అంబానీ మాత్రం కొవిడ్ టైమ్ నుంచి ఆర్‌ఐఎల్ నుంచి పైసా కూడా జీతం తీసుకోవడం లేదు.

ఎందుకంటే: గత ఏడాది అదానీ గ్రూప్‌నకు పెద్ద పీడకల. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అనే అమెరికా షార్ట్ సెల్లింగ్ కంపెనీ రిపోర్ట్‌తో గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాప్ ఒక్కసారిగా 15,000 కోట్ల డాలర్లు తుడిచి పెట్టుకుపోయింది. దాంతో అదానీ తన గ్రూప్‌లోని పది లిస్టెడ్ కంపెనీల్లో రెండు కంపెనీలు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ నుంచి మాత్రమే జీతం తీసుకుని, మిగతా ఎనిమిది కంపెనీల నుంచి పైసా కూడా తీసుకోలేదు. ఈ కారణంగానే గత ఆర్థిక సంవత్సరం గౌతమ్ అదానీ తీసుకున్న జీతభత్యాలు రూ.9.26 కోట్లకు పరిమితమయ్యాయి.

కొత్త ఇళ్ల సరఫరా తగ్గింది

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని బిల్డర్లు తక్కువ ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభించటంతో దేశంలోని 9 ప్రధాన నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 13 శాతం మేరకు తగ్గినట్టు ప్రాప్ ఈక్విటీ తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో 1,11,657 గృహాలు అందుబాటులోకి రాగా ఈ ఏడాది వాటి సంఖ్య 97,331కే పరిమితం కావచ్చని పేర్కొంది. ప్రధానంగా పుణె, హైదరాబాద్‌లలో తక్కువ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని ప్రాప్ ఈక్విటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ జసూజా అన్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో కొత్త గృహాల సరఫరా 36 శాతం తగ్గి 18,232 యూనిట్ల నుంచి 111,603 యూనిట్లకే పరిమితం కానున్నట్టు ఆయన చెప్పారు. ఇళ్ల అమ్మకాలు కూడా ఈ త్రైమాసికంలో 2 శాతం తగ్గి 1,21,856 యూనిట్ల నుంచి 1,19,901 యూనిట్లకు పరిమితం కావచ్చని ఆ నివేదిక పేర్కొంది.

23,700 పైన బుల్లిష్

(జూన్ 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 23,671-23,398 పాయింట్ల మధ్యన కదలాడి 35 పాయింట్ల లాభంతో 23,501 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23700 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,538, 23,488, 23,218, 22,956 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 23,700 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,200

నిరోధ స్థాయిలు: 23,700, 23,800, 23,900 (23,600 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,300, 23,200, 23,100 (23,400 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	132
వరంగల్	119	గుంటూరు	132
కరీంనగర్	119	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	144
కర్నూలు	119	నెల్లూరు	144
విశాఖపట్నం	138	అనంతపురం	132
గోదావరి	132		

బ్యాంక్, ఐటీ రంగాల్లో బేరిష్‌నెస్!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరటంతో కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. అయితే కొత్త ప్రభుత్వ విధానాలు, జీఎస్‌టీ మండలి తీసుకున్న నిర్ణయాలను బట్టి వాటి గమనం ఉంటుంది. నిఫ్టీకి 23,440 పాయింట్ల వద్ద బలమైన మద్దతు ఉంది. ఒకవేళ ఈ స్థాయిలను బ్రేక్ చేయలేని పక్షంలో 23,370/23,390/23,180 స్థాయిలకు రావచ్చు. వ్యవసాయ, పురుగు మందులు, ఎరువులు, రియల్టీ, ఇన్‌ఫ్రా షేర్లకు గిరాకీ పెరిగే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఐటీ రంగాల్లో బేరిష్‌నెస్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

జెఎస్‌డబ్ల్యూ స్టీల్: కొన్నాళ్లుగా సైడ్‌వేస్‌లో చలిస్తూ వస్తున్న ఈ కౌంటర్‌లో మళ్లీ మూమెంటమ్ కనిపిస్తోంది. రూ.915 వద్ద కీలక నిరోధాన్ని బ్రేక్ చేసింది. పైగా ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరుగుతోంది. కన్సాలిడేషన్ పూర్తయినట్లు కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.936 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.910/930 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.975/1,040 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.870 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో 13 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం రూ.6,000 స్థాయిలో ప్రైస్ యాక్షన్ జరుగుతోంది. వాల్యూమ్ విపరీతంగా నమోదవుతుండటంతో పుల్‌బ్యాక్‌కు ఆస్కారం ఉంది. గత శుక్రవారం రూ.6,011 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.6,000/5,960 స్థాయిల్లో ప్రవేశించి రూ.6,255 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,910 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆర్‌వీఎన్‌ఎల్: ఈ కౌంటర్‌లో అనేక సానుకూలతలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రైల్వేకు ప్రాధాన్యతను కొనసాగించటం, కొత్త ఆర్డర్లు రావటంతో షేరు ధర పుంజుకుంటోంది. పైగా అవసరమైన కరెక్షన్ కూడా జరిగింది. క్రితం వారం నెల గరిష్ఠాలను బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు రూ.409 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.405 శ్రేణిలో ప్రవేశించి రూ.425/433 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.400 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాన్యూల్స్ ఇండియా: కన్సాలిడేషన్ అనంతరం ఈ షేరు సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని చేరుకుంది. మంచి వాల్యూమ్ జనరేట్ అవుతోంది. పైగా అనిశ్చితి తక్కువగా ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.490 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.480 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.555/575 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.465 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బయోకాన్: ఈ షేరు మంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తోంది. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత అక్యుములేషన్ జరిగింది. పైగా రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.345 వద్ద ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.330 స్థాయిల్లో ఎంటరై రూ.455/475 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.309 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

23,400 దిగువన బలహీనం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమై 23,600 స్థాయిని దాటినప్పటికీ తదుపరి నాలుగు సెషన్లలో పలు ఇంట్రాడే రియాక్షన్ల కారణంగా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. పలు ప్రయత్నాలు చేసినా నిలదొక్కుకోలేకపోవడం వల్ల ఇది బలమైన నిరోధ స్థాయిగా మారింది. ఇప్పుడు ఈ స్థాయి కీలకంగా మారింది. కాని అన్ని కరెక్షన్లలోనూ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం వల్ల ఇప్పటికీ అప్‌ట్రెండ్‌లోనే ఉంది. గతవారం పరిమిత పరిధిలో 23,650, 23,400 పాయింట్ల మధ్యన కదలాడి ఎట్టకేలకు 35 పాయింట్ల స్వల్పలాభంతో 23,500 వద్ద ముగిసింది. గత వారంలో మిడ్‌క్యాప్-100 సూచీ 200 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 190 పాయింట్లు లాభపడ్డాయి. ఏది ఏమైనా గత వారంలో గరిష్ఠ స్థాయిల్లో ఎలాంటి భారీ కదలికలు లేకుండా అనిశ్చిత స్థితిని ప్రదర్శించింది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్‌లో ప్రవేశించి సరికొత్త శిఖరాలకు చేరాలంటే ప్రధాన నిరోధం 23,650 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మానసిక అవధులు 23,800, 24,000.

బేరిష్ స్థాయిలు: కరెక్షన్‌లో పడి మైనర్ మద్దతు స్థాయి 23,400 కన్నా దిగజారితే మైనర్ బలహీనత ఉన్నట్టు సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,400. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే మరో ప్రధాన మద్దతు స్థాయి 23,000. ఇది స్వల్పకాలిక బలహీనత సంకేతం.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం బలమైన ర్యాలీ సాధించి 1,650 పాయింట్ల మేరకు లాభపడింది. 52,000 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్ సాధించింది. ఇదే ప్రధాన నిరోధ స్థాయి అయింది. మరింత అప్‌ట్రెండ్ కోసం అంతకన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 51,300,ప్రధాన మద్దతు స్థాయి 51,000.

పాటర్న్: సానుకూలత కోసం మార్కెట్ 23,650 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్"ను బ్రేకర్ చేయాలి. 23,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది. అలాగే ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్‌కు కూడా ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,580, 23,650
మద్దతు	23,455, 23,400

www.sundartrends.in

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x దక్షిణాఫ్రికా (ఉ.6. గం.)

భారత్ x ఆస్ట్రేలియా (రా.8. గం.)

మరొక్కటి చాలు..



సెమీస్ లక్ష్యంగా బరిలోకి భారత్

ఆస్ట్రేలియాకు చావోరేవో

టీ20 వరల్డ్‌కప్

గ్రాస్ ఐలెట్: అఫ్ఘానిస్థాన్ సంచలన విజయంతో రసవత్తరంగా మారిన గ్రూప్ 1లో మరో ఆసక్తికరపోరుకు తెర లేవనుంది. ఓటమనేదే లేకుండా దూసుకెళుతున్న భారత జట్టు సోమవారం ఆస్ట్రేలియాతో అత్యంత కీలక మ్యాచ్ ఆడబోతోంది. ఎందుకంటే.. సూపర్-8లో 4 పాయింట్లతో ఉన్న టీమిండియా సెమీస్ చేరాలంటే మరొక్క విజయం చాలు. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయినా.. రన్‌రేట్ మెరుగ్గానే ఉండడంతో భారత్‌కు ఆందోళన లేదు. కానీ ఓటమి మరీ భారీ తేడాతో ఉండకుండా చూసుకోవాలి. అటు ఆసీస్ పరిస్థితే దయనీయంగా ఉంది. ఆదివారం అఫ్ఘాన్ చేతిలో పరాభవం కంగారూల అవకాశాలను సంక్లిష్టం చేసింది. దీంతో చావోరేవో లాంటి ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ఆసీస్‌కు సెమీస్‌పై ఆశలుంటాయి. అదే సమయంలో తమకు పోటీగా ఉన్న అఫ్ఘాన్ జట్టు బంగ్లాదేశ్‌పై ఓడాల్సి ఉంటుంది. కాగా.. ఈ మ్యాచ్‌లో భారత్ నెగ్గితే గతేడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఓటమి బాకీని కూడా తీర్చుకున్నట్టవుతుంది.

ఒత్తిడిలో కంగారూలు: అఫ్ఘాన్‌ను తేలిగ్గా తీసుకుంటే ఏమవుతుందో తెలుసుకున్న కంగారూలు.. తీవ్ర ఒత్తిడిలో భారత్‌ను ఎదుర్కోబోతున్నారు. వరుస విజయాలతో ఉన్న రోహిత్ సేనను అడ్డుకోవాలంటే ఆసీస్ ఏమరుపాటు లేకుండా ఆడక తప్పదు. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో గణనీయంగా మెరుగుపడాల్సి ఉంది.

పిచ్, వాతావరణం

మ్యాచ్ రోజు ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. బలమైన గాలులతో పాటు వర్షం కురిసే అవకాశం 55 శాతంగా ఉండడంతో, మ్యాచ్‌కు ఆటంకం కలగవచ్చు. ఇక్కడి మైదానంలో వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే చాన్సుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్.

ఆస్ట్రేలియా: హెడ్, వార్నర్, మార్ష్ (కెప్టెన్), మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, డేవిడ్, వేడ్, కమిన్స్, స్టార్క్, జంపా, హాజెల్‌వుడ్.

జయహో.. శ్రీజ

సింగిల్స్, డబుల్స్ టైటిళ్లతో చరిత్ర

● డబ్ల్యూటీటీ కంటెండర్



లాగోస్ (నైజీరియా): డబ్ల్యూటీటీ కంటెండర్ సింగిల్స్ టైటిల్ సాధించిన తొలి భారత ప్లేయర్‌గా తెలుగమ్మాయి ఆకుల శ్రీజ చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా, అర్చనా కామత్‌తో కలసి డబుల్స్ టైటిల్‌నూ సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 4-1తో డింగ్ యిజీ (చైనా)పై విజయం సాధించింది. అనంతరం సహచర జంట దియా చిటాలే-యశస్విని గోర్పడేతో జరిగిన డబుల్స్ ఫైనల్లో శ్రీజ-అర్చన జోడీ 3-0తో అలవోకగా నెగ్గింది. ఇలా.. ఈ మెగా టోర్నీలో శ్రీజ రెండు టైటిళ్లతో 'డబుల్' సాధించి తనకు తిరుగులేదని నిరూపించింది. అలాగే హర్మీత్ దేశాయ్-మానవ్ టక్కర్ జోడీ కంటెండర్ టైటిల్ నెగ్గిన తొలి భారత పురుషుల జోడీగా రికార్డులకెక్కింది.

ఆసీస్ పనిపట్టారు

● అఫ్ఘాన్ సంచలన విజయం
● దెబ్బకొట్టిన నైబ్, నవీనుల్
● కమిన్స్ హ్యాట్రిక్ వృథా

కింగ్స్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో అఫ్ఘానిస్థాన్ పెనుసంచలనం సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియాపై తొలిసారి జయకేతనం ఎగురవేసింది. బ్యాటింగ్‌కు సవాల్‌గా మారిన పిచ్‌పై 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' గుల్బదిన్ నైబ్ (4/20) స్లో బాల్స్‌తో కంగారూల వెన్నువిరవడంతో.. 149 పరుగుల లక్ష్యాన్ని అద్భుతంగా కాపాడుకొన్న అఫ్ఘాన్ సెమీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. సూపర్-8 గ్రూప్-1లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ 21 పరుగుల తేడాతో ఆసీస్‌పై చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 148/6 స్కోరు చేసింది. జంపా రెండు వికెట్లు పడగొట్టాడు. పేలవంగా ఫీల్డింగ్ చేసిన ఆసీస్ ఐదు క్యాచ్‌లను జారవిడించింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (60), ఇబ్రహీం జద్రాన్ (51) అర్ధ శతకాలతో అదరగొట్టారు. అయితే, 16వ ఓవర్‌లో జద్రాన్‌ను జంపా అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఒమర్‌జాయ్ (2)ను కూడా జంపా వెనక్కిపంపాడు. ధాటిగా ఆడుతున్న గుర్బాజ్‌ను స్టొయినిస్ వెనక్కి పంపాడు. రషీద్ (2), కరీమ్ జనత్ (13), నైబ్ (0)ను అవుట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేసిన కమిన్స్.. అఫ్ఘాన్ స్కోరు 150 మార్క్ చేరకుండా అడ్డుకొన్నాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో ఆసీస్ 19.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. నవీనుల్ 3 వికెట్లు పడగొట్టాడు. పవర్‌ప్లేలోనే హెడ్ (0), కెప్టెన్ మిచెల్ మార్ష్ (12), వార్నర్ (3) వికెట్లను చేజార్చుకొన్న ఆసీస్ 32/3తో కష్టాల్లో పడింది. అయితే, స్టొయినిస్ (11), టిమ్ డేవిడ్ (2)తోపాటు ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న మ్యాక్స్‌వెల్‌ను నైబ్ అవుట్ చేయడంతో ఆసీస్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది.



గుల్బదిన్ నైబ్ (4/20)

1 ఏ ఫార్మాట్‌లోనైనా ఆస్ట్రేలియాపై అఫ్ఘాన్‌కు ఇదే తొలి విజయం.

పాయింట్ల పట్టిక గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	2	2	0	0	4	2.425
ఆస్ట్రేలియా	2	1	1	0	2	0.223
అఫ్ఘాన్	2	1	1	0	2	-0.650
బంగ్లాదేశ్	2	0	2	0	0	-2.489

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 148/6 (గుర్బాజ్ 60, జద్రాన్ 51; కమిన్స్ 3/28, జంపా 2/28).

ఆస్ట్రేలియా: 19.2 ఓవర్లలో 127 ఆలౌట్ (మ్యాక్స్‌వెల్ 59; నైబ్ 4/20, నవీనుల్ 3/20).

ఒకే ఒక్కడు



ఆసీస్ పేసర్ కమిన్స్ అరుదైన ఫీట్‌ను నమోదు చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించాడు. సూపర్-8లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి హ్యాట్రిక్ సాధించిన కమిన్స్.. అఫ్ఘాన్‌తో మ్యాచ్‌లో మరోసారి వరుసగా మూడు వికెట్లు పడగొట్టాడు. 18వ ఓవర్ చివరి బంతికి రషీద్‌ను అవుట్ చేసిన కమిన్స్.. 20వ ఓవర్ తొలి బంతికి జనత్, ఆ తర్వాతి బంతికి గుల్బదిన్‌ను అవుట్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో పొట్టి కప్‌లో డబుల్ హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గా కమిన్స్ రికార్డులకెక్కాడు.

ధీరజ్ కంచు మోత



అంటాల్యా (టర్కీ): వరల్డ్‌కప్ స్టేజ్-3లో రికర్వ్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర ఒకే రోజు రెండు కాంస్యాలతో అదరగొట్టాడు. పురుషుల వ్యక్తిగత విభాగం కాంస్య పోరులో ధీరజ్ 7-3తో మార్కో నెస్పోలిపై గెలిచాడు. మిక్స్‌డ్‌లో భజన్ కౌర్-ధీరజ్ జంట.. కాంస్య పతక మ్యాచ్‌లో 5-3తో వేలన్సియా-గ్రాండీ (మెక్సికో)పై గెలిచింది. మొత్తంగా ఈవెంట్‌ను భారత్ 4 మెడల్స్ సాధించింది.

'పారిస్' పతక విజేతలకు కార్లు

చాముండేశ్వర్‌నాథ్ ఆఫర్

హైదరాబాద్: పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడనున్న తెలంగాణ క్రీడాకారులకు రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్ నాథ్ ఆఫర్ ప్రకటించారు. విశ్వక్రీడల్లో పతకాలు నెగ్గిన వారికి కార్లను బహుమానంగా ఇస్తానని ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఒలింపిక్ డే రన్ కార్యక్రమంలో పాల్గొన్న చాముండి తెలిపారు.

బజ్‌రంగ్‌పై మళ్లీ సస్పెన్షన్

న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాను జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) రెండోసారి సస్పెండ్ చేసింది. మార్చి 10న సోనెపట్‌లో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్ సందర్భంగా డోపింగ్ పరీక్షకు మూత్రపు నమూనాను ఇచ్చేందుకు నిరాకరించడంతో బజ్‌రంగ్‌ను గతంలో నాడా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే నోటీసు ఇవ్వకుండా బజ్‌రంగ్‌పై చర్య తీసుకున్నారంటూ అతడిపై సస్పెన్షన్‌ను మే 31న నాడా క్రమశిక్షణ కమిటీ ఎత్తివేసింది. బజ్‌రంగ్‌కు 'నాడా' నోటీసు ఇచ్చేవరకు సస్పెన్షన్ ఎత్తివేత అమలులో ఉంటుందని ఆ సందర్భంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో.. నిబంధనల్ని ఉల్లంఘించిన బజ్‌రంగ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు నాడా అతడికి ఆదివారం నోటీసు జారీ చేసింది.

మెరిసిన మంధాన

మూడో వన్డేలోనూ సఫారీల ఓటమి

భారత్ క్లీన్‌స్వీప్



బెంగళూరు: దక్షిణాఫ్రికాతో తొలి రెండు వన్డేల్లో సెంచరీలతో రికార్డు సృష్టించిన టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన..మూడో మ్యాచ్‌లోనూ ఆ జోరు కొనసాగించింది. అయితే త్రుటిలో శతకాన్ని చేజార్చుకుంది. మంధాన (83 బంతుల్లో 11 ఫోర్లతో 90) దూకుడుతో ఆదివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్లతో ఘన విజయం సాధించింది. దాంతో మూడు వన్డేల సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ సేన క్లీన్ స్వీప్ చేసింది. తొలుత దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 215/8 స్కోరు చేసింది. కెప్టెన్ వోల్వార్ట్ (61) అర్థ శతకంతో ఆదుకుంది. దీప్తిశర్మ, అరుంధతి చెరో 2 వికెట్లు తీశారు. మాదిరి లక్ష్యాన్ని భారత్ 40.4 ఓవర్లలో 220/4 స్కోరుతో ఛేదించింది. మంధానకు తోడు కెప్టెన్ హర్మన్ (42) సత్తా చాటింది. దీప్తిశర్మ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, మంధాన 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. రెండు జట్ల మధ్య ఏకైక టెస్ట్ శుక్రవారం నుంచి చెన్నైలో జరుగుతుంది.

సెమీస్‌లో ఇంగ్లండ్

బట్లర్ తుఫాన్ ఇన్నింగ్స్
జోర్డాన్ హ్యాట్రిక్
యూఎస్‌పై ఘనవిజయం



బట్లర్ (83 నాటౌట్)

బ్రిడ్జిటౌన్: ఓ దశలో సూపర్-8లో చోటు ప్రశ్నార్థకంగా మారిన ఇంగ్లండ్ అందరికన్నా ముందే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. పేసర్ జోర్డాన్ హ్యాట్రిక్ (4/10)తో చెలరేగగా.. ఆ తర్వాత కెప్టెన్ బట్లర్ (38 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 83 నాటౌట్) బాదుడుకు కేవలం 58 బంతుల్లోనే జట్టు తమ ఛేదనను ముగించింది. దీంతో ఆదివారం అమెరికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో బట్లర్ సేన పది వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఎస్ఏ 18.5 ఓవర్లలో 115 పరుగులకు కుప్పకూలింది. ఓ దశలో 115/6 స్కోరుతో నిలిచిన యూఎస్ జట్టు.. బార్బడోస్‌లోనే పుట్టి పెరిగిన జోర్డాన్ జోరుకు అన్నే పరుగుల వద్ద చివరి నాలుగు వికెట్లను కోల్పోవడం విశేషం. ఈ స్వల్ప ఛేదనను ఇంగ్లండ్ 17.4 ఓవర్లలో ఛేదిస్తే సెమీస్‌కు వెళ్లే అవకాశం ఉండగా.. బట్లర్ బాదుడుకు 9.4 ఓవర్లలోనే 117/0 స్కోరుతో నెగ్గింది. ఈ దెబ్బకు విండీస్ రన్‌రేట్‌ను కూడా అధిగమించి టాప్‌నకు చేరింది. తొమ్మిదో ఓవర్‌లోనైతే బట్లర్ ధాటికి వరుసగా ఐదు సిక్సర్లతో స్పిన్నర్ హర్మీత్ 32 పరుగులు ఇచ్చుకున్నాడు. అలాగే మరో ఓపెనర్ సాల్ట్ (25 నాటౌట్)తో కలిసి బట్లర్ తొలి వికెట్‌కు 117 పరుగులు నమోదు చేశాడు.

పాయింట్ల పట్టిక గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఇంగ్లండ్	3	2	1	0	4	1.992
సౌతాఫ్రికా	2	2	0	0	4	0.625
వెస్టిండీస్	2	1	1	0	2	1.814
అమెరికా	3	0	3	0	0	-3.906

1 టీ20ల్లో హ్యాట్రిక్ తీసిన తొలి ఇంగ్లండ్ బౌలర్‌గా జోర్డాన్. ఈ మెగా టోర్నీలో ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన రెండో బౌలర్. కాంఫర్ 2021లో ఈ ఫీట్ సాధించాడు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 24-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 86

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

నేటి నుంచి 18వ లోక్‌సభ సమావేశాలు

ఉదయం 11 గంటలకు మోదీ ప్రమాణం

తొలి రోజు ఏపీ, రెండో రోజు తెలంగాణ ఎంపీల ప్రమాణస్వీకారం

26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

జూలై 3 వరకు సమావేశాలు

న్యూఢిల్లీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): 18వ లోక్‌సభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణం చేస్తారు. ఆయనతో పాటు మొత్తం 280 మంది లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరితో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయిస్తారు. స్పీకర్ ఎన్నిక జరిగే వరకు ప్రొటెం స్పీకర్‌కు సహాయంగా సురేష్ కోడికున్నిల్, టీఆర్ బాలు, రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే, సుదీప్ బంధోపాధ్యాయ వ్యవహరిస్తారు. రెండో రోజు 264 మంది ఎంపీలు ప్రమాణ

మిగతా 10వ పేజీలో...

సగం మందే హాజరు

1,563 మందికి మళ్లీ నీట్ పరీక్ష పెడితే రాసింది 813 మందే.. అక్రమాలపై సీబీఐ ఎఫ్ఐఆర్

- పట్నా, గోధ్రాలో.. ప్రత్యేక బృందాల దర్యాప్తు
- నీట్ పేపర్‌ను 30 మందికి అమ్మారు!
- బిహార్‌లో అరెస్టైన ముగ్గురు నిందితుల వెల్లడి
- కేంద్రానికి బిహార్ ఈవోయూ 6 పేజీల నివేదిక
- మరో 17 మంది డిబార్.. ఐదుగురు అరెస్ట్
- మహారాష్ట్రలోనూ లీకైన నీట్ ప్రశ్నపత్రం?



పట్నాలోని ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షల తర్వాత నిందితుల తరలింపు

న్యూఢిల్లీ, పట్నా, ముంబై, జూన్ 23: గ్రేస్ మార్కులు ఇచ్చిన 1563 మందికి జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆదివారం మళ్లీ నీట్ పరీక్ష నిర్వహిస్తే.. వారిలో 813 (52 శాతం) మందే హాజరయ్యారు. మిగతా 750 మందీ డుమ్మా కొట్టేశారు. మేఘాలయ, హరియాణా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, చండీగఢ్‌లోని పరీక్షా కేంద్రాల్లో ఈ ఎగ్జామ్

మిగతా 10వ పేజీలో...


నీట్ స్కామ్‌కు మోదీ సర్కారుదే బాధ్యత

మల్లికార్జున ఖర్గే ధ్వజం

యువత భవిష్యత్తును మాఫియా చేతుల్లో పెట్టిన కేంద్రం

ప్రియాంక విమర్శ

10



జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి, సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి

భారీ ఎత్తున చేరికలపై అనుమతి కోసం

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

11

రెండు రోజులపాటు అక్కడే మకాం

రాష్ట్రంలో రాజకీయ కార్యాచరణపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం

మంత్రివర్గ విస్తరణపైనా మంతనాలు

కేంద్ర మంత్రులతోనూ భేటీ

రాష్ట్రానికి నిధులు కోరనున్న సీఎం

బీఆర్ఎస్‌కు మరో షాక్!

కాంగ్రెస్‌లోకి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్

కేసీఆర్ తనయ కవితకు అత్యంత సన్నిహితుడు

పోచారం తర్వాత ఉత్తర తెలంగాణ నుంచి మరో నేత

అదే బాటలో మరికొందరు హైదరాబాద్ ఎమ్మెల్యేలూ..

చర్చలు సఫలం!.. జూలై మొదటివారంలో చేరే అవకాశం

గంగుల జంపింగ్ కథనాలపై బీఆర్ఎస్‌లో కలకలం

ఫామ్‌హౌజ్‌కు పిలిపించుకున్న పార్టీ అధినేత కేసీఆర్

జగిత్యాల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో మరో వికెట్ పడింది. ఆ పార్టీ జగిత్యాల ఎమ్మెల్యే.. గులాబీ పార్టీ ముఖ్యనేత కవితకు అత్యంత సన్నిహితుడు.. డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం రాత్రి తన నివాసంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి సమక్షంలో ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2014లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన సంజయ్ కుమార్.. ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ (2018, 2023) వరుసగా ఆయనపై విజయాలు సాధించారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కూడా నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా సంజయ్ విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ, ఆ సీటును బీఆర్ఎస్ గెలుచుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో.. కొంతకాలంగా సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరిగింది. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు (దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాసరెడ్డి) కాంగ్రెస్ పార్టీలో

మిగతా 11వ పేజీలో...



పుష్పక్ హ్యాట్రిక్

పునర్వినియోగ రాకెట్ పరీక్ష సక్సెస్

ఎల్ఈఎక్స్ సిరీస్‌లో ఇస్రో 3వ విజయం

సురక్షితంగా ల్యాండైన ఆర్ఎల్‌వీ

బెంగళూరు (ఆంధ్రజ్యోతి), సూళ్లూరుపేట, జూన్ 23: అంతరిక్ష వ్యర్థాల నియంత్రణలో భాగంగా ఒకసారి ప్రయోగించిన రాకెట్‌ను తిరిగి భూమి మీదికి తీసుకొచ్చే ప్రక్రియలో 'హ్యాట్రిక్' విజయాన్ని సాధించినట్టు ఇస్రో వెల్లడించింది. దీనికోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన రీయూజబుల్ లాంచ్ వెహికిల్ (ఆర్ఎల్‌వీ)కు ఇప్పటికే రెండుసార్లు ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్ (ఎల్ఈఎక్స్) పూర్తిచేసిన ఇస్రో.. ఈసారి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో దీన్ని విజయవంతంగా పరీక్షించింది. విమానం రెక్కల తరహాలో రూపొందించిన ఈ పునర్వినియోగ రాకెట్ (ఆర్ఎల్‌వీ)కు ఇస్రో 'పుష్పక్' అని పేరు పెట్టింది. ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్‌లో భాగంగా చివరిదైన మూడో పరీక్ష

మిగతా 10వ పేజీలో...



దాసరి గోపీకృష్ణ (ఫైల్)

అమెరికాలో పేలిన తూటా..

బాపట్ల వాసి బలి

డల్లాస్‌లోని ఓ సూపర్‌మార్కెట్‌లో గోపీకృష్ణ పార్ట్‌టైమ్ జాబ్

9

కౌంటర్‌లో ఉండగా కాల్పులు జరిపిన దుండగుడు.. గాయపడి దుర్మరణం

కుటుంబాన్ని ఆదుకుంటాం: చంద్రబాబు

సింగరేణి మనుగడ ఎలా?



రోజురోజుకూ కరిగిపోతున్న బొగ్గు నిల్వలు

వచ్చే 15 ఏళ్లకు మిగిలేవి 12 గనులు మాత్రమే

ప్రస్తుతం 39 గనుల్లో మైనింగ్

వేలంలో ప్రైవేటు సంస్థలపాలైన రెండు బ్లాకులు

వేలంలో పాల్గొంటేనే మంచిదంటున్న అధికార్లు

సింగరేణికి గనులను కేంద్రం ఉదారంగా కేటాయించాలి: అధికార, విపక్షాలు

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఓవైపు బొగ్గు నిల్వలు వేగంగా కరిగిపోతున్నాయి. మరోవైపు బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థల పాలవుతున్నాయి. బొగ్గు నిక్షేపాలు కళ్లముందే కనిపిస్తున్నా.. ప్రభుత్వ అనుమతి లేనందున వేలం పాటకు వెళ్లలేక, వాటిని దక్కించుకోలేని దీన స్థితి. దీంతో 135 ఏళ్ల చరిత్ర కలిగి, ఉత్తర తెలంగాణకు ఆయువుపట్టుగా, తెలంగాణ కొంగు బంగారంగా వెలుగుతున్న సింగరేణి సంస్థ ఇప్పుడు ఎటూ పాలుపోని పరిస్థితిని ఎదుర్కొంటోంది. వాస్తవానికి సింగరేణికి 2015కు ముందు గోదావరి-ప్రాణహిత లోయలో 600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న బొగ్గు నిల్వలపై గుత్తాధిపత్యం ఉండేది. అయితే ఆ తరువాత నుంచి గనుల కోసం కేంద్రాన్ని విజ్ఞప్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బొగ్గు బావులు పొందాలంటే ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ప్రైవేటు సంస్థలతోపాటే బిడ్డింగ్‌లో పాల్గొనాలంటూ కేంద్ర ప్రభుత్వం

మిగతా 9వ పేజీలో...

ఆశలన్నీ తాటిచర్ల-2 పైనే

30 ఏళ్లకు సరిపడా 180 మిలియన్ల టన్నుల బొగ్గు

సింగరేణికే కేటాయించాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

9

తొందరపాటు వల్లే..

మేడిగడ్డ కుంగుబాటుకు ఇదే కారణం?.. పియర్స్ పనుల్లో ప్రమాణాలకు పాతర



17వ గేటు దిగువన నీటిలో ఉన్న మట్టి నమూనాలు సేకరిస్తున్న యంత్రం

- రాజకీయ ప్రయోజనం కోసం హడావుడి చర్యలు!
- నిర్మాణ పనుల్లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- ఏడాదిపాటు లీకేజీలపై నిర్లక్ష్యం.. నిర్వహణ గాలికి
- అండర్ కరెంట్ ప్రవాహాల వల్లే భూగర్భంలో రంధ్రాలు
- కీలక పనులకు సంబంధించి దేనికీ లేని రికార్డులు

భూపాలపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనుల విషయంలో గత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేపట్టిన తొందరపాటు చర్యలే బ్యారేజీలను దెబ్బతీశాయా? అవసరమైన సర్వేలు నిర్వహించి, నిర్ధారిత ప్రమాణాలను జాగ్రత్తగా పాటిస్తూ పదేళ్ల సమయంలో నిర్మించాల్సిన ప్రాజెక్టును కేవలం మూడేళ్ల వ్యవధిలోనే హడావుడిగా పూర్తి చేయడమే బ్యారేజీల కుంగుబాటుకు కారణమా? అంటే.. అవుననే అంటున్నారు నిపుణులు. ప్రాజెక్టు రూపకల్పన సమయంలో జియో ఫిజికల్ సర్వేలను విస్మరించారని, జీఎస్ఐ సర్వే చేయించలేదని అంటున్నారు. కాళేశ్వరం ప్రాంతం త్రివేణి సంగమంగా ప్రాచుర్యం పొందిందని, అక్కడ అంతర్వాహిని ప్రవహిస్తోందని చాలా మంది విశ్వసిస్తున్నారని, కానీ.. అక్కడ ఆ అంతర్వాహిని ఉందా? లేదా? అన్న విషయాన్ని తేల్చలేదని

మిగతా 11వ పేజీలో...

చివరి దశకు మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు

11

అన్నారం వద్ద కొనసాగుతున్న పరీక్షలు



అప్పటి రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ తీసుకుంటూ.. (ఫైల్)

కంచుమేళం కళాకారుడు, 'పద్మశ్రీ'

సకిని రామచంద్రయ్య కన్నుమూత

ఊపిరితిత్తుల వ్యాధితో తుదిశ్వాస

చికిత్సకు 14 లక్షల అప్పు

10

ఆర్థిక ఇబ్బందులతో చనిపోవడం బాధాకరం: జయధీర్ తిరుమలరావు

రామచంద్రయ్యకు రూ.కోటి సాయం ప్రకటించి.. ఇవ్వని గత ప్రభుత్వం

మృతుడు.. తిరిగొస్తే?

9

- రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి
- గుర్తుపట్టలేని విధంగా దెబ్బతిన్న శరీరం
- గ్రామంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు
- ఇంతలో.. ఇంటికొచ్చిన అసలు వ్యక్తి
- వికారాబాద్ జిల్లా నవాంద్గీలో ఘటన
- పట్టాలపై లభ్యమైన మృతదేహం ఎవరిది?

హైదరాబాద్-విజయవాడ హైవేపై 17 బ్లాక్‌స్పాట్లకు మోక్షం!

ప్రమాదాల నివారణకు 10 చోట్ల అండర్‌పాస్‌లు


మిగతాచోట్ల సర్వీస్ రోడ్ల నిర్మాణం వంటి చర్యలు

పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి

రూ.30 వేల కోట్లతో త్వరలో ట్రిపుల్ ఆర్ పనులు

ఎక్స్‌ప్రెస్ హైవే కోసం కేంద్రానికి ప్రతిపాదనలు

11



హైదరాబాద్‌లో జోరు వాన



హైదరాబాద్‌లోని గోల్కొండ క్రాస్ రోడ్డులో భారీ వర్షం పడుతున్న దృశ్యం

పలు ప్రాంతాల్లో దంచికొట్టిన వర్షం

రోడ్లపై మోకాళ్లలోతు నిలిచిన నీరు

డబీర్‌పురా, సర్దార్‌మహల్‌లో 7 సెం.మీ

2 రోజులు నగరానికి వర్ష సూచన

పలు జిల్లాల్లో మోస్తరు వాన

కడెం ప్రాజెక్టుకు మొదలైన వరద

హైదరాబాద్ సిటీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): పొద్దంతా సాధారణంగా ఉన్న వాతావరణం సాయంత్రం నాలుగు కాగానే ఒక్కసారిగా మారిపోయింది. ఉన్నట్టుండి ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. చిరుజల్లులతో మొదలై.. కొద్దిసేపటికే వాన జోరందుకుంది. ఒకటీ రెండు ప్రాంతాల్లో ఆరంభమై.. నిమిషాల

మిగతా 9వ పేజీలో...



పోలీసుల అదుపులో నిందితుడు సూరజ్ రేవణ్ణ

10

మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి మరో షాక్

హోమో సెక్స్ కేసులో సూరజ్ రేవణ్ణ అరెస్టు

ఇప్పటికే లైంగిక దౌర్జన్యాల కేసులో జైలు పాలైన ప్రజ్వల్ రేవణ్ణ

సెల్‌ఫోన్ దొంగల కోసం పోలీసు వేట


వెంటాడి, కాల్పులు జరిపినా బుల్లెట్ గాయంతో పరారు

2 రోజుల్లోపే ఇద్దరు దొంగల్ని అరెస్టు చేసిన పోలీసులు.. సికింద్రాబాద్‌లో ఘటన

హైదరాబాద్ సిటీ, జూన్ 23(ఆంధ్రజ్యోతి): మారణాయుధాలతో ప్రజలను భయపెట్టి సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు కరడుగట్టిన దొంగలను పోలీసులు వేటాడి అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనంపై పారిపోతున్న దొంగలను వెంటాడిన పోలీసులు జరిపిన కాల్పుల్లో వారిలో ఒకరికి బుల్లెట్ గాయమైనా పరారయ్యారు. కానీ, వేట కొనసాగించిన పోలీసులు ఆ దొంగలను 48 గంటల్లోనే కటకటాల్లోకి నెట్టారు. ఈ హైవోల్టేజీ యాక్షన్ ఎపిసోడ్ ఇటీవలే హైదరాబాద్‌లో జరిగింది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ



మిగతా 9వ పేజీలో...



మద్యం మత్తులో డ్రైవింగ్.. ఓఆర్ఆర్‌పై

ప్రైవేటు బస్సు బోల్తా

12

మహిళ మృతి, 16 మందికి గాయాలు

వివిధ

బొమ్మలు: అక్బర్



సమాంతర రేఖలు

1
ఎక్కడో ఆగిపోతారు వాళ్ళు
ఆ పాత సంగతులనే దుక్కీ దున్ని
పొడవు వెడల్పులను కత్తిరించి
అరచేతి పరిమాణానికి ప్రపంచాన్ని కుదించి

2
మనిషి సంకుచితాలన్నీ
అభ్యంతరాలుగా రూపుదిద్దుకుంటాయి!
సాకులని చంకనపెట్టుకుని
ప్రపంచం ఎప్పుడూ కుంటుతూనే ఉంటుంది!

3
ఏ ఇదమిత్థాలలో లేని లోకమా,
బహుశా ప్రేమ బానిసత్వమన్న నెపం వేసి
ఏ దయను తాకవనుకుంటా

4
వ్యాపిస్తున్నట్లుగా కనిపిస్తూ
కుంచించుకుపోవటం నీకు తెలిసిన విద్య
విస్తరించే ప్రతిసారి
గాయాలతో లోపలికి తెరుచుకోవటం
నేను తప్పించుకోలేని బలహీనత!

5
సంకోచ వ్యాకోచాలకి
ఎవరికి అర్థాలు వారే ఇచ్చుకునే
ఆత్మ సంతృప్త జీవులు మనుషులు!

ఓ ప్రపంచమా
అందుకేనేమో..
నువ్వు చెప్పే మరణాలు నావి కాదు
నేను చెప్పే మరణాలు నీవి కాదు!

6
దేని ప్రత్యేకత దానిదే
అన్న వాస్తవాన్ని విస్మరించటం వల్లనేమో
సమాంతర రేఖలుగా మిగిలి
ఇన్ని రాద్ధాంతాలలోకి లాగబడుతున్నాం!

రాళ్ళబండి శశిశ్రీ
74163 99396

కవితాసంపుటాల ఆహ్వానం

కె. శివారెడ్డి కవిత్వ స్ఫూర్తి పురస్కారం - 2024 కొరకు 2023లో ముద్రితమైన కవితా సంపుటాలు మూడు ప్రతులను జూలై 10 లోపు పంపాలి. కవి వయస్సు 35కు మించ రాదు. చిరునామా: ఇబ్రహీం నిర్గుణ్, 15.5. 112/1/బి, స్కైలైన్ టవర్స్ ఎదురుగా, చైతన్య నగర్, ఖమ్మం-507002. ఫోన్: 90636 96968.

ఇబ్రహీం నిర్గుణ్

గీతమ్ పురస్కారం

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్తమ కవితా సంపుటాలు, కథా సంపుటాల పోటీకి 2016 - 2024 మధ్య విడుదలైన పుస్తకాలు మూడు ప్రతులను జూలై 5 లోగా పంపాలి. అత్యుత్తమ సంపుటికి రూ.10116/- నగదు, జ్ఞాపికతో పురస్కారం ఉంటుంది. చిరునామా: ఓలేటి వెంకటేశ్వర రావు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450. వివరాలకు: 98483 98240.

ఓలేటి వెంకటేశ్వర రావు

వర్తన సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అయిదవ సమావేశం జూన్ 25 సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ సమావేశంలో 'తెలంగాణ నాటకం తీరుతెన్నులు' అనే అంశంపై తాటికొండాల నరసింహారావు ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి రూప్ కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'రేపటి మైదానం' కవితా సంపుటి

ఎన్. గోపి 75వ జన్మదినం సందర్భంగా తాజా కవితాసంపుటి 'రేపటి మైదానం' ఆవిష్కరణ జూన్ 25 సాయంత్రం 6 గంటలకు పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్.టి.ఆర్. ఆడిటోరియంలో జరుగుతుంది. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ ఆవిష్కరిస్తారు. వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారు. సభలో రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, సూర్యా ధనంజయ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎస్. రఘు, వంగల హర్షవర్ధన్ ఎస్. జతిన్ కుమార్, పుప్పాల శ్రీరామ్, జె. నీరజ పాల్గొంటారు.

కుడికాల వంశీధర్

పరిణత వాణి ప్రసంగం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో కవి, అనువాదకులు వై. ముకుంద రామారావు తమ జీవితం సాహిత్యంపై ప్రసంగించే 'పరిణతవాణి' కార్యక్రమం జూన్ 24 సాయంత్రం 5.30 నిమిషాలకు దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తిలక్ రోడ్, హైదరాబాద్‌లో జరుగుతుంది.

జె. చెన్నయ్య

శ్రీనాథ సాహిత్యంపై ప్రసంగం

రాజాం రచయితల వేదిక 113వ సమావేశం అల్తి మోహనరావు అధ్యక్షతన జూన్ 30 ఉదయం 10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో విద్యా నికేతన్ పాఠశాలలో జరుగుతుంది. 'శ్రీనాథ సాహిత్య విహంగ వీక్షణం' అంశంపై నేతేటి గణేశ్వరరావు ముఖ్య ప్రసంగం చేస్తారు.

గార రంగనాథం

సమతావాది కవిత్వోపనిషత్తు



ఈ ఏడు డా. ఎన్ గోపీ గారికి డెబ్బై నాలుగేళ్ళు నిండి డెబ్బై ఐదు వస్తుంది. పదిహేడేళ్ళ ప్రాయంలో తొలి కవిత వ్రాసిన ఈ కవి తన 29వ కవితా సంపుటి ('రేపటి మైదానం') ఆవిష్కరించబోతున్నాడు. జీవితంలో ఇంత కాలం సుసంపన్నమైన కవిత్వం రాయడం పట్ల వర్తమాన భవిష్యత్తరాలు సంభ్రమాశ్చర్యాలతో కళ్ళప్పగించి చూస్తాయనడంలో అతిశయోక్తి లేదు. కవిత్వంతోబాటు విమర్శ, పరిశోధన, అనువాదాలు, యాత్రా చరిత్రలు, పాఠ్యగ్రంథాలు, వ్యాఖ్యానాలు, సభలు, సమావేశాలు- ఒక మానవ మాత్రుడికి ఇంత వ్యాపకం ఎలా సాధ్యపడింది? తెలుగు వచన కవిత్వ చరిత్రలో ఈ సృజనకారుడి స్థానమేమిటి?

ఏ కవైనా తొలినాళ్ళకీ, తదనంతర జీవన దశలకూ ఖచ్చితంగా మార్పు చెందుతాడు. ఒక అరవై ఏళ్ళ గోపీ కవిత్వాన్ని పుస్తకాలవారీ విభజించి చూసినా, అవి ప్రచురించిన కాల ప్రాధాన్యంలో పేర్చినా, మనకు కొంత చిక్కు వచ్చే ప్రమాదమే ఎక్కువ ఉంది. అత్యంత చలన శీలత గలిగిన గోపీ కవిత్వ పరిణామాల్ని ఒక దశకీ, చట్రానికీ లోబడి చూడటం కష్టం. ఏ పుస్తకంలో కవిత ఏలాంటి గొంతుతో పలికింది? ఎటువంటి భావాన్ని ఎంత సాంద్రంగా విప్పి చెప్పింది? అది గోపీ రాసిన ఆయా కాలపు కల్లోలాల్ని, సంఘర్షణని సరిగ్గా ప్రతిబింబించిందా లేదా? వస్తుశిల్పాల సమన్వయం ఎటువంటిది? భాషలో విశేషణాలను ఈ కవి నిజంగానే పరిహరించాడా? వంటి రకరకాల సందేహాలు వస్తాయి. డెబ్బై-ఎనభైల విప్లవ పోరాట ప్రభావం, తదనంతర అస్తిత్వవాద విచారమూ ఈ కవిలో సూచ్యంగా ప్రదర్శిత మైనాయి. గోపీ సాహిత్య స్వభావం వాదాలకు భిన్నంగా స్వతంత్రంగానే ఉన్నది. ఈతని కవిత్వంలో 'ఉధృతమైన' తెలంగాణ ఉద్యమ ధోరణి కన్నా నిలకడగా అక్కడి జీవన రూపం ఎక్కువ ప్రతిబింబించింది. ఉద్రేక పూరితంగా గాక మృదువైన నిరసన కలిగి ఉంది. కవిది స్థూలంగా ఆర్ద్రత నిండిన ఆలోచనాత్మక స్వరం కావటాన ఎక్కువగా ఆ నేలపై జన ధనస్వామ్యాల ప్రభావ (ఉద్యమం వర్సెస్ రాజకీయం) వివరం చెబుతాడు. 'శాపగ్రస్త తెలంగాణ', 'గుర్తుకొస్తున్నారు', 'సమరంలో అమరం', 'సారాంశం', 'నిప్పును లేపకండి' కవితల్లో తెలంగాణ ప్రాంత సంవేదన, సంస్కృతి నిండి ఉంటుంది. 'రండి, రెండు రాష్ట్రాలను ఆశీర్వదిద్దాం, రెంటికీ మధ్య పూలకంచెను నిర్మిద్దాం, ఏం పరవాలేదు' (మరో సంకల్పం) అన్న గోపీ సమతా, సామరస్యవాది.

గోపీ సామాన్య జన జీవన మూలాన్ని 'పల్లెసూక్తం'గా ప్రవచించాడు. సైప్రస్ వెళ్ళినా, నయాగరాలో తడిచినా, 'పల్లె నా జ్ఞాపకాల ముల్లె, ఎప్పటికీ తరగని పరిమళాల మల్లె' అని తన పల్లె మట్టిని కళ్ళకద్దుకున్నాడు. ఏ శక్తీ నిలువరించలేకపోయిన ప్రపంచీకరణ, నగరీకరణ పరిణామ దశల్ని కార్యకారణ సహితంగా గోపీ కవిత్వంలో చూడవచ్చు.

గోపీ కవిత్వ దృక్పథం 'మానవ స్వేచ్ఛా కాంక్ష' కలిగినది. కలిసిన మనుషులూ, తిరిగిన ప్రదేశాల ప్రస్తావన కవితల్లో చాలా ఎక్కువ. ఒక సామాన్యుడు, అందునా మధ్యతరగతి మూలాలున్న పల్లెటూరివాడవటం చేత, మనిషి అంతశ్చేతనపై ఆయా వెలుపలి శక్తుల ప్రమేయాన్ని గోపీ సరిగ్గా పసిగట్టాడు. శ్రీలంక, కాశ్మీరు, లండన్, హైదరాబాద్, ఈశాన్య భారతం వంటి ప్రదేశాలపై రాసిన కవితల్లో అక్కడి మతతత్వ, రాజకీయ, పెట్టుబడిదారీ ప్రతిఫలనాలున్నాయి. ప్రయాణ కవిత్వ పరిశీలనలో కవి ముఖ్యంగా 'సౌందర్యాన్వేషి'. యాత్రా చిత్రణ స్వభావం చాలావరకూ ఆనందకారకమై ఉంటుంది. పర్యటించిన ప్రదేశం అతనిలోకి ప్రవేశించి రాగద్వేషరహితుణ్ణి చేస్తుంది. ప్రదేశాలకు ఉండే ఉదాత్తమైన చారిత్రక ప్రేరణల్ని పాఠకుడు తనలో తానే వెతుక్కునేట్టు చేస్తాడు. కవిత్వానుభవానికీ, సంచార గుణానికీ లంకె వేస్తాడు. కవి చతురతకు ప్రయాణ కవితలు కరదీపికలు.

గోపీ పట్టణ ప్రాంత మధ్యతరగతి జీవన దౌర్బల్యాల్ని వ్యవహార భాషలో కవిత్వీకరించాడు. అతనిలో నిర్వచనాలకి, అనుప్రాసాదులకు ప్రాధాన్యం ఉన్నది. పదవైచిత్రిని మరువలేదు. ఉపమాలోలత్వం జాస్తి. అభివ్యక్తి సుందరి మృదు స్పర్శకి దాసుడు. అతని నాస్టాల్జియాలోని ఉద్వేగానికి కొంత వర్గ లక్షణమూ (వడ్ల గిర్నీ), సామాజిక చైతన్యమూ (మా ఊరి చెరువు, మేస్త్రీ కొడుకు) ఉండటం చేత అవి కేవలం తలపోతగానో వలపోతగానో మాత్రమే మిగిలిపోలేదు. ఆ విలక్షణత వలనే గోపి రచనలు పలు భాషల్లోకి వెళ్ళి ప్రజల ఆమోదం పొందాయి. గోపీ కవితలే కాదు ఎవ్వరి రచనలైనా సామాన్యుడికి చేరడం అన్నింటికన్నా ముఖ్యమైన విజయం. బహుశా 'ప్రజా కవి వేమన' పరిశోధక రచనవల్ల గోపి కవిత్వ దృక్పథం సామాన్యుడి జీవితంలోకి మరింత తొంగి చూడగలిగింది. సామాజిక వ్యవస్థని సూక్ష్మతరంగా పరిశీలించిన వేమన కవిత్వం నీతి ప్రబోధకమైనది. సరళ పద్యరూపంలో ఉన్నది. గోపీ, అదే భావాంశ సమర్థనని, సందేశాత్మక రీతిని (మరీ ముఖ్యంగా నానీలలో), గుణప్రాధాన్యంగా వచన కవిత్వంలో సాధన చేశారు.

కవిత్వానికి కాబట్టని విషయమేలేదన్న గోపీ మాట 'కాదేదీ కవితకనర్హం' అన్న శ్రీశ్రీని జ్ఞాపకానికి తెస్తుంది. అయినప్పటికీ కంటబడిన ప్రతిదాన్నీ కవితామయం చేయడం వైవిధ్యమనిపించుకోదు. కవి నిరంకుశత్వానిక్కూడా కొంత 'అదుపు' (restrain) తప్పనిసరి. ప్రతి కవికీ అనుభూతి అతిరేకత నుంచి తప్పించుకునే ఎగ్జిట్ బోర్డులూ ఉండితీరాలి. పిన్నీసు, అంగి, జల్లెడ, పార, బొంత, చెంబు, టెలీఫోన్, స్కూల్ గంట, నిచ్చెన, అద్దం వంటివాటిపై కవితల్ని చూస్తే గోపీ జీవితంలోంచి కవిత్వాన్ని వేరు చేయలేని మమకారమూ, అశక్తతా ఉన్నాయి. అది బలహీనతగా కొంతమంది, బలముగా మరికొంతమంది నిర్ణయించి ఉన్నారు. రారా తిలక్ భావుకత్వ లక్షణం పట్ల వ్యాఖ్యానిస్తూ కించిత్ ప్రేరణకు కూడా చలించిపోగల సుకుమార హృదయ స్పందన శక్తి అందుకు కారణమంటాడు. పరిణతి చెందిన కవికి తన కవిత్వేతివృత్తం పట్ల ప్రేమాభిమానాలు సరే, సముచిత గౌరవం, పట్టింపూ తప్పనిసరిగా ఉంటాయి. గోపీ అనేక ఉదాత్తమైన కవితా వస్తువులతోబాటు కొన్ని అప్రధాన వస్తువులనూ స్వీకరించారనిపిస్తుంది. అయితే ఎటువంటి వస్తువునైనా గొప్పగా నిర్వహించగల శిల్పచాతుర్యం గోపీ ప్రత్యేకత. అనుభవం అసలు సంపద. వచన కవిత్వానికి సంప్రదాయబద్ధమైన నియమ రాహిత్యాన్ని, వచన కవికి లక్షణ నిర్దేశం లేని సౌలభ్యాన్ని గోపీ చాకచక్యంగా వినియోగించుకున్నారు. అన్నింటికన్నా గోపీ కవిత్వాశయం (main idea) గొప్పదై ఉండటం చేత అతని 'విరివి' సమకాలికుల నుండి నేర్పుగా విడివడి విమర్శను తట్టుకున్నది. లోకజ్ఞత (commonsense), చమత్కృతి (conceit) వలన అత్యంత పాఠకాదరణ చూరగొన్నది.

సినారె కవితా లక్షణాలైన శబ్దప్రేమ, వర్ణనాధిక్యత, భాషా పటిమ, భావ నిగ్రహములలో కొన్ని గోపీ వంటి 'రసరమ్య' కవులకు్కూడా అబ్బినాయంటే అతిశయోక్తి కాదు. (స్మృతికవితల్లో మరింతగా) లయను గమనించవచ్చు. గోపీది కూడా తిలక్ వలె కరుణరస ప్రధానమైన కవిత్వమైనప్పటికీ అది కేవలం 'అందమైన కరుణరసం' కాదు. సత్యతగల (verity) కరుణ. అందుకు నేత కార్మికుల వలస దీనత్వాన్ని చిత్రించిన 'ఓ రాజయ్య కథ' (1991) సాక్ష్యము.

గోపీ కాళోజీ, బాలగోపాల్, చేరా, వంటి వాళ్ళపై ఎన్నో స్మృతి కవితలు వ్రాసినప్పటికీ వాళ్ళమ్మాయి గురించిన 'మా అమ్మాయి', 'మృత్యు దుఃఖం' కవితలు మనకి ఊపిరాడనివ్వవు. గోపీ కవిత్వం మరింత మానవీకరణ చెందడంలో వాళ్ళమ్మాయి మృతి వేదన (1996), పరితాపము అంతర్లీనంగా ఉన్నాయి. "నరనరాల్లో ప్రసరించే సూదిలాగ, మా అమ్మాయి మరణం బాధారుణ సంగీతంలా తరుముతుంది. చివరి శ్వాస దాకా అదే నా నేపథ్య శృతి" అంటాడు. అతని భరింపరాని వ్యక్తిగత వేదన రస ప్రాధాన్యంగా, విషయ సంగ్రహంగా నిర్మాణాత్మక పద్యంలోకి బదిలీ అవుతుంది. ఉపనిషత్సమానమైన జ్ఞాన సారాంశాన్ని, ఆధునిక జీవన వేద రహస్యాలను వివేకవంతంగా గోపీ కవిత్వీకరించాడు. నానీలు (1997), జలగీతం (2002), వృద్ధోపనిషత్ (2019) ప్రపంచీకరోనా (2020) వంటి కావ్యాలు, కావ్య రూపాలు అందుకే చాలా విజయవంతమైనాయి.

> **గోపీ సామాన్య జన జీవన మూలాన్ని 'పల్లెసూక్తం'గా ప్రవచించాడు. సైప్రస్ వెళ్ళినా, నయాగరాలో తడిచినా, 'పల్లె నా జ్ఞాపకాల ముల్లె, ఎప్పటికీ తరగని పరిమళాల మల్లె' అని తన పల్లె మట్టిని కళ్ళకద్దుకున్నాడు. ఏ శక్తీ నిలువరించలేకపోయిన ప్రపంచీకరణ, నగరీకరణ పరిణామ దశల్ని కార్యకారణ సహితంగా గోపీ కవిత్వంలో చూడవచ్చు.**


గోపీ కవిత్వం, వినిమయలోకపు విచిత్ర పోకడలతో రాజీలేని సంఘర్షణ పడ్డది. ఈ కవి ప్రతీకల రహస్యాన్ని అనాయాసంగా దొరకబుచ్చుకున్నాడు. గోపీకి బ్లాగ్ లేదు. వెబ్‌సైట్ ఊసూ తెలియదు. కానీ ఆధునిక కవిత్వ మాంత్రికతకి మాత్రం సాఫ్ట్‌వేర్ కనుగొన్నాడు. క్లుప్తతకన్నా అధికంగా ప్రభావశీలతని, గుప్తతని, అంతకుమించి ఆప్తతని పొదవుకుని కవిత్వాన్ని జీవన భాషగా పలికించిన సిద్ధుడు గోపీ. తంగేడుపూలు సంపుటికి ముందుమాట రాస్తూ 'నేను కవిత్వంలో గుణాన్నే కాకుండా, పరిమాణాన్ని కూడా చూస్తాను' అన్నారు కుందుర్తి. ఈ డెబ్బై ఐదేళ్ళ కుర్రాడు పెద్దాయన మాటని మర్చిపోలేదు.


(జూన్ 25 ఎన్. గోపీ 75వ జన్మదినోత్సవం)

శ్రీరామ్ పుప్పాల
99634 82597

ఉద్యమాల భూమిలో యుద్ధగీతిక

ఆధునిక సామాజిక, రాజకీయ ఉద్యమాలను చూస్తే పాట నిర్వహించిన చరిత్రకు ప్రశస్తమైన పాత్ర ఉన్నది. జాతీయోద్యమ కాలాన బంకిం చంద్ర చటోపాధ్యాయ రాసిన 'వందేమాతరం', బంగ్లాదేశ్ ఆవిర్భావంలో టాగూరు రాసిన 'సోనార్ బంగ్లా' పాటలు చారిత్రాత్మకమైన పాత్ర నిర్వహించాయి. సరిగా అదే పరంపరలోనిదే గాయకుడు, కవి అందెశ్రీ రాసిన పాట 'జయ! జయ! జయహే తెలంగాణ!' అన్నది. అది తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా యుద్ధగీతమై నిలిచింది. ఈ నేపథ్యంలో అందెశ్రీ తెలంగాణ సమాజం చవి చూసిన ఉద్యమాల భూమికలో వెలువడిన పాటల సంకలనాన్ని కూర్చి తానే సంపాదకత్వం వహించి నిప్పులవాగు (1940-2014) పేరుతో 1307 పేజీలతో బృహత్తర గ్రంథరాజాన్ని వెలువరించాడు. తెలంగాణ, తెలుగు సాహిత్యచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఈ గ్రంథానికి ముందు మాటలు రాసిన వారిలో ప్రముఖవిమర్శకులు అంబటి సురేంద్రరాజు, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె. శ్రీనివాస్ ఉన్నారు.





తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఆధునిక కవితా సంకలనాలు తెలంగాణ నుంచి వెలువడ్డాయి. నిజాం కాలం నాటి తెలంగాణలో గోలకొండ కవుల సంచిక వెలురించి సురవరం ఆనాటి కాలపు పురిటి నొప్పులను గ్రంథస్థం చేస్తే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం చవి చూసిన భిన్న ఆలోచనా స్రవంతులను, వైవిధ్యమైన అభివ్యక్తి రూపాలను, అందులో ప్రచలితమైన ఆశయాలను, ఆదర్శాలను, ఆశ నిరాశ విషాదాలను ఈ సంకలనం నిక్షిప్తం చేసుకున్నది. పాటలు, వచన కవితల ఎంపికలో చరిత్రాత్మక దృష్టి ఉండడం వల్ల ప్రజాస్వామిక స్ఫూర్తి ప్రతిఫలించింది. ఎందుకంటే అమరుల త్యాగాలను కీర్తించే గీతాలతోపాటు ఉద్యమాన్ని, ఉద్యమ నాయకత్వాన్ని విమర్శనాత్మకంగా చూసిన (నెగేషన్ ఆఫ్ నెగేషన్) గీతాలు కూడ ఈ సంకలనంలో ఉన్నాయి. 1940ల నుంచి రాష్ట్రం ఏర్పాటైన కాలం వరకు తెలంగాణ సమాజంలో పరివ్యాప్తమైన పరిస్థితులను, వైరుధ్యాలను తేటతెల్లం చేసే ఈ గ్రంథం పరిశోధకులకు ఒక కరదీపిక.

సాధారణంగా ఉద్యమ కవితా సంకలనాలలో ద్వేషం, కసి, హింసా ధోరణి ఉన్న రచనలు ఉండడం పరిపాటి. కాని అటువంటి పరిమితులను అధిగమించిన సంకలనమిది. దీనికి కారణం సంపాదకుడైన అందెశ్రీ వ్యక్తిత్వమే. జీవితం పట్ల చాలా సానుకూల దృక్పథం ఉన్న ఆయన సంపాదకత్వం వహించడమే. స్త్రీలతో పాటు గిరిజనులు, ఇతర భిన్నమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం ఉన్న సంకలనమిది. గిరిజనులు, ముస్లింలు తెలుగులిపిని తీసుకుని వారి భాషలో రాసిన పాటలను చేర్చడం ద్వారా అందెశ్రీ తెలంగాణ అనేది బహుళ సాహిత్య, భాషా సంప్రదాయాలున్న సమాజమని తేల్చి చెప్పాడు. తెలంగాణ ఘనకీర్తిని, ప్రకృతి, పల్లెల జన జీవిత సౌందర్యాన్ని చిత్రించిన అందెశ్రీ తాత్వికతను అవగాహన చేసుకుంటే బెంగాల్ సమాజంపై అక్కడి ప్రకృతిని, ప్రశస్తిని విశదం చేస్తూ వందలాది పాటలను రాసిన టాగూరు గుర్తుక రాక మానదు.

సామిడి జగన్ రెడ్డి
85006 32551

మరాఠీ రంగస్థలంపై యువతరం బావుటా

ఇటీవల పూణేలో - మరాఠీ నాటక రంగంలో విశేషమైన విధులను నిర్వహిస్తున్న రాజేంద్ర ఠాకుర్‌దేశాయ్‌ని కలుసుకొని చర్చించే అవకాశం ఈ వ్యాసకర్తకు లభించింది. రాజేంద్ర ఠాకుర్ దేశాయ్ ఒక బిజీ లాయర్. రంగస్థల నటుడిగా, దర్శకుడిగా అనుభవం ఉన్నవాడు. ప్రస్తుతం 'మహారాష్ట్రీయ కళోపాసక్' సంస్థకు కార్యదర్శిగా ఉన్నారు. ఈ సంస్థ గత అరవై ఏళ్లుగా 'పురుషోత్తం కరండక్' పేరుతో ప్రతీ ఏటా మహారాష్ట్ర లోని కాలేజీ విద్యార్థులకై ఏకాంకిక నాటికల పోటీని నిర్వహిస్తున్నది. ఆనాటి సంభాషణలో ఎన్నో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

తెలుగులో మాదిరిగానే మరాఠీ నాటకరంగం కూడా జానపద, పౌరాణిక, సాంఘిక, ఆధునిక, ప్రయోగాత్మక దశల వెంబడే ప్రయాణించింది. అయితే మరాఠీ నాటకరంగానికి కొన్ని నిర్దిష్టతలు ఉన్నాయి.

మరాఠీ నాటకరంగపు మూల శక్తి గ్రామీణ, జానపద రీతుల్లోనూ, మరాఠీలంతా గర్వపడే చారిత్రక గాథల్లోనూ దాగి ఉన్నది. ఇందుకు మంచి ఉదాహరణలు - నేటికీ ఆబాలగోపాలాన్ని అలరించే శివాజీ సాహసగాథలు, పీష్వాల కాలంలో దేశంలోని అత్యధిక ప్రాంతాలకు విస్తరించిన మరాఠా సామ్రాజ్యం, మొఘల్ సామ్రాజ్యంపై విజయాలు, బ్రిటిష్‌వారితో ఓటమి మిగిల్చిన విషాదం - ఇవన్నీ తరతరాల మరాఠీ పండిత, పామర జనాల హృదిలో శాశ్వతంగా నిలిచిపోయాయి. ఇవన్నీ కూడా కళాకారులకు ముడిసరుకుగా మారి, జానపద కళారూపాల్లోనూ, నాటకాల్లోనూ నేటికీ ప్రతిఫలిస్తూనే ఉన్నాయి.

జానపద, పౌరాణిక మూలాల నుండి ఆధునికత వైపు మళ్లుతున్న దశలో గుజరాతీ, పార్శీ నాటకాల ప్రభావం మరాఠీ నాటకంపై పడింది. అంతకన్నా బలంగా, నిలకడగా, మరాఠీ నాటకాన్ని ప్రభావితం చేసినవి పాశ్చాత్య నాటకాలు. ముఖ్యంగా షేక్‌స్పియర్, మోలియర్, ఇబ్సెన్, చెఖోవ్‌ల నాటకాలు; ఆ మాటకొస్తే ఉత్తమ ప్రపంచ సాహిత్యం మరాఠీ నాటక రచయితలను ఉత్తేజపరచింది. బెంగాల్‌లో కూడా, కలకత్తా కేంద్రంగా ఇదే జరిగిందని కొంతమంది మిత్రులు చెప్పారు.

ప్రభావాలు, ప్రేరణలు ఎన్ని ఉన్నప్పటికీ మరాఠీ నాటకాలేవీ తమ స్థానికతను, విశిష్టతను పోగొట్టుకోలేదనే చెప్పాలి. అదే సమయంలో సాహసోపేతమైన ప్రయోగాలు చెయ్యడంలో, గతకాలపు గాథలకు ఆధునిక వ్యాఖ్యానాలను అందివ్వడంలో మరాఠీ నాటక రచయితలు ముందున్నారు.



ప్రభావాలు, ప్రేరణలు ఎన్ని ఉన్నప్పటికీ మరాఠీ నాటకాలేవీ తమ స్థానికతను, విశిష్టతను పోగొట్టుకోలేదు. అదే సమయంలో సాహసోపేతమైన ప్రయోగాలు చెయ్యడంలో, గతకాలపు గాథలకు ఆధునిక వ్యాఖ్యానాలను అందివ్వడంలో మరాఠీ నాటక రచయితలు ముందున్నారు.

ఒక వైపు జానపద కళారీతులు, మరోవైపు శాస్త్రీయ సంగీత గాయకులు, వాద్యకారులు మరాఠీ నాటకపు జీవధారలుగా కొనసాగుతున్నారు. సంగీతం వారి నాటకాలలో విడదీయలేని పాయగా పెనవేసుకుపోయింది. ముఖ్యంగా నేపథ్య సంగీతం సృష్టించే ఉద్వేగాల్ని వినియోగించుకుంటూ నాటకీయతను ఉన్నతీకరించడంలో మరాఠీ దర్శకులు సిద్ధహస్తులు. నాటకాన్ని ప్రదర్శించేటప్పుడల్లా మెరుగుపరచవచ్చు; స్థలకాలాలకు అనుగుణంగా తీర్చిదిద్దవచ్చు. ఈ ఎరుకతో మరాఠీ దర్శకులు ప్రతీ ప్రదర్శననీ నిత్యనూతనంగా ఆవిష్కరిస్తారు.

ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్న మరాఠీ నాటకరంగ కృషి, రసజ్ఞులూ విజ్ఞులూ అయిన ప్రేక్షక సమూహాలను పోగు చేసుకున్నది. అయితే అటువంటి ప్రేక్షకులు ఆశించే ప్రమాణాలు చాలా ఉన్నత స్థాయిలో ఉంటాయి. ప్రేక్షకుల ఆకాంక్షలను చేరుకో వడమే కాకుండా ఎప్పటికప్పుడు వాటిని అధిగవింపచడం మరాఠీ నాటకరంగం నిరంతరంగా ఎదుర్కొనే సవాలు.



మహారాష్ట్రీయ కళోపాసక్ సంస్థ కార్యదర్శి రాజేంద్ర ఠాకుర్‌దేశాయ్ (కుడివైపు) తో వ్యాస రచయిత

బాలీవుడ్, టీవీ సీరియళ్ల ఆకర్షణ మూలంగా మరాఠీ నాటకరంగం నష్టపోతూ వస్తున్నదనే చెప్పాలి. అయితే బాలీవుడ్ మూలంగా కొంత మంచి కూడా జరిగింది. వాద్యకారులు, ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉంటారు. నాటకరంగ నేపథ్యంతో ఎదిగిన సినీ ప్రముఖులు కొందరు నాటక ప్రదర్శనలు ఇస్తూ, తమ మూలాల ఋణాన్ని తీర్చుకుంటున్నారు.

'మహారాష్ట్రీయ కళోపాసక్' సంస్థ తరపున అరవై ఏళ్లుగా కాలేజీ విద్యార్థులకై నిర్వహిస్తున్న ఏకాంకిక నాటికల పోటీ 'పురుషోత్తం కరండక్'. ఈ పోటీల మొదటి రౌండ్లు రాష్ట్రంలోని ఐదు పట్టణాల్లో (రత్నగిరి, పూణె, కొల్‌హాపూర్, నాగ్‌పూర్/ అమరావతి, ఔరంగాబాద్/ జల్‌గావ్) నిర్వహించబడతాయి. అక్కడి విజేతలు పూణేలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారు. ప్రతి ఏటా ఒకే ఆడిటోరియంలో ఫైనల్స్ జరుగుతాయి (భరత్ నాట్య మందిర్, సదాశివ్ పేట్, పూణే). మహారాష్ట్రలోని నాలుగు పట్టణాలలో జరిగే పోటీలు, అలాగే పూణేలో జరిగే ఫైనల్స్ - వీటి తేదీలను ముందుగానే ప్రకటిస్తారు గనుక ఆయా విద్యార్థులు, కాలేజీలు ఏర్పాట్లు చేసుకుంటారు. ఫైనల్స్‌కి చేరుకోవడమే వారికొక ఘన విజయం. ప్రతీ ఏడూ జరిగే ఈ ఫైనల్స్‌ని చూడడానికి ప్రేక్షకులు ముందుగానే టిక్కెట్లు కొనుక్కొని సీట్లు రిజర్వ్ చేసుకుంటారు. మీడియాతో సహా అందరూ ఉత్సుకతతో ఈ ప్రదర్శనలకై ఎదురుచూస్తూంటారు. ఈ పోటీల్లో నగదు బహుమతి కేవలం ఐదువేల రూపాయిలు మాత్రమే. కానీ యువ కళాకారులకు లభించే గుర్తింపు అద్వితీయం. గతంలో పురుషోత్తం కరండక్ బహుమతులను గెల్చుకున్నవారు చాలామంది ఇప్పుడు ఉన్నతస్థాయికి చేరుకున్నారు. మహారాష్ట్రలోనే కాకుండా జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన వాళ్లల్లో రోహిణీ హత్తంగడి, జబ్బార్ పటేల్, మోహన్ అగాషె వంటి వారు అనేకులు ఉన్నారు.

ప్రభుత్వ విభాగాలు, రాజకీయ నాయకుల జోక్యం లేకుండా తమ కార్యకలాపాలను నిర్వహించుకోవాలనేది ఈ సంస్థ కఠిన నియమం. ముగ్గురు కార్యవర్గ సభ్యులు, న్యాయ నిర్ణేతలకు తప్ప వేరెవ్వరికీ ఉచిత ప్రవేశం ఉండదు. వారి కుటుంబ సభ్యులెవరైనా నాటకాలు (ఫైనల్స్) చూడాలనుకుంటే ముందుగా టిక్కెట్లు కొనుక్కోవాల్సిందే. ఎంత పెద్ద అధికారులకైనా రాజకీయ నాయకులకైనా పాస్‌లు ఇచ్చే ప్రసక్తి లేదు. ప్రభుత్వ, లేదా ప్రైవేటు సంస్థల నుండి విరాళాలు స్వీకరించే సంప్రదాయం లేదు. స్పాన్సర్‌షిప్‌లకు, వాణిజ్య ప్రకటనలకు ఆమోదం లేదు. రెండు మూడు వారాల ముందుగానే టిక్కెట్లన్నీ అమ్ముడు పోతాయి. మూడవ గంట మ్రోగాక ద్వారాలు మూసేస్తారు. ఏ ఒక్కరికీ ప్రవేశం ఉండబోదు.


కళ నిలద్రొక్కుకోవాలన్నా, వృద్ధిచెందాలన్నా విమర్శ అత్యవసరం. అదృష్టవశాత్తూ మరాఠీ నాటకాలను నిర్మొహమాటంగా విమర్శించే నిష్ణాతులున్నారు. వాళ్ల అభిప్రాయాలకై ఆసక్తిగా ఎదురుచూసే కళాకారులు, దర్శకులు, ప్రేక్షకులు ఉన్నారు. విమర్శలను సహృదయంతో స్వీకరించే సంప్రదాయం ఉంది. అరవై ఏళ్లపాటు అవిరామంగా ఈ పోటీలను ఉన్నత ప్రమాణాలతో, ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం సామాన్యమైన విషయం కాదు.

ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల మధ్య, భాషలమధ్య సాంస్కృతిక రంగంలో ఇచ్చిపుచ్చుకోవడాలూ, ఒకరినుండి ఒకరు నేర్చుకోవడం కొనసాగుతూనే ఉండాలి అని బలంగా అనిపించింది. ముఖ్యంగా మరాఠీ, తెలుగు నాటకరంగాల అన్యోన్యత ఈ నాటిది కాదు. 'ధార్వాడ నాటక సమాజం' వారి ప్రదర్శనలు ఆధునిక తెలుగు నాటకరంగానికి అందించిన ప్రేరణతో కందుకూరి వీరేశలింగం, 1880లో మొదటి తెలుగు నాటక ప్రదర్శన చేబట్టారు. మహారాష్ట్ర నుంచి వలస తోలు బొమ్మలాట కళాకారులు, కడప పట్టణానికి సమీపాన ఉన్న సురభి గ్రామానికి వలస వచ్చి, స్థానిక జమీందారు ఆదరణతో 'కీచకవధ'ని నాటకరూపంలో తొలుత 1885లో ప్రదర్శించారట. ఊరూరా తిరుగుతూ, 'ప్రేక్షకుల వద్దకే ప్రదర్శన'ను తీసికెళ్లే ధార్వాడ కంపెనీ సంప్రదాయాన్ని సురభి నాటక సంస్థ అనుసరించింది. ఆ విధంగా వారి ప్రాభవం తెలుగు రాష్ట్రాల నలుచెరగులనూ చేరుకుంది.

'మహారాష్ట్రీయ కళోపాసక్' వంటి స్వచ్ఛంద సంస్థలు మనకి లేకపోలేదు. అజో-విబో-కందాళం సంస్థను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అయితే, యువతరానికై ప్రత్యేకించిన 'పురుషోత్తం కరండక్' స్థాయి పోటీలు లేవు. మనకి నాటకరంగం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తులు అనేకులున్నారు. వాళ్లు పూనుకుంటే, మహారాష్ట్రలో సాధ్యమైన విజయాన్ని మనం కూడా ఒక రోజున కళ్లారా చూడగలం. ఏదైన మన దృష్టిని, వనరులను యువతరంపైనే కేంద్రీకరించాలి. వాళ్లే మన ఆశాజ్యోతులు.

(ఈ సంభాషణను 2024, మే 12న పూణేలో స్థానిక సాహిత్యాభిమాని మండపాక లింగమూర్తి నిర్వహించారు.)

ఉణుదుర్తి సుధాకర్
90006 01068



జుగల్‌బందీ

ఇదిగో.. ఇప్పుడు
ఇక్కడ తేరగా దొరికే సాంగత్యాన్ని
ఎందుకు నిర్లక్ష్యం చేస్తావో తెలియదు.
ఖాళీ పాత్రలను
వెన్నెలో
వెలుగో
చీకటో పూరించినట్టు
వదిలి వెళ్ళిన జీవితాన్ని
మరేదీ పూరించలేదు.

కావాలనే వదులుకుంటాం
పోనీలే..
మరెప్పుడు కలుసుకుందామో
నువ్వే చెప్పు
ఈ సజీవ క్షణం ఇప్పుడే ముగిసిపోయాక..

ఎండి రాలిపోయి పువ్వుల్ని
కుప్పగా పోసి
నిప్పంటించాక
వాటి పరిమళాలను
ఎవరు తలపోసుకుంటారు
పూల పుట్టుక వనానికి కొత్తేం కాదుకదా..
కాకపోతే పోయిన వాటి లెక్కలే తేల్చమంటాను.

ఇద్దరం
ఒకే కాలరేఖపై నడయాడినా
మనల్ని కలిపే సరళరేఖనే గీసుకోలేకపోయాం
నీలిసముద్రపు తీరంలో
నాకైతే కొన్ని రంగుల గవ్వలు శంఖాలు దొరికాయి
మరి నీవేమి పొందావో నాకు తెలియదు కదా.

నా అరణ్యపు దారిలో
కొంత ఎండ పొడ, పేరు తెలియని చెట్లూ పూలు
లోతు ఎరుగని కొండవాగులు
రెల్లుపూల వసంత కాలాలు
నీడలుగా విస్తరించిన శ్రావణ మేఘాలు
ఉదయసంధ్యల శుకపికాల శ్రావ్యపేయ రాగాలు

కొన్ని మధూదయాలు
అరుదుగా కనిపించిన మహోదయాలు
నేను వేణువవుతాను
నువ్వు విను. లేదా..
పిట్ట గొంతుగా నువ్వు పాడు
నేను నీలో వాయులీనమవుతాను

మణీందర్ గరికపాటి
99483 26270



హనుమకొండ డీసీసీ భవన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

ఐటీఐలకు మహర్దశ

ఏటీసీలుగా మారనున్న ఐటీఐలు



ములుగురోడ్డులోని హనుమకొండ ఐటీఐ, వరంగల్ ఐటీఐ

- టీటీఎల్‌తో ఒప్పంద ఫలితం
- ఉమ్మడి జిల్లాలో ఏటీసీలుగా మూడు ఐటీఐలు
- ఒక్కొక్కదానిపై రూ.50కోట్ల వ్యయం
- కొత్తగా ఆరు ఆధునాతన కోర్సులు
- ఆధునిక హంగులతో కొత్త భవనాల నిర్మాణం
- అడ్డంకిగా మారుతున్న స్థలాల కొరత

హనుమకొండ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : అరకొర వసతులతో కూనారిల్లుతున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటీఐ)లు త్వరలో కొత్తరూపును సంతరించుకోబోతున్నాయి. కాలం చెల్లించిన సంప్రదాయ కోర్సులతోనే ఇప్పటికీ నెట్టుకువస్తున్న ఈ ఐటీఐలలో ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ఆధునాతన సాంకేతిక కోర్సులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అన్ని హంగులతో కూడిన ప్రత్యేక భవనాల నిర్మాణం జరుగబోతున్నది. దీనితో ఐటీఐలంటే విద్యార్థులు, వారి తల్లితండ్రులు చిన్నచూపు చేసే పరిస్థితి మారనున్నది. ఐటీలను ఆధునాతన సాంకేతిక శిక్షణా సంస్థలుగా (ఏటీసీ) మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీ లిమిటెడ్‌తో (టీటీఎల్) ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో వాటి దశ, దిశ మారనున్నది.

ఉమ్మడి జిల్లాలో మూడు...

రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటీఐలను ఏసీటీలుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మొదటి విడతగా 20 ఐటీలను ఏటీసీలుగా మార్చుతారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్‌లోని మూడు ఐటీఐలు ఏసీటీసీలుగా మారనున్నాయి. వరంగల్. ఏటూరునాగారం, భూపాలపల్లిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (బాలురు)లు వీటిలో ఉన్నాయి. వీటితో పాటు కాజీపేటలోని మరో ప్రభుత్వ ఐటీఐ కూడా ఏటీసీగా మారనున్నది. ఈ ఒక్కొక్క దానిపై రూ.50కోట్ల వరకు ఖర్చు చేస్తారు. టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంతో రూ.2324 కోట్ల వ్యయంతో వీటిని అప్ గ్రేడ్ చేస్తారు. ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగంగా ఈ ఐటీఐలలో ఆదునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇస్తారు. ఇందులో కోసం ఆధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణులతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.



కాజీపేటలోని ఐటీఐ

ఆరు ఐటీఐలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం ఆరు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేట, భూపాలపల్లి, ఏటూరునాగారం, మహబూబాబాద్‌లలో ఇవి ఉన్నాయి. ప్రైవేటు ఐటీఐలు మరో 15 వరకు నడుస్తున్నాయి. మూడు మహబూబాబాద్‌లో ఉండగా, మిగతావన్ని వరంగల్‌లోనే నడుస్తున్నాయి. ఐటీఐల పట్ల విద్యార్థులు అంతగా ఆసక్తి చూపకపోవడంతో ప్రైవేటు ఐటీల సంఖ్య క్రమంగా తగ్గింది. గతంలో ఉమ్మడి వరంగల్‌లో 30వరకు ఉండేవి. ప్రవేశాలు లేకపోవడంతో కొన్ని మూతపడ్డాయి. ప్రభుత్వ ఐటీఐలు అరకొరత వసతులతో నడుస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐలలో 40 ఏళ్లుగా పది వరకు సంప్రదాయ కోర్సుల్లోనే శిక్షణ ఇస్తున్నారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ప్లంబర్, వెల్డర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, టర్నర్, డ్రాట్స్‌మెన్ సివిల్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర కోర్సులు వీటిలో ఉన్నాయి. ఇవన్నీ పాలకాలపు ట్రేడులు.

ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సులు

ఆధునాతన సాంకేతికత పరిజ్ఞానం పెరిగింది. పారిశ్రామిక రంగంలో అనేక మార్పులు వచ్చాయి. నూతన సాంకేతిక ప్రక్రియలతో అవి నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఐటీఐలో నేర్చుకున్న కోర్సులు బయట ప్రపంచంలో ఉద్యోగావకాశాలను కల్పించడం లేదు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సరికొత్త కోర్సులను అభ్యసించినప్పుడే భవిష్యత్తు ఉంటుంది. టాటా వంటి కంపెనీలకు అవసరమైన సిబ్బంది దొరకకపోవడానికి కారణం పాత ట్రేడ్‌లనే విద్యార్థులు నేర్చుకోవడం. ఈ కొరతను తీర్చడానికి టీటీఎల్ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ఉపాధి అవకాశాలు పొందగలి గేలా వారిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంగా భాగంగా ఐటీఐ సర్కి ల్ డెవప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగస్వామి అయింది. ఇందులో భాగంగా టీటీఎల్ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా. ముఖ్యంగా తమ కంపెనీకి సరిపడే వృత్తినిపుణులను తయారు చేయడానికి ఆరు ఆధునాతన ట్రేడ్‌లను ఈ ఏసీటీల్లో ప్రవేశపెట్టనున్నది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్, అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటో మిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వా న్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్) వీటిలో ఉన్నాయి. ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్‌లో ఒక్కొక దానిలో 40సీట్లు, మిగతా కోర్సుల్లో 48సీట్ల చొప్పున ఉంటాయి. దీనితో ఏటీసీలుగా మారే ఈ మూడు ఐటీఐలలో ఒక్కొ కదానిలో సుమారు 250 సీట్లు విద్యార్థులకు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఏటీసీల ఏర్పాటుతో ఉపాధి అవకాశా లు పెరిగే అవకాశం ఉంది.

ప్రత్యేక భవనాలు

ఏటీసీల ఏర్పాటుకు అన్ని హంగులతో కూడిన ప్రత్యేక భవనాలను ఒకొక్కదానిని రూ.5కోట్లతో నిర్మిస్తారు. టీటీఎల్ నిర్దేశిత ప్రమాణాల

మిగతా 6వ పేజీలో..



ఏటీసీల ఏర్పాటుపై స్పష్టత రావలసి ఉంది..

పి.వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఐటీఐ ఏటూరునాగారం

అడ్వాన్సుడు ట్రేనింగ్ సెంటర్ (ఏటీసీ) అనేది పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో ఒక భాగం. ఇందులో కొత్తగా టాటా టెక్నాలజీ లిమిటెడ్ వారు ఆరు ట్రేడులు ప్రవేశపెడుతున్నారు. ఇందు కోసం ఐటీఐ మొత్తాన్ని ఏటీసీ అంటారా లేదా అనే విషయం ఇంకా స్పష్టత రావలసి ఉంది. ప్రస్తుత ఐటీఐలో కొన్ని ట్రేడులు నడుస్తున్నాయి. అడ్వాన్సుడు ట్రేడులు అనేవి టీటీఎల్ ప్రవేశపెట్టనున్న ఆ ఆరు ట్రేడులే కానీ ప్రస్తుతం ఉన్న ట్రేడులతో కలుపుకొని ఐటీఐ మొత్తం కాదుకదా? ప్రభుత్వం నుంచి అందే మార్గదర్శకాలను బట్టి ఐటీఐల కొత్త రూపు, నిర్వహణ ఉంటాయి. ఉమ్మడి జిల్లాలు ఆరు ప్రభుత్వ ఐటీఐలలో ఏటీసీల ఏర్పాటుకు సంబంధించి అయిదింటికి ల్యాండ్ క్లియరెన్స్ రావలసి ఉంది. కాజీపేట ఐటీఐకి సంబంధించి అక్కడికి దగ్గరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కొంత స్థల కేటాయింపు జరిగింది.

రుణమాఫీ చారిత్రాత్మకం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

హనుమకొండ సిటీ, జూన్ 23: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించడం చారిత్రాత్మకమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రుణమాఫీపై కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు. బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలక్కు క్షీరాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆవిర్భావం నుంచి రైతుల సంక్షేమానికి ఎన్నో నిర్ణయాలు, సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీకి ఎన్నో కొర్రీలు పెట్టి రైతులను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, విజయశ్రీ రజాలీ, మామిండ్ల రాజుతో పాటు వీరగంటి రవీందర్, నలుబోల సతీశ్, నాయిని లక్ష్మారెడ్డి, మహ్మద్ అంకూశ్, సయ్యద్ రజాలీ, డాక్టర్ రామక్రిష్ణ, బంక సరళ, బంక సంపత్ యాదవ్, ఎంపీ నమతారాజు, గుంటి స్వప్న, సుకన్య, నల్ల సత్యనారాయణ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బల్దియాలో ఆర్ఐల దందా



- బిల్ కలెక్టర్లతో ప్రతీ పనికి వసూళ్లు
- లంచాలు ఇవ్వనిదే పూర్తికాని పనులు
- దరఖాస్తుదారులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్
- కమిషనర్ దృష్టి సారించాలంటున్న ప్రజలు

వివరాలు 5లో..

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 23: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కొద్ది రోజులుగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. సోమవారం బల్దియాలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి ప్రజలు వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు స్వీకరించి త్వరిగతిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.

పదోన్నతుల మిగులు పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 23: ఉపాధ్యాయుల పదోన్నతుల తర్వాత జాయిన్ కాకుండా మిగిలిన ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హనుమకొండలోని యూటీఎఫ్ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కొంతమంది ఉపాధ్యాయులు రెండు, మూడు సబ్జెక్టుల్లో పదోన్నతులు ఎంపిక కాగా, వారు ఒకే ఒక్క పోస్టులో వారు జాయిన్ కాగా, మిగిలిన పోస్టులను తర్వాత సీనియర్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలన్నారు. గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలన్నారు. మల్టీజోన్-1, మల్టీ జోన్-2 లలో జరుగుతున్న ఎస్జీటీల బదిలీల్లో అన్ని ఖాళీలు ప్రదర్శించాలన్నారు. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి, కార్యదర్శులు కె.సోమశేఖర్, సమ్మారావు, రంజిత్ కుమార్, మల్లారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, గురుకుల ఉపాధ్యాయుల కన్వీనర్ ఎల్లయ్య, వివిధ జిల్లాల నాయకులు రవీందర్‌రాజు, పి.రాజు, బి.వెంకటరెడ్డి, టి.కుమార్, సి.సుజన్‌ప్రసాద్‌రావు, చంద్రశేఖర్‌రావు, మురళి, యాకూబ్, వాసుదేవ రెడ్డి, తిరుపతి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమైన జూడాలు

వరంగల్ మెడికల్, జూన్ 23: ఉపకార వేతనాలు చెల్లించి, ఎంజీఎం డాక్టర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టిన జూనియర్ డాక్టర్లు సోమవారం నుంచి సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నా స్పందన కనిపించడం లేదన్నారు. సమ్మె తప్ప మరో మార్గం లేకుండా పోవడంతో ఈ నెల 24వ తేదీన సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించిన తర్వాతనే సమ్మె విరమణ ఉంటుందని స్పష్టం చేశారు. స్టైఫండ్ సకాలంలో విడుదల కోసం గ్రీన్ చానెల్, కేఎంసీ రోడ్ల నిర్మాణం, డాక్టర్ల కోసం కొత్త హాస్టల్ భవనాలు, రెసిడెంట్స్ కోసం సవరించిన గౌరవం వేతనం, వివిధ ప్రభుత్వ ఆస్పత్రులలో భద్రతా సమస్యలు, కొత్త భవనం, యూసీ ప్రాస్పెక్టస్ కోసం నీట్‌లో 15 రిజర్వేషన్ కల్పించాలని జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు.

ఎన్పీడీసీఎల్‌లో వారిదే హవా

వివరాలు 5లో..

- ఉద్యోగ సంఘాల పేరుతో ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట
- పోస్టింగ్స్‌లో సాధారణ ఉద్యోగులకు మొండి చేయి
- ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని సీఎండీకి వినతి

మార్కెట్ విలువ పెంపుపై సమీక్ష

రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో డీఐజీ భేటీ

రాంనగర్, జూన్ 23: రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ సుభాషిణి వరంగల్, ఖమ్మం జిల్లాల శాఖ అధికారులతో ఆదివారం హనుమకొండ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ విలువ పెంపుపై అధికారులతో డీఐజీ సమీక్షించారు. శాఖ అధికారులు మార్కెట్ విలువ పెంపుపై చేసిన ప్రతిపాదనల పరిశీలించారు. శాఖ అధికారులు చేసిన ప్రతిపాదనలపై డీఐజీ పలు సూచనలు చేశారు. సిద్ధం చేసిన ప్రతిపాదనలు ఈనెల 29న జిల్లా కమిటీ ఎదుట పెట్టాలని నిర్ణయించారు. జూలై 1న రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో పెట్టి 15 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని నిర్ణయించారు. నెలాఖరున మరోసారి కమిటీ ముందు పెట్టి ఆమోదం తీసుకుని భూముల మార్కెట్ విలువలను ఖరారు చేసి ఆగస్టు 1 నుంచి పెంచే అవకాశం ఉంది. కాగా, శాఖ అధికారులు ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువలో 50 శాతం విలువను ఫైనల్ చేసి ప్రతిపాదనలు చేసినట్లు అధికారిక సమాచారం. అధికారులు చేసిన మార్కెట్ విలువల ప్రకారం నగర పరిసరాల స్థలాలు గజానికి రూ.10వేలకు పైగానే పెరిగే అవకాశం ఉంది.

రాజ్యాంగంపై దాడులను తిప్పి కొట్టాలి..

- అంబేద్కర్ ఆలోచనతో ముందుకు కదలాలి
- ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు
- రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



అంబేద్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, జూన్ 23: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై మతం పేరుతో అప్పుడప్పుడు దాడులు జరుగుతున్నాయని, వాటిని ప్రజలందరూ తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ (మాణిక్యాపూర్) గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణను మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి అయిలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అంధ్రానాయకులు వ్యతిరేకిస్తే.. ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ ఏర్పాటు చేసుకున్నామన్నారు. రాజ్యాంగం రక్షించుకుంటే మన, పిల్లల భవిష్యత్ నిర్మాణాత్మకంగా చేసుకోవచ్చన్నారు. రాజ్యాంగం ఎప్పటికీ ఓడిపోదని, శాశ్వతంగా నిలిచి ఉంటుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లు సాధించిన విద్యార్థులకు తాను ఫీజులు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న 26వేల ప్రభుత్వ పాఠశాలలకు రూ.1,100కోట్లతో తాగునీరు, విద్యుత్, బాత్‌రూమ్, బడికి రంగులు, ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. పదేళ్లలో టీచర్ల నియామకం జరగలేదని, ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించిందన్నారు. ప్రైవేట్ ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. అభివృద్ధిలో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తున్నానని మంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈ నెల 24న హుస్నాబాద్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 5వేల ఉద్యోగాలను మెగా జాబ్‌మేళా ద్వారా అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాగా, అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన డప్పు ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్ డప్పు దంచి కొట్టి ప్రజల్లో ఉత్సాహం నెలకొల్పారు. సభలో ఏపూరి సోమన్న, రాజేష్‌లు పాటలు పాడి ప్రజలను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీ వంగ రవి, వైస్ ఎంపీపీ మాడుగుల ఎల్లా, జేఏసీ చైర్మన్ ద్యాగల సారయ్య, ప్రొఫెసర్ వీరన్ననాయక్, ప్రొఫెసర్ కృష్ణ, మంజులరెడ్డి, మాజీ సర్పంచ్‌లు తాళ్లపల్లి తులశమ్మ-రాజయ్య, వేల్పుల రవీందర్, వనపర్తి రాజయ్య, ఎంపీటీసీ గోపిశర్మ, కేతిరి లక్ష్మారెడ్డి, తూముల సదానందం, తాళ్లపల్లి విద్యాసాగర్, తాళ్లపల్లి జయరాజ్, అశోక్, తాళ్లపల్లి జగన్, ఆశీర్వాదం, మాజీ ఉపసర్పంచ్‌లు అణపురం శ్రీనివాస్, ముద్దసాని సదానందం తదితరులు పాల్గొన్నారు.

సా..గుతున్న 'మాఢవీధుల' పనులు

- భద్రకాళి ఆలయ అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం
- చెరువుపై బ్రిడ్జి నిర్మాణానికి ఇంకారాని అనుమతులు
- ప్రసాదం, కార్యాలయం, అన్నదానం, కాంప్లెక్స్ నిర్మాణం ఎప్పుడు?
- ఊసేలేని వసతి గృహాల నిర్మాణ ప్రతిపాదనలు

వరంగల్ కల్చరల్, జూన్ 23: వరంగల్ మహానగరంలో స్వయంభూగా వెలిసిన భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకనుగుణంగా ఆలయాన్ని ఆధునీకరించాలని సంకల్పించి, ఇందుకు అవసరమైన నిర్మాణాలను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి మాడవీధులు ఉండగా, తర్వాత వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారికి భక్తులు ప్రదక్షిణలు చేసుకునేలా మాడవీధులు నిర్మించాలని భావించారు. ఈ నేపథ్యంలో మార్చిలో పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణపు పనులు కూడా ప్రారంభించారు. కానీ పనులు మాత్రం నత్తనడకన సాగుతుండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రధానమైన ఉత్సవాలు ఉన్న నేపథ్యంలో మాఢ వీధుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆరు నెలల్లో..

మాఢ వీధుల నిర్మాణం, ఆలయ రాజగోపురాల నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించి రూ.30కోట్ల బడ్జెట్ ఖరారు చేసింది. ఇందులో రూ.20 కోట్లు ప్రభుత్వం స్పెషల్ డెవలప్ ఫండ్ కింద మంజూరి చేయగా రూ.10 కోట్లు 'కుడా' నుంచి కేటాయించారు. మాడవీధుల నిర్మాణం 800 మీటర్ల దూరంతో 60పీట్ల వెడల్పుతో 200పీట్ల పొడవుతో నాలుగు మాడవీధుల నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పనులు ప్రారంభనాటి నుంచి ఆరు నెలల్లో పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించారు.

ఇప్పటికే మూడు నెలలు గడిచినా పనుల్లో వేగం పుంజుకోలేదు. పరిస్థితి చూస్తుంటే పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు.



భద్రకాళి మాడ వీధుల నిర్మాణపు పనుల్లో భాగంగా వేద పాఠశాల నుంచి సాగుతున్న పనులు

చెరువుపై బ్రిడ్జికి అనుమతి వచ్చేనా..?

మాడవీధుల నిర్మాణంలో భాగంగా అమ్మవారి ఆలయం పక్కన ఉన్న భద్రకాళి చెరువు నుంచి బ్రిడ్జి నిర్మించాలని భావించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఇరిగేషన్, గ్రీన్‌ట్రిబ్యునల్ ఈఎన్‌సీ ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు వచ్చినట్లు దాఖలాలు లేవు. కాగా, అభివృద్ధి పనులపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలతో కూడిన అత్యున్నత సమావేశం సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర నిర్వహించినట్లు తెలిసింది. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

ఆలయ కాంప్లెక్స్ నిర్మాణం ఎప్పుడు?

అలయ నిర్వహణకు దేవస్థాన ఈవో కార్యాలయం, భక్తులకు అందించే ప్రసాదల తయారీ కేంద్రం, భక్తులకు అన్నప్రసాదం అందించే అన్నపూర్ణ మందిరంతోపాటు నూతనంగా నిర్మించే వేద పాఠశాల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.10కోట్లతో అంచనా వేయగా, పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. అలాగే, అన్నదానం మరింత ఎక్కువ మందికి చేయాలని భక్తులు కోరుతున్నారు. భక్తుల వసతి గృహాలు కూడా నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలి

అసెంబ్లీలో తీర్మానం చేయాలి : ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూన్ 23 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లను వ్యతిరేకించి, అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జాతీయ అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ అధ్యక్షతన రాష్ట్ర సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఉన్న 142 కోట్ల మందిలో 80 కోట్ల మంది కార్మికులుగా పని చేస్తున్నారని, వారి ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దేశ కార్మిక వర్గాన్ని ఇనుప సంకేళ్లతో బంధించిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరితాళ్లుగా మారనున్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమల్లోకి తీసుకువచ్చారని, యూనియన్ పెట్టుకునే హక్కు కూడా లేకుండా చేయడంతో కార్మికులు నష్టపోయే ప్రమాదముందున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో కార్మిక సంక్షేమం, మెరుగైన వేతనాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం వాటిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జె.సీతారామయ్య, ఎండి.రాసోద్దీన్, శివ్వారపు శ్రీధర్, శివబాబు, వీరభద్రం, నాగరాజు, గంగుల దయాకర్, రాజేందర్, రామకృష్ణారావు, విశ్వనాథం, పద్మ, కొండపల్లి శ్రీనివాస్, రాము, శోభ, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వర్‌రావు



చేపల పంపిణీపై ప్రణాళికేది?

తొలకరి ప్రారంభమైనా అమలు చేయని వైనం

ప్రభుత్వ యాక్షన్ ప్లాన్ ఏదీ.. మత్స్యకారుల ఆవేదన

కాళోజీ జంక్షన్, జూన్ 23: తొలకరి ప్రారంభమైనా చేపల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా యాక్షన్ ప్లాన్ రూపొందించకపోవడంపై మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం మత్స్య సంపదను పెంపొందించడానికి ఉచితంగా మేలు రకం చేపపిల్లలను పంపిణీ చేస్తామని ప్రకటించింది. పంపిణీ కోసం టెండర్ నిర్వహించి బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ మత్స్యకారులకు సరైన సైజులో మేలు రకం చేపపిల్లలను సరైన సమయంలో అందించకపోవడంవల్ల మత్స్యకారులకు లాభం కంటే నష్టమే ఎక్కువగా జరిగింది. జూన్, జూలై నెలల్లో సరఫరా చేయాల్సిన చేప పిల్లలను సెప్టెంబరు నెలలో సరఫరా చేయడంవల్ల చేపలు సరైనసైజులో ఎదగక మత్స్యకారులు నష్టపోయారు. అంతేగాక సంఖ్యాపరంగా తక్కువగా సరఫరా చేశారని, అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై మత్స్యకారులను దోచుకోవడంతో వారికి సరైన లబ్ధి చేకూరలేదు. గత ప్రభుత్వ విధానంతో మత్స్యకారులకు మేలు జరుగలేదని తెలిసిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం.. ఎలాంటి కార్యక్రమం చేపడుతే బాగుంటుందోనని నిర్ణయం తీసుకోకపోవడంతో ఆలస్యమవుతోంది. రైతుల సంక్షేమం కోసం పంటల సాగుకు రైతు బంధు పేరుతో పెట్టుబడి సహాయాన్ని నేరుగా అందించిన మాదిరిగా మత్స్యకారులకు కూడా నేరుగా పెట్టుబడిని అందిస్తే చేపలు పట్టే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు.

వర్షాకాలం ప్రారంభమై అన్ని ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లోకి ఒకేసారి వర్షపు నీరు చేరదని, చెరువులు నిండిన ప్రాంతాల్లోని మత్స్యకారులు ముందుగా వెంటనే చేప పిల్లలను తామే స్వయంగా కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా చెరువుల్లో, కుంటల్లో బొచ్చె, రవు, బంగారుతీగ, మెరిగె, గడ్డిచేప రకాలు 9 నుంచి 10 నెలల కాలంలో పూర్తి సైజులో ఎదుగుతాయని, అందుకు జూన్, జూలై నెలల్లో చేప పిల్లల విత్తనాలను చెరువుల్లోకి వదిలితే వేసవి కాలం సమీపించి చెరువుల్లో నీటిమట్టం తగ్గి చేపలు పట్టడానికి అనువుగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో అవినీతికి ఆస్కారం ఉండదని మత్స్యకారులకు నేరుగా కానీ.. మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు గానీ డబ్బులు అందించడం వల్ల మత్స్యకారులు అభివృద్ధి చెందుతారని, ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచించి తగు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తగు చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మత్స్య బంధు అమలు చేయాలి..

మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బుస్స మల్లేశం



రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం రైతు బంధు అమలు చేస్తున్న ప్రకారంగా మత్స్యకారుల అభివృద్ధి కోసం మత్స్య బంధును అమలు చేయాలి. మత్స్యకారులకు నేరుగా పెట్టుబడిగా ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తే అనువైన సమయంలో మేలు రకం చేప విత్తనాలను కొనుగోలు చేసేందుకు అవకాశముంటుంది. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతమవుతారు.

తాటి చెట్టుపైనే హఠాన్మరణం

ఐనవోలు, జూన్ 23: మండలంలోని లింగమోరిగూడెం గ్రామానికి గీత కార్మికుడి బుర్ర సత్తయ్యగౌడ్(65) తాటిచెట్టుపైనే మృతిచెందాడు. సత్తయ్య వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కాడు. కిందికి దిగుతున్న క్రమంలో కాలు జారి వెనుకకు జారిపోయి వేలాడాడు. రెండు గంటల తరువాత అటుగా వెళ్లిన వారు సత్తయ్యగౌడ్‌ను చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అగ్రిమాపకశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. 60 అడుగులకు పైన ఎత్తు ఉన్న తాటిచెట్టుకు రెండు నిచ్చెనలు వేశారు. స్థానికుడైన యువకుడు మహ్మద్ గుల్‌పాషా ధైర్యం చేసి ఎక్కి పలకరించగా అప్పటికే గీత కార్మికుడు మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని తీయడానికి యువకుడు చెట్టుఎక్కి అతి కష్టంమీద కిందికి దింపాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. గుండెపోటుతోనే మృతిచెందినట్లు ఒక అంచనాకు వచ్చారు. పోస్టుమార్టం రిపోర్టులో మృతికిగల కారణాలు తెలువనున్నాయి. మృతుడికి భార్య సరోజ ఇద్దరు కుమారులు, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. చెట్టుపైనే సత్తయ్య మృతిచెంది వేలాడుతూ కనిపించగా గుండె పోటు లేదా మరేదైనా అనారోగ్య కారణం అని భావిస్తున్నారు.



తాటిచెట్టుపై మృతి చెందిన సత్తయ్యగౌడ్


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతురాలి బంధువులు

నిందితుడి ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా

నాగేంద్ర నగర్‌లో కాలనీలో ఉద్రిక్తత

బాలసముద్రం, జూన్ 23: వివాహేతర సంబంధం పెట్టుకున్న వాడే హత్య చేశాడని ఆరోపిస్తూ వెంకటస్వామి అనే వ్యక్తి ఇంటి ఎదుట మృతురాలి బంధువులు ధర్నా చేపట్టిన ఘటన ఆదివారం నాగేంద్రనగర్‌కాలనీలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 49వ డివిజన్‌లోని నాగేంద్రనగర్ కాలనీలో నివాసముంటున్న మంజుల అనే వివాహితతో వెంకటస్వామి రెండేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం మంజులకు, వెంకటస్వామికి మధ్య గొడవచోటుచేసుకోగా, అదేరోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో మంజుల ఇంటికి చేరుకున్న వెంకటస్వామి విద్యుత్ సరఫరా నిలిపివేసి గొంతునులిమి హత్య చేశాడని సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మృతురాలి బంధువులు వెంకటస్వామి ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా చేపట్టారు. దీంతో కాలనీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోగా ఆందోళనకారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిందితుడిపై చర్యలు తీసుకునేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుకూర్చున్నారు. మృతురాలి కుటుంబానికి తగిన న్యాయం చేసి, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని నచ్చజెప్పి ఆందోళనను పోలీసులు విరమింపజేశారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బాలసముద్రం, జూన్ 23: పెరిగిన ధరలను నియంత్రిచడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిత్యావసర వస్తువులతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారంగా మారిందని అన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు పెరిగి ఆకాశాన్నంటాయని అన్నారు. పెరిగిన ధరలను కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, ఓదెలు, సంతోష్, సారంగపాణి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన భాషా పండితులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 23: దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పండిట్ల ఉన్నతీకరణ చేసినందుకుగాను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఎల్పీలకు పదోన్నతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అప్‌గ్రేడ్ కాకుండా మిగిలి ఉన్న వెయ్యి ఎల్పీలను స్కూల్‌అసిస్టెంట్ పోస్టులుగా మార్పు చేసి ఎల్పీల వ్యవస్థను పూర్తిగా రద్దుచేయాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధానకార్యదర్శి జి. తిరుమల కాంతి కృష్ణ, కోశాధికారి శర్మ, నాయకులు హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా గొడుగు శ్రీనివాస్


నియామకపత్రం అందుకుంటున్న గొడుగు శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూన్ 23 : తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గొడుగు శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆదివారం ప్రకటించి, శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందించారు. ప్రస్తుతం తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీనివాస్ 1990 నుంచి ముదిరాజ్ సామాజికవర్గం సమస్యలపై పోరాడుతూ మత్స్యకారుల హక్కులను కాపాడడంతో ముందు వరుసలో నిలుస్తూ వస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ముదిరాజ్ సామాజికవర్గ సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ గెలుపు కోసం క్రియాశీలకంగా పని చేశారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం తెలంగాణ ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్పీడీసీఎల్‌లో వారిదే హవా



ఉద్యోగ సంఘాల పేరుతో ఏళ్ల తరబడి ఒకే చోట తిష్ట
పోస్టింగ్స్‌లో సాధారణ ఉద్యోగులకు మొండి చేయి
ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని సీఎండీకి వినతి

హనుమకొండ టౌన్, జూన్ 23: ఎన్పీడీసీఎల్‌లోని కొంత మంది ఉద్యోగులు ఉద్యోగ సంఘం నాయకులు గా చెలామణి అవుతూ హెడ్‌క్వార్టర్‌ను వీడకుండా ఏళ్లుగా తిష్ట వేసి ఉంటున్నారని గ్రామీణ ఉద్యోగులు ఆవేదనను చెందుతున్నారు. ఎన్పీడీసీఎల్‌లో సుమారుగా 36 సంఘాలు కొనసాగుతుండగా, ప్రధానంగా 10 సంఘాలకు నాయకులుగా చెలామణి అవుతున్న వ్యక్తులు.. ఎన్పీడీసీఎల్‌లో చక్రం తిప్పుతూ తమ హవాను కొనసాగిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. సర్కిల్ దాటి పోకుండా ఒక డివిజన్ నుంచి ఇంకొక డివిజన్‌కు లేదంటే.. కార్పొరేట్ ఆఫీసులోనే పనిచేస్తున్నారని అంటున్నారు.

నాయకులు లీలలు

ఒక సంఘానికి నాయకుడిగా ఉన్న ఉద్యోగి జేపీవోగా విద్యుత్‌శాఖలో అడుగుపెట్టి 20 ఏళ్లుగా నక్కలగుట్టలోని కార్పొరేట్ ఆఫీసు హెచ్ఆర్‌డీ విభాగంలో పదోన్నతులు పొందుతూ అక్కడే కొనసాగుతుండటం విస్మయానికి గురి చేస్తోంది. ఆయనతో ఏటుగా ఉద్యోగంలో చేరిన వారు ఇప్పటికే ఐదారు ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తే.. ఆయన మాత్రం అసోసియేషన్ పేరిట అక్కడే విధులు నిర్వర్తించడంపై ఉద్యోగులు అహహనం వ్యక్తం చేస్తున్నారు. ఈయనే కాకుండా ముగ్గురు డీఈలు, ఒక్క ఏడీఈ, కొంతమంది ట్రేడ్ యూనియన్ నాయకులు సైతం ఎన్పీడీసీఎల్‌లో ఇదే తరహాలో తమ అధిపత్యాన్ని కొనసాగిసున్నారు. గతంలో ఒక సంఘ నాయకుడి కోసం హనుమకొండ సర్కిల్‌లో ఏకంగా కొత్తగా ఒక సబ్ డివిజన్‌ను సృష్టించి ఏడీఈగా పోస్టింగ్ ఇచ్చారనే విమర్శలు వచ్చాయి. సదరు ఏడీఈ 40 ఏళ్లుగా హనుమకొండను వదలకుండా ఉంటున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో ఉద్యోగంలో చేరినవారంతా ఎన్పీడీసీఎల్‌లోని వివిధ ప్రాంతాలకు బదిలీ అవుతుంటే.. వీరు మాత్రం ఏళ్లుగా హనుమకొండ కేంద్రంగా తిష్టవేసి ఉంటున్నారు.

బదిలీలకు శ్రీకారం

ఇప్పటికే ఆలస్యమైన బదిలీలు పక్రియను ఎన్పీడీసీఎల్ త్వరలోనే చేపట్టబోతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో బదిలీల్లో ఇంతకాలం చక్రం తిప్పిన వ్యక్తులందరినీ గుర్తించి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని సీఎండీని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు వేడుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్లకు మించి ఒకే చోట ఉన్న ఉద్యోగులను బదిలీ చేస్తేనే పోస్టింగ్ కోసం ఎదురుచూసే వారికి న్యాయం జరుగుతుందని ఉద్యోగస్తులు పేర్కొంటున్నారు. ఏడీఈ, పైస్థాయి అధికారులను బదిలీలు చేసి కొత్తవారికి అవకాశం కల్పించాలని పలువురు పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

సంస్థను శాసిస్తున్న నాయకులు

ఎన్పీడీసీఎల్‌లో సంఘాల పెత్తనంతో కొంతమంది ఉద్యోగులు నలిగిపోతున్నారని తెలుస్తోంది. పరస్పరంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ మధ్యలో ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ మాట వినకపోతే, తమ దారికి రాకపోతే విచారణల పేరిట భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఉద్యోగులు వారి ఉన్నతాధికారి కంటే ఉద్యోగ సంఘ నాయకులకు భయపడాల్సిన పరిస్థితి ఉందని ఉద్యోగులు అంటున్నారు. అయితే ఇంకొంత మంది ఉద్యోగులు మాత్రం ఉద్యోగ సంఘాల నాయకుల సేవలో తరిస్తూ వారి పనులను చక్కదిద్దుకుంటున్నారని తెలుస్తోంది. ప్రధానంగా ఉద్యోగుల నుంచి వేలల్లో డబ్బులు తీసుకొని అసోసియేషన్ పేరిట పోస్టింగ్‌లు ఇప్పించారనే ఆరోపణలు సైతం వినబడుతున్నాయి. ఇప్పటికైనా సీఎండీ ఉద్యోగ సంఘాల అధిపత్యాన్ని తగ్గించి త్వరలో జరగబోయే బదిలీల్లో ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉప కులపతికి అర్హతల సడలింపు

వరంగల్ మెడికల్, జూన్ 23: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి పదవి కోసం అర్హతలలో సడలింపులు కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన వారు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. వైద్యరంగంలో కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, రచనలు చేసిన వైద్యులు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వైద్య బోధన, అకడమిక్, అడ్మినిస్ట్రేషన్‌లో అనుభవం ఉన్న వారు కూడా అర్హులని పేర్కొంది. జాతీయ వైద్య విద్యా విధానంపై అవగాహన ఉన్న అధ్యాపకులు కూడా దరఖాస్తు చేసుకునే వెసలుబాటు కలిగింది. వైద్య విద్య ప్రవేశాలలో అక్రమాలు జరగకుండా సమర్థవంతమైన ఉప కులపతిని నియమించాలని ప్రభుత్వం కూడా యోచిస్తున్నట్లు సమాచారం. తొలి నోటిఫికేషన్‌లో ఉన్న ఇబ్బందులను వైద్య కళాశాలలో పని చేస్తున్న ప్రొఫెసర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం అనుబంధ నోటిఫికేషన్ జారీ చేసింది.

28న డీసీసీబీ మహాజన సభ

హనుమకొండ సిటీ, జూన్ 23: వరంగల్ ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ ఈ నెల 28న నిర్వహించనున్నట్లు బ్యాంకు కార్య నిర్వహణ అధికారి ఎం.డి. వజీర్ సుల్తాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 11గంటలకు సభ ప్రారంభం కానుంది. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన సభ జరుగనుంది. పీఏసీఎస్ చైర్మన్లు, సహకార సంఘాల చైర్మన్లు తదితరులు సభకు హాజరుకావాలని వజీర్ సుల్తాన్ కోరారు.

గ్రీన్ బావర్చి బిర్యానీలో బొద్దింక

మునిసిపల్ అధికారులకు బాధితుడి ఫిర్యాదు.. జరిమానా

వరంగల్ కార్పొరేషన్, జూన్ 23: హనుమకొండ అశోకజంక్షన్ సమీపంలోని గ్రీన్ బావర్చి హోటల్‌లో శనివారం ఓ విద్యార్థి తీసుకున్న బిర్యానీలో బొద్దింక కళేబరం వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన గణేశ్ అనే విద్యార్థి.. శనివారం గ్రీన్‌బావర్చి బిర్యానీ సెంటర్‌కు వెళ్లి ఒక బిర్యానీ పార్సిల్ తీసుకుని ఇంటికి వెళ్లాడు. తన సోదరుడితో కలిసి బిర్యానీ ప్యాకెట్ విప్పి సగం వరకు తిన్నారు. మధ్యలో కుళ్లిపోయిన బొద్దింక కనిపించడంతో ఖంగుతున్నారు. ఒక్కసారిగా వాంతులు చేసుకున్నారు. వెంటనే వారి వద్ద మిగిలిన బిర్యానీ తీసుకుని హోటల్ వద్దకు వెళ్లి నిర్వాహకులకు చూపించి నిలదీశారు. వెంటనే హోటల్ యజమాని వెనక్కి తగ్గి విషయాన్ని ఇంతటితో ఆపేయాలని బుజ్జగించి మరో రెండు బిర్యానీలు ఇస్తానని చెప్పుకొచ్చాడు. అయినా బాధితులు వెనక్కి తగ్గకుండా విషయాన్ని మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తన సిబ్బందితో కలిసి వెళ్లి వంటగదిలో తనిఖీలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో హోటల్ యజమానులను హెచ్చరించి రూ.2వేల జరిమానా విధించినట్టు వెల్లడించారు.



6 నుంచి సీపీ గేట్-24 ప్రవేశాల పరీక్షలు

జూలై 3 నుంచి హాల్‌టికెట్ల జారీ ● అన్ని జిల్లా కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 23: రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో రెగ్యులర్ ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ ఇతర పీజీ కోర్సుల్లో డ్మిషన్ల కోసం నిర్వహించే సీపీ గేట్ - 2024 ప్రవేశాల పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు సీపీ గేట్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి ప్రవేశాల పరీక్షలు జూలై 6 నుంచి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రోజుకు మూడుసెషన్లలో నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌ను వెలువరించారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో దాదాపు 78 కోర్సుల్లో సీపీగేట్ ప్రవేశాల పరీక్షల మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లును కేటాయిస్తారు.

సీపీగేట్ పరీక్షల షెడ్యూల్ ఇదే..

ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు మూడో సెషన్‌లోపరీక్షలు జరుగుతాయి.

- జూలై 6న మొదటి సెషన్‌లో ఎకానమిక్స్, రెండో సెషన్‌లో తెలుగు, మూడో సెషన్ లో సైకాలజీ, డేటాసైన్స్
- జూలై 7న మొదటి సెషన్‌లో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, రెండో సెషన్‌లో ఎంఈడీ, ఎంపీఈడీ, లైబ్రరీసైన్స్ (ఏడాది, రెండేళ్లు), మూడో సెషన్‌లో మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్, జియో ఇన్ఫాటిక్స్
- జూలై 8న మొదటి సెషన్‌లో పొలిటికల్ సైన్స్, రెండో సెషన్‌లో లైబ్రరీ సైన్స్ (ఏడాది, రెండేళ్లు), మూడో సెషన్‌లో జియోగ్రఫీ
- జూలై 9న మొదటి సెషన్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రెండో సెషన్‌లో హిందీ, సంస్కృతం, మూడో సెషన్‌లో ఫిలాసఫీ, జియాలజీ.
- జూలై 11న మొదటి సెషన్‌లో ఇంగ్లీష్, రెండో సెషన్‌లో బయోటెక్నాలజీ (ఐదేళ్లు), మూడో సెషన్‌లో ఎంబీఏ, (ఐదేళ్లు), లింగ్విస్టిక్స్.
- జూలై 12న మొదటి సెషన్‌లో హిస్టరీ, కెమిస్ట్రీ, రెండో సెషన్‌లో కంప్యూటర్ సైన్స్ బీసీఈఎస్ఎఫ్ఎస్ఎఫ్‌టీజీఅండ్ఎం, మూడో సెషన్‌లో కెమిస్ట్రీ, ఫార్మా కెమిస్ట్రీ (ఐదేళ్లు).
- జూలై 13న మొదటి సెషన్‌లో ఎంఏ సైకాలజీ, బయోటెక్నాలజీ, ఎంఏ ఎకానమిక్స్ (ఐదేళ్లు) రెండో సెషన్‌లో మ్యాథమెటిక్స్, మూడో సెషన్‌లో సోషియాలజీ.
- జూలై 15న మొదటి సెషన్‌లో ఎంకామ్, బాటనీ, రెండో సెషన్‌లో స్టాటస్టిక్స్ న్యూట్రీషియన్, డెయిట్, మూడో సెషన్‌లో మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్ఆర్ఎం).

ఎంఏ అరబిక్, కన్నడ, మరాఠీ, పర్షియన్, థియేటర్ ఆర్ట్స్, ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టుల్లో ప్రవేశాల పరీక్షలుండవు. డిగ్రీ మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో ప్రవేశాల పరీక్షల కోసం సెంటర్ల ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఎక్కువగా ఉన్న సెంటర్లల్లో కొందరికీ పక్క సెంటర్లలో పరీక్షలను ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల్లో తప్పులను సరిచూసుకోవాలి..

ప్రొఫెసర్ పాండురంగారెడ్డి కన్వీనర్ సీపీగేట్

అభ్యర్థులు దరఖాస్తుల చేసేక్రమంలో కొందరూ అర్హతలేని సబ్జెక్టులకు దరఖాస్తులు చేశారు. పేర్లల్లో, పుట్టిన తేదీల్లోనూ తప్పులు దొర్లాయి. తప్పులున్న అభ్యర్థులందరికీ ఇప్పటికే వారిచ్చిన ఫోన్‌నెంబర్లకు ఎస్ఎంఎస్‌లు చేరవేశాం. వీలైనంత త్వరగా వెబ్‌సైట్ https://cpget.tsche.ac.in/ లోకి వెళ్లి అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో చోటుచేసుకున్న తప్పులను సరిచేసుకోవాలి. జూలై 3 నుంచి హాల్‌టికెట్లను విడుదల చేస్తాం. కౌన్సెలింగ్ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా అర్హులైన అభ్యర్థులందరూ తాజా కులం, ఆదాయం, ఇతర ధృవపత్రాలన్ని సమకూర్చుకోవాలి. ఆదాయం ధృవపత్రాలులేని అభ్యర్థులకు ఓపెన్ ఫీజులు వసూలు చేస్తాం. ఫీజు చెల్లించేనాటికి ఆదాయ ధృవపత్రాన్ని సమకూర్చుకోవాలి.

ఉపాధ్యాయుల బదిలీలకు వేళాయే..

ఖాళీల జాబితాలు, సీనియారిటీ జాబితాలను రూపొందించిన విద్యాశాఖ

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 23: ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధం అవుతోంది. ఎస్జీటీ, తత్సమాన విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన సీనియారిటీ జాబితాలను అధికారులు రూపొందించి సంబంధిత వెబ్‌సైట్లలో పొందుపరిచారు. క్లియర్ వేకెన్సీలతో పాటు 8 యేళ్లు దాటిన వారిని కలిసి ఖాళీల జాబితాలను అధికారులు రూపొందించారు. అయితే ఉపాధ్యాయులు మాత్రం రెండు జిల్లాల్లో ఉన్న అన్ని ఖాళీలను జాబితాల్లో పొందుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. పదోన్నతుల ప్రక్రియలో రూపొందించిన జాబితాల్లో పొరపాట్లు దొర్లిన నేపథ్యంలో కొంతమంది ఉపాధ్యాయులు నష్టపోయారని, బదిలీల్లో అలా జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో బదిలీల కోసం అన్ని కేటగిరీల్లో కలిపి 715 ఖాళీలు ఏర్పడగా, హనుమకొండ జిల్లాలో 448 ఖాళీలతో అధికారులు జాబితాలను రూపొందించారు.

వెబ్ ఆప్షన్ల ఎంపిక తర్వాత బదిలీలు షురూ..

వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యాశాఖాధికారులు బదిలీలకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న ఖాళీలను సంబంధిత మండల విద్యాధికారుల పర్యవేక్షణలో ఖాళీలను గుర్తించి జాబితాలను రూపొందించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీనియారిటీ జాబితాలను, ఖాళీల జాబితాలను రూపొందించి జిల్లా విద్యాశాఖ వెబ్ పోర్టల్‌లో పొందుపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల్లో బదిలీల కోసం ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ తర్వాత వెనువెంటనే బదిలీల ఉత్తర్వులు జారీ కానున్నాయి.

వరంగల్ జిల్లాల్లో బదిలీలకు ఖాళీలు ఇలా..

లోకల్ బాడీ పాఠశాలల్లో..

కేటగిరి	ఖాళీలు	5/8 యేళ్లు దాటిన ఖాళీలు
ఆర్ట్/డ్రాయింగ్ టీచర్స్	5	0
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	6	0
లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	12	0
లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	11	0
పీఈటీలు	10	0
ఎస్జీటీలు	294	239
వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్	0	3
మొత్తం	341	239

ప్రభుత్వ పాఠశాలల్లో..

కేటగిరి	ఖాళీలు	5/8 యేళ్లు దాటిన ఖాళీలు
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	2	0
లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	1	0
లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	1	0
ఎస్జీటీలు	46	85
మొత్తం	50	85

కేటగిరీల వారిగా మొత్తం ఖాళీలు - 715

మానుకోట వేదికగా తెలంగాణ నవనిర్మాణ సభ ఆవిష్కృతం


మాట్లాడుతున్న విద్యావేత్త డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, జూన్ 23 : పోరాటాల ఖిల్లా మానుకోట వేదికగా 'తెలంగాణ నవనిర్మాణ సభ ' ఆదివారం ఆవిష్కృతమైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మేధావులు, విద్యావేత్తలు, వివిధ సంఘాల ప్రతినిధుల సమక్షంలో తెలంగాణ నవనిర్మాణ సభ పేరుతో మరో తెలంగాణ ఉద్యమ సంస్థ ఆవిర్భవించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, విద్యావేత్త డోలి సత్యనారాయణ మాట్లాడారు. తెలంగాణలో సామాజిక న్యాయం ద్వారానే ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆరు దశాబ్దాల ఉద్యమం తర్వాత ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు మేలు జరిగిందేమి లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ సాధన కోసం అనేక మంది బలిదానాలు చేశారని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో పాలకుల తీరుతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యంతో స్వరాష్ట్ర ఉద్యమం మొదలైందో రాష్ట్రం ఏర్పడ్డాక ఆ లక్ష్యం నెరవేరలేదన్నారు. సామాజిక తెలంగాణ సాధనే ఏజెండాగా తెలంగాణ నవనిర్మాణ సభ ఆవిర్భవించిందని చెప్పారు. అనంతరం తెలంగాణ నవనిర్మాణ సభ కన్వీనర్‌గా కొమిర వెంకన్న, కో-కన్వీనర్‌గా కల్తీ వీరస్వామితో పాటు తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కన్వీనర్ కొమిర వెంకన్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాలంతా ఒక్కతాటిపైకి వచ్చి రాజ్యాధికారమే లక్ష్యంగా సామాజిక న్యాయం కోసం సమరశంఖం పూరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఎల్.వెంకన్న, చుంచు శ్రీశైలం, విశ్వ, వసంతరావు, ఈర్ల సాగర్, జగన్మోహన్, కవిత పాల్గొన్నారు.

ఆర్ఐల అక్రమ వసూళ్లు

బల్దియాలో కొందరు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ల చేతి వాటం ● బిల్ కలెక్టర్లతో ప్రతీ పనికి వసూళ్లు ● కమిషనర్ దృష్టి సారించాలంటున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 23: వరంగల్ బల్దియాలో కొందరు ఆర్ఐలు రాజ్యమేలుతున్నారు. ప్రతీ పనికి ఒక రేటు పెట్టి బిల్ కలెక్టర్ల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. 66 డివిజన్‌లలో ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్జీలను పరిశీలించి పనులు చేయాల్సిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు.. వారి వద్ద పని చేస్తున్న బిల్‌కలెక్టర్లు, కొత్తగా నియమింపబడ్డ వార్డు ఆఫీసర్‌లను పావులుగా చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

విధులు

వరంగల్ మహానగర పాలక సంస్థలో 10 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తుంటారు. వారి వద్ద డివిజన్‌ల పరిధిని బట్టి 5 నుంచి 8 మంది బిల్‌కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు పని చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో 66మంది బిల్‌కలెక్టర్లు పని చేస్తుండగా, ఇటీవల కొత్తగా కార్పొరేషన్‌కు కేటాయించిన వీఆర్‌ఏలు, వీఆర్‌వోలు మరో 40మందిని వార్డ్ ఆఫీసర్లుగా నియమించారు. యజమాని ఇంటి పేరు మార్పు, ఖైఫర్‌కేషన్, కొత్త ఇంటి నెంబర్ల జారీ, వీఎల్‌టీ (వెకెట్ ల్యాండ్ ట్యాక్స్), వృద్ధాప్య, వితంతు, చేనేత, బీడీకార్మికులు, గీతకార్మికుల పింఛన్‌తో పాటు తదితర దరఖాస్తులను పరిశీలించి అనుమతి పత్రాలు జారీ చేయాలి. ఇందుకుగాను నగర ప్రజలు ఆన్‌లైన్ ద్వారా వారికి అవసరం ఉన్న పనిని బట్టి చలనా ద్వారా డబ్బులు చెల్లిస్తారు.

డబ్బుల వసూళ్లు

పనుల కోసం కొందరు ఆర్‌ఐలు కొత్తరకం దందా మొదలు పెట్టారు. ప్రజల నుంచి వసూళ్ల కోసం బిల్ కలెక్టర్లను రంగంలోకి దించుతున్నారు. బిల్‌కలెక్టర్లు దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ చేస్తున్నారు. 'దరఖాస్తులో తప్పులున్నాయి.. డాక్యుమెంట్లు సరిగా లేవు.. హద్దులు సరిగా లేవు.. రోడ్డు విడ్త్ సరిగా లేదు.. కుటుంబ సభ్యుల నుంచి ఎన్‌వోసీ తేవాలి..' అని కొర్రీలు పెట్టి దరఖాస్తు రద్దు చేస్తున్నారు. తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇలా డబ్బులు ఇచ్చే వరకు పట్టి పీడిస్తున్నారు. ఇలా.. ఇంటి నెంబర్‌కు కనీసం రూ.2లక్షలు వసూలు చేస్తుండగా, మిగతా పనులకు పనిని బట్టి వేలల్లో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

పని గురించి అడిగితే బెదిరింపులు

కొందరు వివిధపనుల కోసం ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే.. రోజులు గడుస్తున్నా పనులు పూర్తికావడం లేదు. గత పదిరోజుల్లో 170 దరఖాస్తులు రాగా, ఒక్క పని చేయలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. దీంతో ఆర్ఐ, బిల్ కలెక్టర్లకు ఫోన్ చేసి బతిమిలాడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. కొందరైతే డబ్బులు చెల్లించిన తర్వాత కూడా పనిలో జాప్యం చేస్తున్నారని అంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. మాది కంచరకుంట, లష్కర్‌సింగారం, పెద్దమ్మగడ్డ.. అని చెబుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు వాపోతున్నారు. కొందరు బాధితులు ఓ బిల్‌కలెక్టర్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా, తల్వార్ చూపించి బెదిరించినట్టు తెలిసింది. దీనిపై కమిషనర్ దృష్టిసారించి అవినీతి ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులను గుర్తించి శాఖాపరమైన వేటు వేయాలని ప్రజలు డిమాండ్



మచ్చుకు కొన్ని..

- ఇటీవల దేశాయిపేటకు చెందిన ఓ మహిళ.. ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకోగా, రూ.20వేలు ఫోన్‌పే చేయించుకుని ఇంటి నెంబర్ ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నట్టు బాధితురాలు వాపోయింది.
- వరంగల్ బట్టలబజార్‌లో అన్నదమ్ముల ఆస్తుల ఖైఫర్‌కేషన్ పత్రాలకు ఓ ఆర్ఐ ఏకంగా రూ.10లక్షలు డిమాండ్ చేసి రూ.6లక్షలు పుచ్చుకున్నట్టు తెలిసింది.
- న్యూశాయంపేటలో ఓ మహిళా ఆర్ఐ ఒకే ఇంటికి రెండు నెంబర్లు జారీ చేసి తలపట్టుకుంది.
- వంగపహాడ్ గ్రామంలో ఓ ఆర్ఐ లేని ఇళ్లకు ఇంటి నెంబర్లు జారీ చేసి కోట్లు గడించినట్లు సమాచారం.

హనుమకొండ జిల్లాలో బదిలీలకు ఖాళీలు ఇలా..

లోకల్ బాడీ పాఠశాలల్లో...

కేటగిరి	ఖాళీలు	8 యేళ్ల ఖాళీలు
ఎస్జీటీ (తె.మీ.)	198	111
ఎస్జీటీ (ఉ.మీ.)	1	5
లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	5	0
లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	11	0
పీఈటీలు	10	0
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	10	0
వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్	4	0
డ్రాయింగ్ టీచర్స్	7	0
మొత్తం	246	116

ప్రభుత్వ పాఠశాలల్లో...

కేటగిరి	ఖాళీలు	8 యేళ్ల ఖాళీలు
ఎస్జీటీ (తె.మీ.)	35	26
ఎస్జీటీ (ఉ.మీ.)	12	2
పీఈటీలు	1	0
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్	7	0
డ్రాయింగ్ టీచర్స్	2	0
మ్యూజిక్ టీచర్	0	1
మొత్తం	57	29

కేటగిరీల వారిగా మొత్తం ఖాళీలు. - 448

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాజీపేట, జూన్ 23: రైతాంగానికి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ఆదివారం 47వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బోడగుట్ట రైతులు సీఎం కేసీఆర్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతు రుణమాఫీ చేసి రైతు ప్రభుత్వమని కాంగ్రెస్ చాటుకుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరిల్ లారెన్స్, మహ్మద్ బిలాల్, కొమురవెల్లి రమేశ్, బి.శ్రీనివాస్, అలీమ్, బండారి రాజేందర్, సదానందం, ఎల్లస్వామి, రాజు, మొగిలి పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

రెడ్డికాలనీ, జూన్ 23: హరిత యోగా శిబిరం ఆధ్వర్యంలో యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. ఈ యోగా శిక్షణ తరగతులను ఏషియన్ శ్రీదేవిమాల్‌లో ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ యోగా శిక్షణ శిబిరంలో ప్రతీ రోజు ప్రాణాయామం, ఆసనాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం నేర్పించడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 93947 66001 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కంకర రోడ్డుతో వాహనదారుల ఇబ్బందులు

ఆరు నెలలు గడిచినా పూర్తికాని బీటీ పనులు


ధర్మసాగర్ నుంచి ఉనికిచర్ల వరకు కంకర పోసి రోడ్డు వేయకుండా ఉన్న దృశ్యం

ధర్మసాగర్, జూన్ 23: ధర్మసాగర్ మండల కేంద్రం నుంచి ఉనికిచర్ల వరకు కంకర పోసి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడున్నర కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డును గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎంఆర్ఆర్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ గత డిసెంబరు నెలలో రోడ్డు పనులను ప్రారంభించేందుకు ఉనికిచర్ల నుంచి ధర్మసాగర్ వరకు ఉన్న పాత రోడ్డును పూర్తిగా తొలగించారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్ల దూరం వరకు రోడ్డు పనులను ప్రారంభించవలసి ఉన్నప్పటికీ నామమాత్రంగా కాంట్రాక్టర్ కంకర పోసి రోలర్‌తో తొక్కించకుండా వదిలేశారు. ధర్మసాగర్ నుంచి ఉనికిచర్ల రింగ్‌రోడ్డుకు అతిదగ్గరలో ఉన్న ఈ రోడ్డు నుంచి వరంగల్ నగరానికి, ములుగు, కరీంనగర్ వెళ్లేందుకు వేలేరు, ధర్మసాగర్ మండలాల నుంచి నిత్యం వాహనదారులు వెళ్తుంటారు. కంకర పోసి బీటీరోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కంకర రోడ్డుపై ప్రయాణిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు పనులు నిలిచిపోయాయి. అయినప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బీటీరోడ్డు పనులను పూర్తి చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కబంధహస్తాలలో ఆలయ భూములు

కౌలు పేరిట హద్దులు చెరిపేసిన కబ్జాదారులు
25.19 ఎకరాల ఆలయ భూములకు 10 ఎకరాలు మాయం
భూముల విలువ సుమారు రూ.11 కోట్లు
చోద్యం చూస్తున్న ఎండోమెంట్ శాఖ అధికారులు

ఐనవోలు, జూన్ 23: కక్కిరాలపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయ విలువైన భూములు కబ్జాదారుల కోరల్లో చిక్కుకున్నాయి. ఎండోమెంట్‌శాఖ అధికారులు ఉదాసీనత వలన ఇప్పటికే 10 ఎకరాల భూమి హద్దులను మార్చేసి తమ భూముల్లో కలుపుకున్నారు. ఒక ఎకరం భూమి ధర తరి రూ.30 లక్షలు, ఖుష్కి రూ.50 లక్షల వరకు పలుకుతోంది. ఆలయానికి మొత్తం 25.19 ఎకరాల భూమి ఉంది. ఇందులో 10 ఎకరాల చెరువు కింది ఆయకట్టు కాగా, 15 ఎకరాల పైచిలుకు ఖుష్కి భూమి చెరువు పక్కన, రోడ్డుకు ఆనుకొని ఉంటుంది. ఈ భూముల విలువ మార్కెట్ విలువ సుమారు రూ.11కోట్ల వరకు ఉంటుంది. భూమికి సంబంధించిన పట్టాదార్‌పాస్‌పుస్తకాలు ఆలయం పేరిటనే ఉన్నాయి. భూములకు ధరలు పెరగడంతో భూమి మాత్రం యేటేటా తగ్గుతూ వస్తోంది. ఆలయ భూమి చుట్టూ ఉన్న వారు ఆలయ భూముల హద్దులను తొలగించి కలుపుకున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పెద్దమనుషులుగా చెలామణి అయ్యే ఒకరిద్దరు ఆలయ భూములను తమ గుప్పిట్లోకి తీసుకొని రాజకీయపలుకుబడితో ఎవరిని రానివ్వకుండా తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆలయానికి ఎండోమెంట్ శాఖ ద్వారా దేవస్థానం కమిటీలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ చేష్టలుడిగి చూస్తున్నారని స్థానికులు వాపోయారు.


పంట కాలువలను ధ్వంసం చేసిన చెరువుకింది తరిపొలం

ఆలయం పేరిట తరి.. ఖుష్కి భూములు ఇవే..

తరి భూమి.. సర్వే నంబర్ 81లో 1.35 ఎకరాలు, 83లో 1.18, 85లో 3.01, 86లో 3.12, 87లో 0.18 ఎకరాలు, ఖుష్కి సర్వే నంబర్ 251లో 7.29 ఎకరాలు, 255లో 3.19, 274లో 1.32, 614లో 2.21 ఎకరాల చొప్పున మొత్తం 25.19 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో 3 ఎకరాలు సాగు చేయకుండా వదిలేయడంతో తుమ్మ చెట్లు మొలిచాయి. వాటిని సైతం విక్రయించుకోగా మళ్లీ మొలిచాయి. మిగిలినది సారవంతమైనది కౌలు రైతులు సాగుచేస్తున్నారు.

కౌలు ధర చాలా తక్కువ

దశాబ్దాల కాలం నుంచి ఆలయ భూములను ధూప, దీప నైవేద్యం కోసం ఎండోమెంట్ శాఖనే కౌలుకు ఇస్తోంది. యేడాదికి ఒకసారి కౌలును ఖరారు చేస్తున్నారు. కౌలు ధర చాలా తక్కువగా ఖరారు చేస్తుండడంపై గ్రామస్థులు ఎండోమెంట్‌శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ భూముల చుట్టు ఉన్నవారే కౌలు వేలంలో పాల్గొని ఇతరులను రానివ్వడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూములకు దారులు లేవని ఇతరు వస్తే రానివ్వమంటూ చుట్టు ఉన్న రైతులు నామమాత్రంగా కౌలును చెల్లిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెరువు కింది ఆయకట్టు పారకం భూములకు నీరు పోకుండా కాలువలను ధ్వంసం చేసి నీటి వసతి లేదని చూపిస్తున్నారు. 25 ఎకరాలకు కేవలం సంవత్సరానికి రూ.60 వేలు మాత్రమే కౌలు ఖరారు చేస్తుండడం గమనార్హం. వాస్తవానికి తరి ఎకరానికి రూ.8 వేలు, ఖుష్కి రూ.12వేల వరకు కౌలు ధర నీటి వసతిని బట్టి పలుకుతోంది. విచిత్రమేమిటంటే.. గొర్రెల కాపరులు తమ గొర్రెలకు పచ్చి గడ్డిని మేపుకునేందుకు ఎకరానికి రూ.4వేల చొప్పున చెల్లిస్తుండగా పంటలను సాగుచేసుకునే కౌలు రైతులు మాత్రం ఎకరానికి రూ.2,500 ఇవ్వడం శోచనీయం.

భూమిని సర్వేచేసి హద్దులు ఖరారు చేస్తాం..

ఆలయ భూమి ఎక్కడెక్కడా ఉందో సర్వే చేసి హద్దులు ఖరారు చేస్తాం. పంట కాలువలను నక్షప్రకారం పునరుద్ధరిస్తాం. భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలకు సిఫార్సుచేస్తాం. ఇక నామమాత్రపు కౌలుకు ఇవ్వం. విలువైన భూములను కాపాడుకుంటాం. రెండు, మూడు రోజుల్లోనే సర్వేను ప్రారంభిస్తాం.

- సంజీవరెడ్డి, ఎండోమెంట్ వరంగల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్


కక్కిరాలపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయం

10 ఎకరాల విలువైన భూమి మాయం

ఆలయానికి చెందిన 25.19 ఎకరాల భూమిలో ఇప్పటికే 10 ఎకరాల వరకు తారుమారు అయింది. మిగిలిన భూమిని కొందరు కౌలు రైతులు కొంచెం కొంచెం అన్నట్లుగా తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. ప్రతీ యేడు కౌలు వేలం నిర్వహించిన సమయంలో ఇతరులను వేలంలో పాల్గొనకుండా అడ్డుకుంటున్నారు. ఈనెల 18న కౌలు వేలం వేయడానికి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవో వెళ్తే కౌలు వేలం వేయనీయకుండా పంపించేశారు.

సర్వే చేసి భూమికి హద్దులు పాతాలి..

ఎండోమెంట్ శాఖ అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా భూమిని సర్వే చేసి కబ్జాకు గురైన భూమిని వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంతేకాదు.. హద్దులను తొలగించినవారిపై చర్యలు తీసుకొని హద్దులు వేయాలని కోరుతున్నారు. ఆలయ భూములకు దారులను కల్పించి, ఆలయ భూములపై పెత్తనం చేసే వారికి మళ్లీ భూములు కౌలుకు ఇవ్వకూడదని వాపోతున్నారు. కౌలు వేలంలో అందరు పాల్గొనేవిధంగా చొరవతీసుకోవాలి, కౌలు వేలం ఎవరు ఎక్కువ ఇస్తే వారికే కౌలుకు ఇవ్వాలి. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే చొరవతీసుకొని సర్వేచేయించి భూములకు అండగా నిలువాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఐటీఐలకు మహర్దశ

(3వ పేజీ తరువాయి)

ప్రకారం ఈ ఏటీసీ భవనాలు 180 x 75 అడుగుల వైశాల్యంతో ఉంటాయి. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ఆరు ప్రభుత్వ ఐటీఐలలో ఒక్క ములుగు రోడ్డులోని ఐటీఐలో తప్ప మిగతా వాటిలో అంత స్థలం అందుబాటులో లేదు. రాష్ట్రంలోని మిగతా ఐటీఐల పరిస్థితి కూడా ఇదే. దీనితో వేరే చోట స్థలం సేకరించే ప్రయత్నంలో ఉన్నారు. దీనితో ఇప్పటికే మొదలు కావలసిన ఏటీసీ భవనాల పనులు తాత్కాలికంగా ఆగిపోయాయి. ములుగు రోడ్డులోని ఐటీఐలో చాలినంత స్థలం అందుబాటులో ఉన్నందువల్ల ఈ క్యాంపస్‌లో రెండు ఐటీసీల భవనాలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నారు. కాజీపేట ఐటీఐలో చాలినంత స్థలం లేదు. దీని వెనుక కొంత దూరంలో ఉన్న ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ఉన్న కొంత స్థలాన్ని దీనికి కేటాయించారు.

జర్నలిస్టులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్, జూన్ 23: జర్నలిస్టులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉద్బోధించారు. ఆదివారం కేయూ రెగ్యులర్ కోర్సు జర్నలిజం విభాగంలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడారు. విద్యార్థులు దూరవిద్య కేంద్రంలోని మీడియా యూనిట్, స్పోకెన్ ఇంగ్లీష్ ల్యాబ్, లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేడియో పాఠాలను రికార్డు చేసి ఎడిటింగ్ చేయడంలో నైపుణ్యాలు సాధించాలని చెప్పారు. సమాజంలోని సంఘటలను ఆకళింపుచేసుకుని వాస్తవాలను వెలికితీయాలని సూచించారు. జర్నలిస్టులు గొంతులేనివారికి ఆసరాగా నిలవాలన్నారు.

జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఇంగ్లీష్‌పై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగాలొస్తాయని చెప్పారు. కేయూ రెగ్యులర్ జర్నలిజం కోర్సుల్లో ప్రవేశాలు పెరిగాయని, ఏడాదికి 10/15 మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ డ్యాన్స్‌లతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నరసింహరాములు, డాక్టర్ డి.శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ వంగాల సుధాకర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, మోటే చిరంజీవి, విద్యార్థులు సురేశ్, మానస, శివకృష్ణ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామచంద్రం

అనాథ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

వడ్డెపల్లి, జూన్ 23: హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని ఒయాసిస్ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండల సమ్మయ్య ఆదివారం ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యా దానం గొప్పదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు మండల సంధ్య, తాళ్లపల్లి రవీందదర్ (జేకే), జనగాం శ్రీనివాస్‌గౌడ్, ఆశ్రమ నిర్వాహకులు చంద్రప్రకాశ్, కార్తీక్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మడికొండ, జూన్ 23: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్), అనుబంధ సంస్థల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధిలోని కొత్తపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో గోవిందు నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జూలై 7న జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతులో మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు పోలెపాక భాస్కర్, ఉపాధ్యక్షులు పోలెపాక మాధవ్, ప్రధాన కార్యదర్శి చిల్కాల ఎలేందర్, కోశాధికారి పోలెపాక జా న్, సలహాదారులు పోలెపాక కిరణ్, కిష్టయ్య, రాజు, నాయకులు రాజమల్ల రాజు, పోలెపాక రాజేష్, బొందుగుల వెంకటస్వామి, పోలెపాక రమేష్, చిట్యాల సర్వర్, చిట్యాల రోహిత్, యాకూబ్, శ్రీను, భాను, సంజయ్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి


హంటర్‌రోడ్డులో ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రావు పద్మరెడ్డి

హనుమకొండ టౌన్, జూన్23: దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన వ్యక్తి డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూ కశ్మీర్‌కు ఉన్న స్వయం ప్రతిపత్తి తొలిగించి సమైక్య భారత్ సాధించి ముఖర్జీ కలను మోదీ నెరవేర్చారన్నారు. ఒకే దేశంలో రెండు విధానాలు ఉండకూడని నినదించిన వ్యక్తిని స్మరించుకోవడం సంతోషకరమైన విషయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, జిల్లా నాయకులు జువ్వాడి నరసింగరావు, పాశికంటి రాజేంద్రప్రసాద్, గాదె రాంబాబు, జైపాల్‌రెడ్డి, నాను నాయక్, కళ్యాణ్, ప్రసాద్, సంపత్‌రెడ్డి, నిరంజన్, వెంకటేశ్, కొండం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 56 డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు మందోటి మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బలిదాన్ దివస్ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించి, మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జన్ను మధు, లేగల శివరాం, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి అమృతరావు, కటకం రాజేశ్, అలుగునూరి కృష్ణంరాజు, డివిజన్ ఇంచార్జీ బండి హరీశ్, సీనియర్ నాయకులు కొటగిరి నరేందర్, వెల్పుల శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండ: మడికొండ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ జల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు మాట్లాడుతూ.. ఒకే దేశంలో ఒకే జెండా, ఒకే ప్రధాని, ఒకే రాజ్యాంగం ఉండాలని, భారతీయత ఆధారంగా 1951 అక్టోబర్ 21న భారతీయ జనసంఘ్‌ని స్థాపించి అఖండ భారతావని కోసం అసువులు బాసిన మహానుభావుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ప్రధాని నరేంద్రమోదీ 370 ఆర్టికల్‌ను రద్దు చేసి శ్యాంప్రసాద్ కలను నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, సీనియర్ నాయకులు కందుకూరి బాలరాజు, కేతిక సదానందం, బొల్లికొండ వినోద్‌కుమార్, భైరపాక వెంకటేష్, కొలిపాక కుమార్‌బాబు, గడ్డం కుమార్, మాచర్ల రంజిత్, పల్లకొండ రాజేందర్, పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పడుతాయి

హైదరాబాద్ ఏసీపీ శోభన్‌కుమార్

హసన్‌పర్తి, జూన్ 23: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని హైదరాబాద్ ఏసీపీ పుల్లా శోభన్‌కుమార్ అన్నారు. ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలుర, బాలికల, పురుషుల, మహిళల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏసీపీ శోభన్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడలతో శరీర దారుఢ్యంతో పాటు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. బ్యాడ్మింటన్ ఆటతో శరీరంలోని ప్రతీ అవయవం కదలిక జరిగి శరీరం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు సిద్ధాంతాన్ని పాటించాలన్నారు. క్రీడాకారులు రాష్ట్ర జాతీయస్థాయిలో పాల్గొని జిల్లాకు పేరు, ప్రఖ్యాతులు తీసుకరావాలని తెలిపారు. అనంతరం డబ్ల్యూడీబీఏ ప్రధాన కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పోటీల్లో అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 బాలుర, బాలికలు, మహిళలు, పురుషులు పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూడీబీఏ ట్రెజరర్ డి.నాగకిషన్, కిట్స్ పీడీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతుపన్న ఏసీపీ శోభన్‌కుమార్

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

హసన్‌పర్తి, జూన్ 23: హసన్‌పర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1980-81 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. ఆదివారం హసన్‌పర్తి సంస్కృతీ విహార్‌లో కలుసుకుని కుటుంబ, ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో తాళ్ల విద్యాసాగర్, కేదాసి వెంకటేశ్వర్లు, మాటేటి రవిందర్, ఇందిర, కృష్ణవేణి, కుమారస్వామి, మారం నరేందర్, పిట్టల కుమారస్వామి, కాంతారావు, ఆమంచ ప్రకాశ్, మారపెల్లి రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జోరుగా 'ఉపాధి' పనులు

• టార్గెట్ 23 లక్షల పని దినాలు
• ప్రస్తుతం నర్సరీల్లో కొనసాగుతున్న పనులు
• కూలీలకు సౌకర్యాలు కల్పించిన అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 23: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ సంవత్సరం కూలీలకు 23 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకు కూలీలకు 15 లక్షలకుపైగా పని దినాలు కల్పించారు. ప్రస్తుతం గ్రామాల్లోని నర్సరీల్లో ఫిల్లింగ్ ప్లాంటేషన్ పనులు కొనసాగుతున్నాయి. కూలీలు నర్సరీల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలవడంతో నర్సరీల్లోని మొక్కలను గ్రామాలకు పంపిణీ చేయంతో పాటు రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటనున్నారు. కూలీలు పనులు చేస్తున్న దగ్గర అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

టార్గెట్ 23లక్షల పని దినాలు

జిల్లాలోని ఉపాధిహామీ కూలీలకు ఈ పథకం కింద 23 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. కూలీలకు ఉపాధి పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పనులు సరిగా కల్పిస్తుండడంతో కూలీలు కూడా ఉత్సాహంగా పనులకు వెళుతున్నారు. ఈ పథకం కింద జిల్లాలో కూలీలకు నిరంతరం పని కల్పించనున్నారు.

కూలీలకు సకల సౌకర్యాలు

జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలు డీఆర్‌డీఏ అధికారులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా అందజేస్తున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించడంతో కూలీలు కూడా ఎంతో ఉత్సాహంగా పనులు చేసుకుంటున్నారు. ఉపాధిహామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా కూలీలకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తుండటంతో కూలీలు పనులపై ఆసక్తి చూపుతున్నారు.

టార్గెట్ చేరుకుంటాం..

జిల్లాలో ఉపాధిహామీ కూలీలకు 23లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ దిశగా ముందుకు వెళుతున్నాం. ఇప్పటివరకు కూలీలకు 15 లక్షలకు పైగా పని దినాలు కల్పించాం. కూలీలకు కూలీ చేసే దగ్గర అన్ని సౌకర్యాలు కల్పించడంతో కూలీలు కూడా పనులపై ఆసక్తి చూపుతున్నారు. కూలీలకు నిరంతరం పని కల్పిస్తాం.

- కె. నాగపద్మజ, డీఆర్‌డీఏ

విన్నర్



బ్రిటన్‌కు పన్ను పాఠాలు

తెలుగు నేలపై పుట్టి... విదేశీ గడ్డపై అడుగుపెట్టి... మన కీర్తిని ఎలుగెత్తి చాటారు అర్చనారావు దన్నమనేని. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) రెవెన్యూ అండ్ కస్టమ్స్ విభాగంలో సీనియర్ సివిల్ సర్వెంట్‌గా విధులు నిర్వరిస్తున్న ఆమె... అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. సరికొత్త విధానాలతో ఆ దేశ ఖజానాకు రెండు బిలియన్ పౌండ్స్ ఆదాయం సమకూర్చినందుకు గుర్తింపుగా... ప్రతిష్ఠాత్మక 'మెంబర్స్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' (ఎంబీఈ) అవార్డుకు ఎంపికయ్యారు. ఆ విశేషాలను యూకే నుంచి 38 ఏళ్ల అర్చనారావు 'నవ్య'తో పంచుకున్నారు.

"ఎక్కడో భారత్ నుంచి వచ్చి... ఒంటరిగా ప్రయత్నించి... ఇవాళ ఈ స్థాయిలో నిలబడ్డానంటే ఎంతో సంతోషంగా ఉంది. ఆత్మవిశ్వాసంతో వేసే ప్రతి అడుగూ... అంకితభావంతో చేసే ప్రతి పనీ... నిజాయితీగా పడే కష్టం... మనల్ని విజయానికి చేరువ చేస్తాయి. అందుకు ఇవాళ నాకు దక్కిన 'మెంబర్స్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' (ఎంబీఈ) అవార్డు ప్రత్యక్ష సాక్ష్యం. వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందించే పౌరులకు యూకేలో ఈ అవార్డు ఇస్తారు. ఇక్కడ నేను రెవెన్యూ అండ్ కస్టమ్స్ (హెచ్ఎంఆర్సీ) విభాగంలో సీనియర్ సివిల్ సర్వెంట్‌ని. కర్తవ్య నిర్వహణలో నా సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. నేను తీసుకువచ్చిన కొన్ని నూతన పద్ధతులవల్ల దేశ ఖజానాకు గతంలో ఎన్నడూ లేని విధంగా మా విభాగం నుంచి రెండు బిలియన్ పౌండ్స్‌కు పైగా ఆదాయం సమకూరింది. ఆ మొత్తం ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు తదితర అవసరాలకు వినియోగిస్తారు. రికార్డు స్థాయిలో ఇంత ఆదాయం రావడానికి ప్రధాన కారణం... గతంలో ఉన్న లోతుపాతులను సవరించి నేను ఒక విధానం రూపొందించాను. ఇది నేను పని చేసే 'వీఏటీ' (వాల్యూ యాడెడ్ ట్యాక్సెస్) శాఖకే కాకుండా... ఇక్కడి అన్ని రకాల పన్నుల వసూలుకూ ఉపయోగకరంగా మారింది. పన్నుల్లో ఉన్న అంతరాలను తగ్గించి, జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చింది.



అరుదైన గౌరవం...

ఈ అవార్డు ఎంపిక కోసం స్వయంప్రతిపత్తి కలిగిన హానర్స్ కమిటీ ఒకటి ఉంటుంది. ఆ కమిటీ వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను వడపోసి, జాబితాను ప్రధానికి ప్రతిపాదిస్తుంది. ఆ ప్రతిపాదనలను ప్రధాని... కింగ్ చార్లెస్ ముందు ఉంచుతారు. ఆయన ఆమోదంతో నన్ను అవార్డుకు ఎంపిక చేశారు. త్వరలో బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో కింగ్ చేతుల మీదుగా ఎంబీఈ అవార్డు అందుకోబోతున్నాను. భారత్‌లో పద్మ అవార్డుల్లా ఇక్కడ నైట్‌హుడ్, ఓబీఈ, ఎంబీఈ' ప్రధానమైనవి. నైట్‌హుడ్ వస్తే వాళ్ల పేరు ముందు 'సర్' అని పెట్టుకోగలుగుతారు. నాకు 'ఎంబీఈ' వచ్చింది కాబట్టి నా పేరు తరువాత 'ఎంబీఈ' అని అఫీషియల్‌గా రాసుకోవచ్చు. యూకేలో వీరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. నాకు ఈ అవార్డు ప్రకటించాక... దేశంలోని రాజకీయ ప్రముఖులు, సన్నిహితుల నుంచి వందల సంఖ్యలో అభినందనల సందేశాలు వస్తున్నాయి. సాధారణంగా నా వయసు వారికి ఈ అవార్డు రావడం చాలా చాలా అరుదు. నేను నా వృత్తికే పరిమితం కాకుండా సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంటాను. పేదలు చదివే స్థానిక స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి సివిల్ సర్వీసెస్ అంటే ఏమిటి? మేమేం పని చేస్తాము? ఆ పరీక్షల్లో ఎలా రాణించాలి? తదితర విషయాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తుంటాను. వాళ్లకు నన్నొక ఆదర్శంగా చూపి, తద్వారా సివిల్స్ వైపు ప్రోత్సహించడానికి నా వంతు ప్రయత్నం చేస్తున్నా. అలాగే కొంత మంది కాలేజీ పిల్లలకు 'జాబ్ షాడో', అంటే మా కార్యాలయానికి వచ్చి నేను మా పని చూసే అవకాశం కల్పిస్తున్నాం. వీటితోపాటు మా జూనియర్స్‌కు కూడా శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకున్నాను.

నమ్మలేకపోతున్నాను...

ఈ అవార్డు రావడాన్ని అత్యంత గౌరవంగా భావిస్తున్నా. ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు. ఎందుకంటే ఇప్పటివరకు నేను చూసినవారిలో పెద్ద పెద్ద క్రీడాకారులు, ప్రముఖులు అవార్డు అందుకున్నవారిలో ఉన్నారు. ఫుట్‌బాల్ దిగ్గజం డేవిడ్ బెక్‌హామ్ లాంటివారు దీని కోసం కలలు కంటున్నారు. అంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం నాకు లభించిందంతే చాలా సంతోషంగా ఉంది. వేరే దేశం నుంచి వచ్చి, ఇక్కడ చదువుకొని, ఉద్యోగం చేస్తున్న నాకు దక్కడం నిజంగా అద్భుతంగా అనిపిస్తోంది. మా విభాగంలో 'ఎంబీఈ అవార్డు' అందుకోబోతున్న మొదటి వ్యక్తిని నేనే. నా పనిని నేను ఆస్వాదిస్తాను. అదే నా విజయ రహస్యం. అసలు అవార్డు కమిటీకి నా పేరు ఎవరు ప్రతిపాదించారో కూడా తెలియదు. గెజిట్‌లో ప్రచురితమయ్యాకే నేనూ చూశాను.

అంచెలంచెలుగా...

నేను సీనియర్ ట్యాక్స్ ప్రొఫెషన్ మేనేజర్‌ని. అలాగే 'వీఏటీ'లో మా యార్క్‌షైర్ రీజియన్‌కు సీనియర్ ట్యాక్స్ స్పెషలిస్ట్‌ను కూడా. మా దేశంలోని బడా కంపెనీలు... అంటే మైక్రోసాఫ్ట్, జీఈ క్యాపిటల్ లాంటి రెండొందల బిలియన్ల టర్నోవర్ దాటిన బిజినెస్‌కు సంబంధించి ట్యాక్స్ కలెక్షన్ నా విధి. నేను డీల్ చేసిన ప్రతి కేసులోనూ ఏదో ఒక తప్పు పట్టుకోగలిగాను. అలాంటివి పునరావృతం కాకుండా ఒక విధానం తీసుకువచ్చాను. యూకేలో నేను చేస్తున్న ఈ ఉద్యోగం భారత్‌లో సివిల్ సర్వీస్‌తో సమానం. అక్కడ యూపీపీఎస్సీలానే... ఇక్కడా పరీక్ష ఉంటుంది. అందులో ఉత్తీర్ణత సాధించి, 2014లో ఈ పోస్టు సంపాదించాను. అయితే ఎంపికయ్యాక నాలుగేళ్ల శిక్షణ ఉంటుంది. తరువాత మళ్లీ పరీక్ష పెడతారు. అందులో ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం పోతుంది. అన్ని మెట్లూ ఎక్కి... ఇలా స్థిరపడ్డాను. నాటి నుంచి వివిధ హోదాల్లో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగాను.

ఒకే ఒక్క లక్ష్యంతో...

నేను పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. టెన్త్ వరకు 'హైదరాబాద్ పబ్లిక్ స్కూల్'లో చదివాను. చెన్నై 'ఎస్ఆర్ఎం'లో ఇంజనీరింగ్ (ఈసీ) చేశాను. స్కాట్‌లాండ్ రాజధాని ఎడిన్‌బరాలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విత్ హ్యూమన్ రీసోర్సెస్ మాస్టర్స్ (2008) చదివాను. అవ్వగానే కొన్నేళ్లు లీడ్స్‌లోని ఓ కంపెనీ హెచ్ఆర్ విభాగంలో పని చేశాను. అప్పుడు కూడా పద్దెనిమిది వేల మంది సిబ్బంది బాధ్యతలు చూసుకొనేదాన్ని. అయితే చిన్నప్పటి నుంచి నా ఆకాంక్ష ఏంటంటే... సివిల్స్ సాధించాలని. భారత్‌లో ఉన్నా కచ్చితంగా దాని కోసమే ప్రయత్నించేదాన్ని. యూకేలో ఉన్నాను కాబట్టి... ఇక్కడ పట్టుబట్టి సాధించాను. అప్పటి నుంచి హెచ్ఎంఆర్సీలో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నాను.

స్వయంకృషితో సాధించాలని...

ఇంజనీరింగ్ చదివేటప్పుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో చాలా కంపెనీల్లో ఉద్యోగం వచ్చింది. కానీ మాస్టర్స్ చేయాలన్నది నా ధ్యేయం. మా అమ్మ నీరజ, నాన్న అశోక్‌రావు కూడా ఓకే అన్నారు. ఏ అమెరికానో వెళ్లకుండా యూకే ఎందుకు వచ్చానంటే... ఇక్కడ మా కుటుంబ స్నేహితులు, బంధువులు ఎవరూ లేరు. యూఎస్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో చాలామంది ఉన్నారు. ఎవరి సాయం లేకుండా స్వయంకృషితో ఎదిగి, ఉన్నత స్థానంలో నిలవాలనేది నా సంకల్పం. మా అమ్మానాన్నలకు నేను ఒకేఒక్క కూతుర్ని అయినా... నా అభీష్టాన్ని ఎప్పుడూ కాదనలేదు. ముఖ్యంగా మా నాన్న ఎంతో ప్రోత్సహించారు. సివిల్స్ లక్ష్యం కనుక... 2014లో యూకే పౌరసత్వం రాగానే పరీక్ష రాశాను. ఎంపికయ్యాను.

నాలాగా మరికొందరిని...

వచ్చిన కొత్తల్లో నాతో చాలామంది చెప్పిందేమంటే... జాతి వివక్ష ఉంటుందని. పరాయి దేశస్తులు ఉన్నత స్థానాల్లో కనిపించడం చాలా అరుదనీ అన్నారు. అలాంటిది నేను సివిల్స్ సర్వెంట్‌ను అయ్యాక... వారంతా నన్ను తమ రోల్ మోడల్‌లా భావిస్తున్నట్టు చెప్పారు. ఇప్పుడు ఈ అవార్డు వచ్చినందుకు నాకంటే వాళ్లే ఎక్కువ సంతోషపడుతున్నారు. వాళ్ల తమ లక్ష్యాలు సాధించడానికి 'లీడర్‌షిప్ ప్రోగ్రామ్' ద్వారా నేను కూడా సహకరిస్తుంటాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యేవారికి మెళకువలు నేర్పి, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంటాను.

> **అదే నా బలం...**
>
> కష్టపడేతత్వం, సాధించేవరకు ప్రయత్నించడం... ఇదే నా బలం. నాలో ఇంతటి ఆత్మవిశ్వాసం రావడానికి, నాయకత్వ లక్షణాలు అలవడటానికి కారణం నేను చదివిన హెచ్‌పీఎస్. అప్పట్లో అథ్లెటిక్స్‌లో కూడా ముందుండేదాన్ని. స్కూల్లో ఏది జరిగినా అందులో నేనుండేదాన్ని. ఇప్పుడు కూడా సివిల్ సర్వీస్ స్పోర్ట్స్‌లో బ్యాడ్మింటన్ ఆడుతున్నా. రీజినల్ ఉమెన్ బ్యాడ్మింటన్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌ని.

నేనేంటో నాకు తెలుసు...

నేను నిర్వహించే ఖాతాలన్నీ దేశంలోని టాప్ కంపెనీలవి. వాళ్లకు డబ్బు కావచ్చు, న్యాయకోవిదుల బృందం కావచ్చు... చాలా బలంగా ఉంటాయి. వారికి వ్యతిరేకంగా మనం ఏదైనా వాదించి, నెగ్గుకురావడం సామాన్యమైన విషయం కాదు. ఎందుకంటే సంపన్నులు కనుక ఏదైనా పొందగలమనే ఒక అహంకారం ఉంటుంది వారికి. మనకు సంబంధిత విషయాల మీద పూర్తిస్థాయి అవగాహన, నైపుణ్యం లేకపోతే అడుగు ముందుకు వేయలేం. అలాంటి సవాళ్లు నేను అనేకం ఎదుర్కొన్నాను. చాలా కేసుల్లో నెగ్గాను. ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ సమర్థవంతంగా తిప్పికొట్టగలిగాను. ఇవన్నీ వృత్తిలో భాగం. నేనేంటో నాకు తెలుసు. కనుకనే ఎదుటి వ్యక్తి ఎంతటివారైనా బెదిరేది లేదు. అదేవిధంగా మేమంటే వాళ్లూ భయపడతారు. ఎందుకంటే ఏ చిన్న తప్పు పట్టుకున్నా అది ఆ కంపెనీ మీద పెద్ద ప్రభావం చూపిస్తుంది కదా.

వివక్ష చూశాను...

మావారు కూడా లీడ్స్ యూనివర్సిటీలో చదువుకున్నారు. మా మామగారు సింగరేణిలో పని చేసేవారు. మేం ప్రస్తుతం లీడ్స్‌లో ఉంటున్నాం. మా అమ్మానాన్నలా మావారు కృష్ణకిషోర్ కూడా నాకు ఎంతో మద్దతునిస్తారు. ప్రోత్సహిస్తారు. ఆయనా మంచి పొజిషన్‌లో ఉన్నారు. ఇక్కడ కూడా మహిళల పట్ల వివక్ష కనిపిస్తుంది. నా విషయమే తీసుకొంటే... హఠాత్తుగా ఒక మహిళను ఇలా ఉన్నత స్థానంలో చూసే సరికి కొందరు తట్టుకోలేకపోయారు. మొదట్లో నేను ఒక కంపెనీకి వెళ్లినప్పుడు ఇంగ్లీష్‌వాళ్లు... 'ఏంటీ..! ఇంత చిన్న పిల్లల్ని కూడా ఇప్పుడు బయటకు పంపుతున్నారా' అని అన్నారు. ఇలాంటివెన్నో దాటి ఇవాళ నేను ఈ స్థాయిలో నిలబడ్డానంటే ఎంతో గర్వంగా ఉంది. నేను పని చేస్తున్న విభాగానికే కాదు... మొత్తం సివిల్ సర్వీస్‌కు కూడా ఇక్కడ ఒక హెడ్ ఉంటారు. ఆ స్థాయికి చేరాలన్నది నా ఆశయం."

● హనుమా

కృషి మిత్ర

"వ్యవసాయం లాభసాటిగా మారాలి. రైతులు హుందాగా జీవించాలి. గ్రామాల నుంచి వలసలు ఆగిపోవాలి. ఇవీ నా కలలు" అని చెబుతుంది పద్దెనిమిదేళ్ళ మునీ ముత్కామీ. కరువు గడ్డగా పేరుపడిన తమ ప్రాంతంలో... మార్పుకోసం ఆమె చేపట్టిన చిన్న ప్రయత్నం రైతులకు ఆశారేఖగా మారింది. 'కృషిమిత్ర'గా గుర్తింపు పొందిన మునీ కథ ఇది.




"మాది ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లాలో కుర్తి అనే గ్రామం. కోయ తెగకు చెందిన కుటుంబం. మా జిల్లా దుర్భిక్షానికి మారుపేరైన గిరిజన ప్రాంతం రైతులు ఎక్కువగా వరినే పండిస్తూ ఉంటారు. వర్షపాతం సరిగ్గా ఉండకపోవడానికి తోడు సంప్రదాయికమైన సాగు పద్ధతులు, పొలాల్లోకి జంతువులు యథేచ్ఛగా ప్రవేశిస్తూ ఉండడం... ఇవన్నీ వారి జీవితాలను దుర్భరం చేశాయి. ఏటా అప్పో సప్పో చేసి పంటలు వేయడం, తీవ్ర నష్టాల పాలు కావడం, యువకులు, మధ్య వయస్కులు తమ కుటుంబాలను గ్రామాల్లోనే వదిలేసి, పొట్టపోసుకోవడం కోసం వేరే ప్రాంతాలకు... ప్రధానంగా సరిహద్దుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళడం మామూలైపోయింది. ఇవన్నీ చూస్తూ పెరిగాను. ఈ పరిస్థితులు మారాలంటే ఏం చెయాలనే ఆలోచన నన్ను వేధించేది. నేను ఎనిమిదో తరగతితో చదువు ఆపేసినా... పత్రికలు చదవడం, కొత్త విషయాలు తెలుసుకోవడమంటే ఆసక్తి. మూడేళ్ళ కిందట మల్కాన్‌గిరి ప్రాంతంలో... రాష్ట్రప్రభుత్వ భాగస్వామ్యంతో స్వామినాథన్ ఫౌండేషన్ ఒక ప్రాజెక్ట్ ప్రారంభించిందనే వార్త నన్ను ఆకర్షించింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, గిరిజనుల జీవితాలను మెరుగుపరచడానికి రబీ సీజన్ కోసం ఉచితంగా విత్తనాలను, పరికరాలను ఆ ఫౌండేషన్ అందిస్తోందని తెలిసింది. మా ప్రాంతంలో రబీ సాగు చేయరు. దానివల్ల రైతులకు కలిగే లాభాల గురించి తెలుసుకోవడానికి ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రతించాను. క్షేత్రస్థాయిలో అవగాహన పెంచడం కోసం అవగాహన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ, ఆసక్తి ఉంటే హాజరు కావచ్చనీ వారు చెప్పారు. నేను ఉత్సాహంగా "సరే" అన్నాను. సేంద్రియ పద్ధతుల ద్వారా ఫలసాయాన్ని పెంచే ఆధునిక పద్ధతులు ఎన్నో నేర్చుకున్నాను. వాటిలో... వ్యవసాయంలో రబీ విత్తనాల ప్రాధాన్యత, భూసారాన్ని పెంచడం, చీడపీడల నివారణ, జంతువులు చొరబడకుండా నిరోధించడానికి పొలం చుట్టూ కంచెల ఏర్పాటు, సేంద్రియ వర్మీ కంపోస్ట్ తయారీ పద్ధతులు... ఇలా ఎన్నో ఉన్నాయి. రబీ సాగు వైపు మా ఊరి రైతులు మొగ్గు చూపిస్తే... విత్తనాలను, ఇతర ప్రాజెక్ట్ ఉపకరణాలను ఉచితంగా అందిస్తామని అధికారుల నుంచి హామీ తీసుకున్నాను.

ఇరు పక్షాలకూ ప్రతినిధిని...

"రైతులను ఒప్పించడం మాకు పెద్ద సమస్యగా మారింది. కొత్త పద్ధతుల్లోకి మారడానికి వారు త్వరగా ఇష్టపడరు. వాళ్ళకూ, మాకూ మధ్య నువ్వు వారధిలా పని చేస్తే... వారిలో అవగాహన పెంచడం, ఈ ప్రాంతంలో నైపుణ్యాభివృద్ధి కోసం చర్యలు చేపట్టడం మాకు సులువవుతుంది" అని అధికారులు చెప్పారు. నాకు మా గిరిజన తెగలు మాట్లాడే మాండలికంతో పాటు ఒరియా కూడా బాగా వచ్చు. అందుకే... సదస్సుల్లో శాస్త్రవేత్తలు, అధికారులు చెప్పిన విషయాలను స్థానికులకు అర్థమయ్యేలా వివరించేదాన్ని. అధికారులతో పాటు దాదాపు ప్రతి గ్రామం తిరిగాను. అక్కడి రైతుల సమస్యలు తెలుసుకొని, అధికారులకు రాతపూర్వకంగా అందజేస్తూ వచ్చాను. ఒక విధంగా అటు ఆ ప్రాజెక్టుకు, ఇటు రైతులకు... ఇరుపక్షాలకూ నేను ప్రతినిధిని. నేను తెలుసుకున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులన్నీ గ్రామస్తులకు నేర్పాను. పెసర సాగు చేయాలని సూచిస్తే... అయిష్టంగానే వాళ్ళు ఒప్పుకొన్నారు. ముప్పై ఎకరాల్లో వేసిన పెసర పంటకు మంచి ఫలసాయం రావడంతో... మరుసటి ఏడాది ఎక్కువమంది రైతులు పెసర, వినప పంటలను... వరితో పాటు అదనంగా మరో యాభై ఎకరాల్లో వేశారు. జంతువులు చొరబడకుండా కంచె ఏర్పాటు చేశాం. పంటల్లోని వైవిధ్యం లాభసాటి అని మా ప్రాంత గిరిజన రైతులు ఇప్పుడు గ్రహించారు. జొన్న, వేరుశనగ, కూరగాయల సాగుతో అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. వారు పండించినదానిలో వ్యక్తిగత అవసరాలకు సరిపోయేంత దాచుకొని... విగిలినదాన్ని మార్కెట్‌లో లాభానికి అమ్ముకొనేలా ప్రోత్సహిస్తున్నాం. గ్రామాల్లో రైతుల అవసరాలను గుర్తించి, సాగులో వారికి ఎదురవుతున్న సవాళ్ళను అధికారులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురావడానికి మా జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నాను. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారికి అందించడానికి ప్రయత్నిస్తున్నాను. కిందటి ఏడాది 'ఒడిశా లైవ్‌లీహుడ్ మిషన్' నన్ను 'కృషిమిత్ర'గా గుర్తించి సత్కరించింది. ఏ గ్రామానికి వెళ్ళినా... ప్రజలు నన్ను అభినందిస్తున్నారు, గౌరవిస్తున్నారు. ఇప్పుడు ఆపేసిన నా చదువును మళ్ళీ ప్రారంభించాలనుకుంటున్నాను. తద్వారా మరిన్ని విషయాలు తెలుసుకోవడానికీ, ప్రజలకు మరింత సాయపడడానికీ వీలుంటుంది. ఎవరూ గ్రామాలు విడిచి వెళ్ళకుండా... తమ సొంత భూముల ద్వారానే మంచి ఆదాయం పొందుతూ హుందాగా జీవించాలనేది నా కోరిక. అది నెరవేరేదాకా కృషి చేస్తూనే ఉంటాను."



నవ్య | చిత్రజ్యోతి



కశ్మీర్‌లో డ్యూయెట్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఓ అందమైన డ్యూయెట్ పాటను నాలుగు రోజులుగా కశ్మీర్‌లో షూట్ చేస్తున్నారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్న ఈ పాట అందరినీ ఆకట్టుకుంటుందని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ:ఆయనంక బోస్, సంగీతం:మిక్కీ.జే.మేయర్.

ఘనవిజయం సాధిస్తుంది



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మధురం'. 'ఏ మెమరబుల్ లవ్' అనేది ఉపశీర్షిక. రాజేశ్ చికిలే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎం. బంగార్రాజు నిర్మిస్తున్నారు. టీనేజ్ ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను ఆదివారం హీరో నితిన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్ చాలా బాగుంది. కచ్చితంగా 'మధురం' ఘన విజయం సాధిస్తుంది" అని అన్నారు. ఉదయ్‌రాజ్ మాట్లాడుతూ "ఈ సినిమా యువతరాన్ని, కుటుంబప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌కు మైలురాయిగా మిగులుతుంది" అని చెప్పారు. దర్శకుడు రాజేశ్ చికిలే మాట్లాడుతూ "1990 నేపథ్యంలో సాగే ఈ చిత్రం అందరినీ ఆ కాలానికి తీసుకువెళ్తుంది" అని చెప్పారు. నిర్మాత ఎం. బంగార్రాజు మాట్లాడుతూ "అన్ని వర్గాల వారికి నచ్చేలా 'మధురం' ఉంటుంది" అని అన్నారు.




నటి సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్ వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. ముంబైలో జరిగిన ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలను ఈ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో షేర్ చేశారు. సోనాక్షి, ఇక్బాల్ వివాహ పత్రాలపై సంతకం చేస్తున్న ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. "సరిగ్గా ఏడేళ్ల క్రితం ఇదే రోజు మా మధ్య ప్రేమ చిగురించింది. ఆ క్షణం నుంచి ఇద్దరం ఎన్నో కష్టసుఖాలను కలసి ఎదుర్కొని.. ఇప్పుడు ఒక్కటయ్యాం. ఇవి మా జీవితాల్లోనే మధుర క్షణాలు. కుటుంబ సభ్యుల ఆశీస్సులతో.. మా ఇద్దరి మధ్యనున్న ప్రేమతో కలకాలం కలిసుంటాం" అని వారు పేర్కొన్నారు. ఈ పెళ్లి వేడుకకు ఇరువురి కుటుంబ సభ్యులతో పాటు సిద్ధార్థ్,అదితి రావు హైదరీ, హ్యూమా ఖురేషి, సకీబ్ సలీమ్, అర్పితా ఖాన్, ఆయుష్ శర్మ విచ్చేశారు.

నేడు పవన్ కల్యాణ్‌తో నిర్మాతల భేటీ

టాలీవుడ్ నిర్మాతల బృందం నేడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను విజయవాడలోని క్యాంప్ ఆఫీసులో కలవనుంది. తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు, నిర్మాత అశ్వనీదత్, డి.వి.వి దానయ్య, చినబాబు, నవీన్ యెర్నేని, రవిశంకర్, నాగవంశీ విశ్వప్రసాద్, వివేక్, దామోదర్ ప్రసాద్, బోగవల్లి ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలపడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో ఎదురొన్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సహకరించాలని పవన్ కల్యాణ్‌ను కోరనున్నారు. సినిమా టిక్కెట్ ధరల పెంపులో వెసులుబాటు, థియేటర్ల సమస్యలపై చర్చించనున్నారు.

అభిమానికి క్షమాపణ



తనను కలిసేందుకు ప్రయత్నించిన అభిమాని పట్ల తన వ్యక్తిగత సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన తీరుపై నాగార్జున విచారం వ్యక్తం చేశారు. ఆయన ఎయిర్‌పోర్టులో నడుచుకుంటూ వస్తున్న సమయంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా నాగార్జున దగ్గరకు రాబోయాడు. బౌన్సర్లు అతన్ని పక్కకు తోసేశారు. అయితే ఈ విషయాన్ని గమనించని నాగార్జున ముందుకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యి.. నెగెటివ్ కామెంట్స్ వచ్చాయి. దీంతో నాగార్జున ఆ అభిమానికి క్షమాపణలు చెప్పారు. 'ఈ సంఘటన ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. అలా జరిగుండాల్సింది కాదు. మరోసారి ఇలాంటివి జరగకుండా చూసుకుంటాను' అని ఎక్స్‌లో తెలిపారు.

'రేవు' చెప్పే కథలు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డాక్టర్ మురళీ గింజుపల్లి నిర్మిస్తున్నారు. హరినాథ్ పులి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం చిత్రబృందం పాత్రికేయ సమావేశం నిర్వహించింది. సీనియర్ నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ 'మత్స్యకారుల జీవితాల్లోని ఇబ్బందులను నేపథ్యంగా ఎంచుకొని 'రేవు' సినిమా చేయడం మంచి ప్రయత్నం. ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'ఇప్పటివరకూ తెలుగులో పూర్తిగా 'రేవు' నేపథ్యంలో వచ్చిన సినిమా లేదు. ప్రేక్షకులకు ఈ సినిమా సరికొత్త అనుభూతిని అందిస్తుంద'న్నారు. ఫస్టుకాపీ చూశాను, సినిమా బాగా వచ్చింది, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. నటీనటులు అందరూ కొత్తవారే అయినా అద్భుతంగా నటించారని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సినీ పాత్రికేయుడు పర్వతనేని రాంబాబు, ప్రభు ప్రొడక్షన్ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్నారు.

దిక్సూచి
వరంగల్ ● సోమవారం 24 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

టీజీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

● ఎకానమీ

తెలంగాణ సేవల రంగం
వివిధ ఉప రంగాల విశ్లేషణ

తెలంగాణ సేవలరంగంలోని వివిధ ఉపరంగాలను కింది విధంగా వర్గీకరించి విశ్లేషణ చేయవచ్చు.

1. వ్యాపారం, మరమ్మతు, సేవలు, హోటళ్లు, రెస్టారెంట్లు
2. రవాణా, నిల్వ, సమాచారం, ప్రసార సేవలు
3. రియల్ ఎస్టేట్, భవనాల యాజమాన్యం, వృత్తిపరమైన సేవలు. 4. ద్రవ్య సేవలు 5. ప్రభుత్వ సేవలు
6. ఇతర సేవలు

తెలంగాణ సేవల రంగం అదనపు ఉత్పత్తి విలువలో ఉపరంగాల వాటా

2022-23 సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం సేవల రంగం అదనపు ఉత్పత్తి విలువలో 33.20 శాతం వాటాను రియల్ ఎస్టేట్స్, భవనాల యాజమాన్యం, ఇతర వృత్తిపరమైన సేవలు కలిగి ఉన్నాయి. ఆ తరవాత 28.34 శాతం వాటాను వ్యాపారం, మరమ్మతు, హోటళ్లు, రెస్టారెంట్లు కలిగి ఉన్నాయి.

2014-15, 2022-23 సంవత్సరాల మధ్య వ్యాపారం, మరమ్మతు, హోటళ్లు, రెస్టారెంట్లు తమ వాటాను 26 శాతం పెంచుకోవడం గమనార్హం. 2014-15 సంవత్సరంలో 22.4 శాతం ఉన్న ఈ ఉపరంగం వాటా 2022-23 సంవత్సరంలో 28.34 శాతంగా ఉంది. ఇదేకాలంలో రవాణా, నిల్వ, సమాచారం, ప్రసార సేవల వాటా 12.54 శాతం నుంచి 8.44 శాతానికి తగ్గింది. ద్రవ్యసేవల వాటా 10.58 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గింది. రియల్ ఎస్టేట్, భవనాల యాజమాన్యం, ఇతర వృత్తిపరమైన సేవల వాటా 2014-15 సంవత్సరంలో 33.88 శాతం ఉండగా 2022-23 సంవత్సరంలో 33.20 శాతంగా ఉంది. ప్రభుత్వ సేవల వాటా 6.0 శాతం నుంచి 5.67 శాతానికి తగ్గగా ఇతర సేవల వాటా 14.52 శాతం నుంచి 16.05 శాతానికి పెరిగింది.

ఉప రంగాల వృద్ధి

2014-15 నుంచి 2022-23 సంవత్సరాల మధ్య వ్యాపారం, మరమ్మతు, హోటళ్లు, రెస్టారెంట్లు సేవారంగంలోని ఇతర ఉపరంగాల కంటే అధిక ఉమ్మడి సగటు వార్షిక వృద్ధి రేటు 16.13 శాతాన్ని నమోదు చేశాయి. తరవాత ఇతర సేవలు 14.24 శాతం, రియల్ ఎస్టేట్, భవనాల యజమాన్యం, ఇతర వృత్తిపరమైన సేవలు 12.53 శాతం ఉమ్మడి సగటు వార్షిక వృద్ధిని ఇదే కాలంలో నమోదు చేశాయి.

వివిధ ఉపరంగాల వృద్ధి

ఉపరంగం	2014-15 నుంచి 2022-23 వరకు సాధించిన సగటు ఉమ్మడి వార్షిక వృద్ధి (%లో)
వ్యాపారం, మరమ్మతు, హోటళ్లు, రెస్టారెంట్లు	16.13
ఇతర సేవలు	14.24
రియల్ ఎస్టేట్, భవనాల యాజమాన్యం, వృత్తిపరమైన సేవలు	12.53
ప్రభుత్వ సేవలు	12.01
ద్రవ్య సేవలు	9.45
రవాణా, నిల్వ, సమాచారం, ప్రసార సేవలు	7.37

2014-15 నుంచి 2022-23 సంవత్సరాల మధ్యకాలంలో సేవారంగంలోని వివిధ ఉపరంగాలు నమోదు చేసిన వృద్ధిని కింది పట్టిక-1లో చూడవచ్చు.

సేవలరంగం స్థూల అదనపు ఉత్పత్తి విలువకు - ఉప రంగాల తోడ్పాటు:

వ్యాపారం, మరమ్మతు, హోటళ్లు, రెస్టారెంట్లు

ఈ ఉపరంగాన్ని తిరిగి రెండుగా విభజిస్తే 2022-23 సంవత్సరంలో వ్యాపారం, మరమ్మతు సేవలు ఈ ఉపరంగంలో 96.03 శాతం వాటాను కలిగి ఉన్నాయి. కాగా హోటళ్లు, రెస్టారెంట్లు కేవలం 3.97 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2022-23 సంవత్సరంలో సేవలరంగం అదనపు ఉత్పత్తి విలువలో వ్యాపారం, మరమ్మతు సేవలు 27.21 శాతం వాటాను కలిగి ఉండగా; హోటళ్లు, రెస్టారెంట్లు కేవలం 1.12 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

రవాణా, నిల్వ, సమాచారం, ప్రసార సేవలు

ఈ ఉపరంగాన్ని తిరిగి ఏడు రంగాలుగా విభజిస్తే రైల్వేలు 6.40 శాతం, రోడ్డు రవాణా 57.24 శాతం, వాయు రవాణా 2.52 శాతం వాటాను ఈ ఉపరంగంలో కలిగి ఉన్నాయి. అలాగే రవాణాకు అనుబంధంగా ఉండే సేవలు 8.28 శాతం, నిల్వ 1.29 శాతం వాటాను ఈ ఉపరంగంలో కలిగి ఉండగా; ఈ ఉపరంగం రెండో అతిపెద్ద వాటాను 24.27 శాతంలో సమాచార, ప్రసార సేవలు కలిగి ఉన్నాయి.

ద్రవ్య సేవలు

ద్రవ్య సేవల్లో బ్యాంకులు, బీమా సేవలు ప్రధానమైనవి. 2021-22 సంవత్సరంలో తెలంగాణలో ఒక లక్ష జనాభాకు 17.02 బ్యాంకు శాఖలున్నాయి. రాష్ట్రంలో ఉన్న మొత్తం 5958 బ్యాంకు శాఖల్లో 3083 ప్రభుత్వరంగ బ్యాంకులు కాగా, 1507 ప్రైవేటురంగం బ్యాంకులు, 418 సహకార బ్యాంకులు, 920 గ్రామీణ బ్యాంకులు, 18 చిన్నతరహా ద్రవ్య బ్యాంకులు ఉన్నాయి. మొత్తం బ్యాంకు శాఖల్లో 45.85 శాతం పట్టణాల్లో, 30.51 శాతం గ్రామాల్లో ఉండగా, 23.63 శాతం పట్టణ సరిహద్దు గ్రామాల(సెమీ అర్బన్)లో ఉన్నాయి.



2020-21 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర స్థూల అదనపు ఉత్పత్తి విలువలో 4.47 శాతం వాటాను బ్యాంకింగ్, బీమా సేవలు కలిగి ఉన్నాయి. రాష్ట్ర స్థూల అదనపు ఉత్పత్తి విలువలో ఎక్కువ వాటాను కలిగి ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఏడోస్థానంలో ఉంది. 2021-22 సంవత్సరంలో ఈ వాటా 4.99శాతంగా ఉంది. 2014-15 సంవత్సరం నుంచి 2021-22 సంవత్సరాల మధ్య తెలంగాణ బ్యాంకింగ్, బీమా సేవలు 8.81శాతం ఉమ్మడి సగటు వార్షికవృద్ధిని నమోదు చేశాయి.

రియల్ ఎస్టేట్, భవనాల యాజమాన్యం, వృద్ధిపరమైన సేవలు

2014-15 సంవత్సరంలో రూ.96,912 కోట్లుగా ఉన్న ఈ ఉపరంగం అదనపు ఉత్పత్తి విలువ 2022-23 సంవత్సరంలో రూ.2,49,105 కోట్లుగా ఉంది. అంటే ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో 157.04 శాతం వృద్ధిని సాధించింది. అంతేకాకుండా ఇదేకాలంలో 12.53 శాతం ఉమ్మడి సగటు వార్షిక వృద్ధిలో 2.57 రెట్లు ఆదాయం పెంచుకుంది.

సమాచార, సాంకేతిక పరిజ్ఞానం, సంబంధిత సేవలు

2021-22 సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్రంలో 7,78,121 ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2014-15 సంవత్సరం నుంచి 2021-22 సంవత్సరాల మధ్యకాలం ఏడు సంవత్సరాలు ఈ రంగంలో ఉద్యోగిత ఉమ్మడి సగటు వార్షిక వృద్ధి 11.13 శాతం, 2014-15 సంవత్సరంలో ఈ రంగం నుంచి జరిగిన ఎగుమతుల విలువ రూ.66,276 కోట్లు కాగా 2021-22 సంవత్సరంలో రూ.1,83,569 కోట్ల విలువైన దిగుమతులు జరిగాయి.

ఈ కాలంలో ఎగుమతుల ఉమ్మడి సగటు వార్షిక వృద్ధి 15.67 శాతం. అయితే 2019-20 నుంచి 2020-21 మధ్యకాలంలో ఈ వృద్ధి 12.98 శాతం కాగా 2020-21 నుంచి 2021-22 సంవత్సరాల మధ్యకాలంలో 26.14 శాతం వృద్ధి నమోదైంది.



డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

50వ జీ-7 సమావేశం



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

50వ జీ-7 సమావేశాన్ని సభ్యదేశమైన ఇటలీ జూన్ 13 నుంచి 15 వరకూ అపూలియా రీజియన్‌లో గల బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో నిర్వహించింది. 2003 నుంచి అనుసరిస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా సభ్యదేశాలతోపాటు సభ్యేతర దేశాలను కూడా జీ-7 సమావేశ ఔట్‌రీచ్ సెషన్స్‌కు ఆహ్వానించారు. ఆహ్వానం అందుకున్న సభ్యేతర దేశాల్లో భారత్‌తోపాటు అల్జీరియా, అర్జెంటీనా, బ్రెజిల్, జోర్డాన్, కెన్యా, మౌరిటేనియా, టునేషియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ ఉన్నాయి. ఈ దేశాలతోపాటు ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు, ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్, ఐక్యరాజ్యసమితి అధిపతులు కూడా ఉన్నారు.

సమావేశ థీమ్, ఎజెండా

ఈ ఏడాది జీ-7 సమావేశపు థీమ్‌ను 'రూల్ బేస్డ్ ఇంటర్నేషనల్ సిస్టమ్'గా, సమావేశానికి ప్రత్యేక ఆహ్వానిత దేశాధ్యక్షుడైన టర్కీ అధ్యక్షుడు 'రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్' నిర్ణయించారు. ఆతిథ్యదేశంగా ఇటలీ ఈ సమావేశ ఎజెండాను రూపొందించింది. ఎజెండాలో 'ఉక్రెయిన్, గాజాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు', 'ఆఫ్రికా, మధ్యధరా ప్రాంత పరిస్థితులు', 'వలసలు', 'ఆర్థిక భద్రత', 'కృత్రిమమేథ' విషయంలో అంతర్జాతీయ సహకారంవంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

సమ్మిట్ ముఖ్య నిర్ణయాలు

- జీ-7 సభ్య దేశాలు దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ సమావేశం నేపథ్యంలో ఉక్రెయిన్‌తో అమెరికా పదేళ్ల సమయానికి గానూ ఒక భద్రతా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సంపత్తిని అందించనుంది. ఇదేతరహా భద్రతా ఒప్పందం జపాన్ కూడా ఉక్రెయిన్‌తో కుదుర్చుకోవడం ఈ సదస్సు నేపథ్యంగానే జరిగింది.
- అమెరికా, యూరప్‌ల్లో స్తంభింపజేసిన రష్యా ఆస్తులను హామీగా పెట్టుకుని ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల రుణాన్ని జీ-7 దేశాలు అందించాయి. ఇక ముందు కూడా దఫాలవారీగా ఇలాంటి రుణాలను ఉక్రెయిన్‌కు అందించేందుకు జీ-7 సభ్యదేశాలు నిర్ణయించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నందుకు గానూ రష్యా నష్టపరిహారం చెల్లించేంత వరకు ఇది కొనసాగించాలని నిర్ణయించాయి.

ముఖ్యాంశాలు తీర్మానాలు

- ఆహార భద్రతకు, పోషకాహారానికి గల వ్యవస్థాగత అడ్డంకులను అధిగమించేందుకు కృషిచేయడానికి 'అపూలియా ఫుడ్ సిస్టమ్స్ ఇనీషియేటివ్'ను ప్రకటించారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థికంగా సహకరించేందుకు జీ-7 దేశాలు ఆరంభించిన 'పార్టనర్‌షిప్ ఫర్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్' ద్వారా 2027 నాటికి 600 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించడానికి నిర్ణయించారు.
- కృత్రిమమేథ రంగంలో పరిశోధనలు చేస్తూ అడ్వాన్స్‌డ్ ఏఐ సిస్టమ్స్‌ను రూపొందిస్తున్న సంస్థలను కట్టడి చేసేందుకు అంతర్జాతీయ కోడ్ ఆఫ్ కండక్ట్(ప్రవర్తనా నియమావళిని) రూపొందించడానికి అంగీకరించారు. కృత్రిమమేథ సృష్టించే సమస్యలను ఎదుర్కొంటూ, అది అందించే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.
- అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా అవలంబిస్తున్న దమననీతిని అడ్డుకుని మార్కెట్ ఒడుదొడుకులు, వక్రీకరణల నుంచి పరిశ్రమలను, కార్మికులను, పెట్టుబడులను, ఆర్థికభద్రతను పరిరక్షించుకునేందును జీ-7 దేశాలు చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు.
- వలసలు సంధించే సమస్యలు, అందించే అవకాశాల పరంగా వలస విధానాలపై ఒక సంయుక్త విధాన రూపకల్పనకు 'లాస్‌ఏంజెల్స్ డిక్లరేషన్ ఆన్ మైగ్రేషన్ అండ్ ప్రొటెక్షన్' మార్గనిర్దేశంలో కృషిచేయాలని పిలుపునిచ్చారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోభివృద్ధి సాధించేందుకు అభివృద్ధి చెందిన దేశాల భాగస్వామ్యం, సహకారం పెంపునకు పిలుపునిచ్చాయి. అదేవిధంగా పరిశుద్ధ ఇంధన వనరుల వినియోగం దిశగా తరలడం ద్వారా వాతావరణ మార్పులను, కాలుష్యాన్ని, జీవవైవిధ్య నష్టాన్ని ఎదుర్కొనేందుకు పిలుపునిచ్చాయి.
- లైంగిక ఆరోగ్యం, పునరుత్పాదక అంశాలు, లింగ అసమానతలకు సంబంధించి సమాన హక్కులు ఉండేలా చర్యల కోసమై పిలుపునిచ్చాయి.
- అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించేందుకు గాజాలో కాల్పుల విరమణను ఆశించడంతోపాటు 'తగిన సమయంలో' పాలస్తీనాను దేశంగా గుర్తించడంతో సహా రెండు దేశాల పరిష్కారానికి జీ-7 కట్టుబడిందని మరోసారి నొక్కిచెప్పారు.



ఆహ్వానిత దేశంగా భారత్

జీ-7 లేదా గ్రూప్ ఆఫ్ సెవెన్.. అనేది ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాల కూటమి. తొలుత ఆర్థిక, రాజకీయపరమైన అంశాల్లో పరస్పర సహకారానికి ప్రపంచ ధనిక దేశాకీ కూటమిని ఏర్పాటు చేసుకున్నా, కాలక్రమంలో ఈ కూటమి తన లక్ష్యాల పరిధిని పెంచుకుంటూ వస్తోంది. సభ్యదేశాలతోపాటు అవసరార్థం సభ్యేతర దేశాలతో కూడా జట్టుకడుతూ తమ వార్షిక సమావేశాలకు ఆహ్వానించి పరస్పర ప్రయోజన చర్చలకు వేదికవుతోంది. ఈ కోవలో 2003లో మొదలు ఇప్పటివరకూ భారత్ పదకొండుసార్లు ఈ సమావేశాల్లో ఆహ్వానిత దేశంగా పాల్గొంది. 2019 నుంచి వరుసగా ఆహ్వానాన్ని అందుకుంటూనే ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా ఉభయతారక ప్రయోజనాల కోసం భారత్ ఈ సమావేశాలకు హాజరవుతూ అభివృద్ధి చెందిన దేశాలైన జీ-7 దేశాల సమావేశ వేదికపై తన వాణిని వినిపిస్తూ ఉంది.

తాజాగా జీ-7, 50వ సమావేశం ఇటలీలోని అపూలియా రీజన్‌లో జూన్ 13 నుంచి 15 వరకూ జరిగిన నేపథ్యంలో అతిథ్య దేశంగా భారత్ 11వ సారి పాల్గొన్న సందర్భంగా జీ-7 పుట్టుపూర్వోత్తరాలు, అతిథ్య దేశంగా భారత్ పాత్ర, ప్రస్తుత సమావేశ ప్రధాన లక్ష్యాలు, చేసిన తీర్మానాలపరంగా ఒక విహంగవీక్షణం చేయాల్సిన అవసరం ఉంది.

జీ-7 ఆవిర్భావం-గమనం

1973 ప్రాంతంలో చమురు ఉత్పత్తి దేశాలు చమురు ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగా తగ్గించి, చమురు ధరలు పెరిగేలా చమురు సంక్షోభం(ఫస్ట్ ఆయిల్ క్రైసిస్) సృష్టించాయి. ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలైన ఆరు దేశాలు(అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, వెస్ట్ జర్మనీ, జపాన్) ఒక కూటమిగా(జీ-6)గా 1975లో ఏర్పడ్డాయి. అనంతరం 1976లో కెనడా కూడా ఈ కూటమిలో చేరడంతో జీ-7గా రూపాంతరీకరణ జరిగింది. 1998లో రష్యా కూడా ఈ కూటమిలో చేరడంతో ఇది జీ-8గా రూపొందింది. కానీ, 2014లో రష్యా, క్రిమియాను ఆక్రమించడంతో రష్యా జీ-8 సభ్యత్వాన్ని రద్దుచేశారు. దాంతో జీ-8గా తాత్కాలికంగా మారిన ఈ కూటమి తిరిగి జీ-7గా స్థిరపడింది.

జీ-7 విధివిధానాలు, భాగస్వాములు, సమావేశాలు

ఈ జీ-7 కూటమి కేవలం ఒక స్వేచ్ఛాయుత, పరస్పర అంగీకార కూటమి. ఏ ఒప్పందం ద్వారానూ/చార్టర్ ద్వారానూ ఇది ఏర్పడలేదు. అదేవిధంగా సభ్యదేశాలను నియంత్రించే ఎలాంటి చట్టపర కట్టుబాట్లు, వ్యవస్థలు దీనికి లేవు. ఒక ప్రధాన కార్యాలయమంటూ ఏదీలేదు.

అయితే ప్రతి సంవత్సరం జీ-7 సమావేశాలు నిరవధికంగా జరుగుతాయి. దఫాలవారీగా ఒక్కొక్క సభ్యదేశం ఈ సమావేశాన్ని నిర్వహించే బాధ్యత ఒక్కో ఏడాది తీసుకుంటుంది. ఆ ఏడాది సమావేశ ఎజెండా కూడా ఆ ఆతిథ్య దేశమే నిర్ణయిస్తుంది. అదేవిధంగా సంవత్సరం పొడవునా వివిధ రాజకీయ, ఆర్థికపరమైన అవసరాలకు అనుగుణంగా మంత్రులు, అధికారుల స్థాయి సమావేశాలు కూడా జరుగుతూ ఉమ్మడి తీర్మానాలు ప్రకటిస్తుంటాయి.

ఈ జీ-7 సమావేశాల్లో ఏడు సభ్యదేశాలతోపాటు యురోపియన్ యూనియన్, వరల్డ్‌బ్యాంక్(ప్రపంచ బ్యాంక్), అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్), ఐక్యరాజ్య సమితి కూడా పాల్గొంటాయి.

2003 నుంచి జీ-7 సమావేశాలకు సభ్యేతర దేశాలు కూడా ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల నుంచి ఈ దేశాలను ఆహ్వానించి వివిధ సామాజిక, పర్యావరణ, వ్యాపార అంశాలపరంగా అంతర్జాతీయ సహకారాన్ని ప్రోదిచేయడానికి ఔట్‌రీచ్ సెషన్స్ నిర్వహిస్తారు.

జీ-7 సమావేశాలకు సంబంధించిన చర్చనీయాంశాల రూపకల్పనలో, సమావేశానంతర సమీక్షల నిర్వహణల్లో 'షెర్పా'లని పిలిచే పలు దేశాల అధికార గణం(రాయబారులు మొదలైనవారు) కీలకపాత్ర వహిస్తుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

● ఇండియన్ హిస్టరీ

గుప్తుల స్వర్ణయుగం

గుప్త చక్రవర్తులు గొప్ప పరాక్రమవంతులు. వీరు అనేక విజయాల ద్వారా భారతదేశాన్ని ఏకం చేసి రాజకీయ ఐక్యతను సాధించారు. సుమారు 150 సంవత్సరాల పాటు వైభవోపేతంగా పాలించారు. విదేశీయుల పాలనను అంతం చేసి ప్రజలకు రక్షణ ఇచ్చారు. భారతదేశ సంస్కృతిని నలుదిశలా వ్యాపింపజేశారు.


ఉదార పాలన

గుప్తులు విశాల సామ్రాజ్యంలో సుభిక్షమైన పాలనను అందించారు. వీరి కాలంలో ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఉండేవి. ప్రభుత్వ ఉద్యోగులు సొంత నిర్ణయాలు తీసుకునేవారు. ప్రజలపై పన్నుల భారం తక్కువ. ప్రజలు సుఖశాంతులు అనుభవించారు. మరోవైపు గుప్తుల కాలంలో కఠిన శిక్షలు ఉండేవని 'ఫాహియాన్' పేర్కొన్నారు.

ఉత్తరాపథంలో గుప్తులు అధికారంలో ఉంటే...మధ్య భారతంలో వాకాటకులు; ఆంధ్రదేశంలో శాలంకాయనులు, విష్ణుకుండినులు; కర్ణాటకంలో కాదంబులు; తమిళంలో పల్లవులు పాలించారు. అనేక సాంస్కృతిక విషయాల్లో వీరి మధ్య పోలికలు ఉన్నప్పటికీ పాలన విధానం మాత్రం ఒక్కటే.

గుప్తుల కాలాన్ని స్వర్ణయుగంగా చిత్రించే నేపథ్యంలో జాతీయవాదులైన చరిత్రకారులు ఆర్.సి.మజుందార్, బిపిన్ చంద్రపాల్ వంటి వారు తమ రచనల్లో నాడు గుప్తులు సాధించిన రాజకీయ ఏకీకరణ, సుస్థిరత, ఐశ్వర్యవంతమైన ఆర్థిక వ్యవస్థ, కళలు, వైజ్ఞానిక రంగంలో సాధించిన అద్వితీయమైన ప్రగతిని వివరించారు.

మౌర్య వంశం పతనం అనంతరం భారతదేశంలో మొదలైన రాజకీయ అస్థిరత, చీకటి రోజులు గుప్తుల రాకతో అంతమయ్యాయి. సముద్రగుప్తుని దండయాత్రలు, రెండో చంద్రగుప్తుని పాలనతో సువిశాల సామ్రాజ్యానికి పునాదులు పడ్డాయి. వికేంద్రీకరణమైన పాలన వ్యవస్థను కొనసాగించారు. తద్వార పలు ప్రాంతీయ వ్యవస్థలను గుప్తులు కాపాడగలిగారు.



సామాజిక పరంగా అన్ని రంగాల్లో సాధించిన గణనీయమైన అభివృద్ధి ముఖ్యంగా... మతపరంగా చూస్తే ఆదరణ లేని సంక్షోభంలో ఉన్న వేద మతం గుప్తుల కాలంలో తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. గుప్తులు వైష్ణవాన్ని ఆదరించినప్పటికీ వీరి కాలంలో శైవమతం కూడా అభివృద్ధి చెందింది. భారత సంస్కృతి తొలిసారిగా ఆగ్నేయాసియా దేశాలకు విస్తరించింది.

సామాజిక రంగాల్లోని ఇతర అంశాలైన సాహిత్యం, వాస్తు శైలి, లలిత కళలు కూడా గుప్తుల కాలంలో ప్రగతిని సాధించాయి. సాహిత్యపరంగా చూస్తే..కావ్యం, నాటకాలు, లఘు కథానికలు, వ్యాఖ్యానాలు, వ్యాకరణ గ్రంథాలు, నిఘంటువులు రచించారు. కాళిదాసు రచనల్లో కావ్యం పరిపూర్ణ స్థాయికి చేరింది. శూద్రకుడు, విశాఖదత్తుడు, భానుడు వంటి వారు నాటకాలను ఒక ఉన్నత స్థితికి తీసుకొచ్చారు. విష్ణుశర్మ 'పంచతంత్రం' ద్వారా చిన్న చిన్న కథలను రాసే సంప్రదాయాన్ని ప్రారంభించాడు. సంస్కృతంలో తొలి నిఘంటువు 'అమరకోశము'ను అమరసింహుడు రాశాడు. చంద్ర వ్యాకరణానికి మూల కర్త చంద్రగోమిన్ ఈ కాలానికి చెందినవాడే.

గణిత, జ్యోతిష, ఖగోళ, వైద్య శాస్త్రాలలో కూడా గుప్తులు అద్భుత ప్రగతిని సాధించారు. గణితంలో '0' వాడకం, దశాంశ పద్ధతి, రేఖాగణితం గుప్తుల కాలంలోనే ఆచరణలోకి వచ్చాయి. ఆర్యభట్టు గణిత, ఖగోళ శాస్త్రాల్లో గొప్ప మేధావి. ఇంతటి ప్రగతి నాటి సమకాలీన ప్రపంచంలో ఎక్కడా కన్పించదు. ఆయుర్వేదంలో నిష్ణాతులైన శుశ్రుతుడు, ధన్వంతరి, పాలకశ్యపుడు, వాగ్భటుడు, నవనీతకుడు ఈకాలానికి చెందిన వారే.

ఉత్తర భారతదేశంలో దేవాలయాలు నిర్మించే సంప్రదాయాన్ని గుప్తులు తొలిసారిగా ప్రవేశపెట్టారు. 'నగర' వాస్తు శైలి ఈ కాలంలోనే అభివృద్ధి చెందింది. ఈ శైలి మాండెసోర్, విదిశ, ధారానగర్ వంటి పట్టణాల్లో దేవాలయాల నిర్మాణానికి దారితీసింది. శిల్ప శాస్త్రాలలో కూడా గుప్తులు గొప్ప కళాకారులను పోషించారని చెప్పవచ్చు. వీరి నిర్మాణాల్లో కనిపించే 'రాచదరహం' ఇందుకు ప్రధాన నిదర్శనం. చిత్రలేఖనం కూడా ఉన్నత దశకు చేరుకుంది. 'అజంత', 'ఎల్లోరా' గుహల్లో కుడ్య చిత్రాలు; బాగ్ గుహలలోని చిత్రాలు గుప్తుల కాలానికి చెందినవే.

అజంతా గుహలు మొత్తం 29 ఉన్నాయి. ఒక దానిని పూర్తిగా మూసివేశారు. దీనిలో బౌద్ధ స్మారక చిహ్నాలు ఉన్నాయి. ఈ గుహల్లో చిత్రకళను అద్భుతంగా చిత్రించారు. ఈ గుహలను 'యునెస్కో' ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఈ గుహలను తొలిసారిగా 1819లో బ్రిటిష్ అధికారి కెప్టెన్ జాన్‌స్మిత్ పులులను వేటాడుతూ "U(యూ) ఆకారపు కొండగట్టుకు చెందిన రాతి లోయను గుర్తించాడు. ఈ గుహలను మొదట శాతవాహనులు, తర్వాత గుప్తులు, ఆ తర్వాత వాకాటకులు అభివృద్ధి చేశారు.

అజంతా చిత్రాలను 1848లో రాయల్ ఏషియాటిక్ సొసైటీ బాంబే ప్రెసిడెన్సీలోని జాన్ విల్సన్ అధ్యక్షుడిగా రికార్డు చేయడానికి పూనుకున్నాడు. హైదరాబాద్ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కూడా ఇటలీ దేశం నుంచి కౌంట్ ఓర్సిని, ప్రొఫెసర్ లోరెంజో సెక్కోనిని పిలిపించి అజంతా చిత్రాలకు మరమ్మతులు, కుడ్యచిత్రాలను శుభ్రపర్చడం కోసం నియమించాడు.

ఆర్థిక రంగంలో కూడా గుప్తులు స్వయం సమృద్ధిని సాధించారు. వ్యాపార, వాణిజ్య రంగాలను అత్యున్నత దశకు తీసుకెళ్లారు. ఆగ్నేయాసియా దేశాలతో, రోమ్ దేశంతో వర్తకం సాగించారు. ముఖ్యంగా ఖనిజ, లోహ పరిజ్ఞానం గుప్తుల కాలంలో అత్యున్నత దశకు చేరింది.

అదేవిధంగా సుల్తాన్‌గంజ్ వద్ద కనుగొన్న నిలువెత్తు బుద్ధుని విగ్రహంలో అత్యంత విశిష్టమైన రాగి కన్పిస్తుంది. గుప్తుల కాలంలో నాణ్యమైన ఇనుము, రాగి ఖనిజాలు ప్రసిద్ధి చెందాయి. అత్యంత మేలురకమైన 'శతక' అనే వస్త్రం మధుర పట్టణంలో తయారైంది. వారణాసి పట్టు పరిశ్రమకు, గాంధారం ఉన్ని వస్త్రాలకు, మాండెసోక నూలు వస్త్రాలకు, పాటలీపుత్రం హస్తకళలకు పేరు పొందాయి. ఇంత వైవిధ్యం గల ఆర్థిక ప్రగతి ప్రాచీన భారతదేశ చరిత్రలో మరెప్పుడూ కనిపించదు.



టీజీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

నిజంగా స్వర్ణయుగమేనా?

పలు రంగాల్లో సాధించిన ప్రగతిని బట్టి గుప్తుల కాలం ఒక స్వర్ణయుగం అని చెప్పడానికి ఆధారమైంది. కానీ, వాస్తవ దృక్పథంతో ఈ ప్రగతికున్న మరొక కోణాన్ని పరిశీలిస్తే స్వర్ణయుగం అని చెప్పడానికి సంశయం ఏర్పడుతుంది.

భూస్వామ్య వ్యవస్థ ఏర్పాటు: రాజకీయ రంగంలో సాధించిన సుస్థిరత, ఏకీకరణ వంటి అంశాలతోపాటు గుప్తులు, హూణుల భారి నుంచి భారతదేశాన్ని రక్షించడంలో దారుణంగా విఫలమయ్యారు. గుప్తుల కాలంలో అభివృద్ధి చెందిన సామంత విధానం తదుపరి కాలంలో 'భూస్వామ్య వ్యవస్థకు' దారి తీసింది. పరిపాలనలో ఒక వర్గం ఆధిపత్యానికి, దోపిడీకి సామంత విధానమే కారణమైంది.

అంటరానితనం ప్రారంభం: గుప్తుల కాలంలో సమాజంలో ఏర్పడిన మరొక వర్ణవివక్ష 'పంచమ వర్ణం'. వీరి కాలంలో ఎక్కువగా అంటరానితనాన్ని పాటించినట్లు 'ఫాహియాన్' రచనల ద్వారా తెలుస్తోంది. వ్యభిచారం కూడా అభివృద్ధి చెందింది. శూద్రకుని 'మృచ్ఛకటికం'లో చారుదత్త, వసంతసేనల ప్రణయ వృత్తాంతం ద్వారా వ్యభిచారం ఎంత అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు.

సాహిత్యం, లలితకళలు, శిల్పం, వాస్తు శైలిలో గుప్తుల కాలంలో సాధించిన ప్రగతికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయి. వాస్తవానికి గుప్తుల ముందు కాలం నుంచే ఈ ప్రగతి ప్రారంభమైంది. గుప్తుల కాలం నాటికి పరిపక్వత దశకు చేరుకుంది. ఈ దశకు చెందిన ప్రగతి మొత్తానికి గుప్తులే కారకులుగా చెప్పడం సమంజసం కాదు.

ఆర్థిక వ్యవస్థలో కేవలం సంపన్న వర్గాలకే పరిమితమైన ఈ ప్రగతి ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ ప్రగతికి నిదర్శనం కాదు. కాళిదాసు 'మేఘసందేశం'లో ఉజ్జయిని ప్రాంతానికి చెందిన వ్యాపారుల గురించి ఉంది. ఆర్థిక వ్యవస్థ సమతౌల్యమైన అభివృద్ధి సాధించలేదు అని చెప్పడానికి మరొక నిదర్శనం స్కందగుప్తుని కాలంలోని నాసిరకమైన నాణేల ముద్రణ. దీన్ని బట్టి గుప్తుల ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రముఖ వ్యాపార కేంద్రాలు ఎంత అభివృద్ధి చెందాయో, అంత పతనమై చరిత్రలో తిరిగి కనిపించకుండా పోయాయి. ఉదాహరణకు మధుర, గాంధారము.

ప్రతి స్వర్ణయుగం సమాజంలో ఉన్నత వర్గాలకు అనుకూలించే యుగంగానే కన్పిస్తుంది కాని, అన్ని వర్గాల అభ్యున్నతి ప్రతిబింబించదు. కాబట్టి స్వర్ణయుగం దేశ చరిత్రలో ఒక భ్రమ గానే మిగిలిపోతుంది.

మొత్తానికి భారతదేశ చరిత్రలో గుప్తుల సామ్రాజ్యం ఒక మైలు రాయి వంటిది. సాహిత్యంలో 'నవరత్నాలు' గల గొప్ప కవులు, విదేశీ యాత్రికుడు ఫాహియాన్ సందర్శించడం, నలంద విశ్వవిద్యాలయ నిర్మాతలు; నాటి సామాజిక దురాచారం 'సతీ సహగమనం' గురించిన 'ఎరాన్' శాసనం వంటివి చెప్పుకోదగిన అంశాలు. కట్టడాల్లో భూమ్రా శైవాలయం, నాచ్‌కుటారాలోని పార్వతీ ఆలయం 'నగారా' శైలికి గొప్ప ఉదాహరణలు. సముద్రగుప్తుడి వీణ వాయిద్య నాణేలు, అశ్వమేధయాగి పేరుతో ముద్రించిన నాణేలు ప్రముఖమైనవిగా చెప్పుకోవచ్చు. అజంతా కట్టడాల్లోని శిల్పకళలు, చిత్రకళలు ప్రపంచ వారసత్వ హోదాను పొందడం గుప్తులు అందించిన 'వారసత్వ సంపద'గా గర్వంగా చెప్పుకోవచ్చు.



డాక్టర్ ఐ. నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట్.

ఆశలన్నీ తాటిచర్ల-2 పైనే

- వేలంతో సింగరేణికి దక్కని బొగ్గు నిక్షేపాలు
- 2017లో ఏఆర్ఎం కంపెనీకి తాటిచర్ల-1
- తాటిచర్ల-2లో 180 మి.టన్నుల బొగ్గు
- సింగరేణికే కేటాయించాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

వరంగల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బొగ్గు గనుల వేలం సింగరేణి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. వరుసగా తెలంగాణలోని బొగ్గు గనులను కేంద్రం వేలం వేస్తుండటంతో.. తవ్వేందుకు సింగరేణికి గనులు కరువయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సింగరేణి ఆశలన్నీ భూపాలపల్లి జిల్లా తాటిచర్ల-2 గనిపైనే ఉన్నాయి. 2017లో తాటిచర్ల-1 ఓసీపీని జెన్‌కో ద్వారా ఏఎంఆర్ ప్రైవేటు కంపెనీకి గత బీఆర్ఎస్ సర్కారు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆ కంపెనీ తాటిచర్ల-1 నుంచి కేటీపీపీకి 30 ఏళ్లపాటు బొగ్గును సరఫరా చేయనుంది. అక్కడ ప్రైవేటు కంపెనీ బొగ్గు ఉత్పత్తి భారీగా చేస్తుండటంతో.. కేంద్రం తెలంగాణలోని ఇతర బొగ్గుబ్లాకులపై కన్నేసిందనే చర్చ జరుగుతోంది. 2015 దాకా ప్రభుత్వం తెలంగాణలో ఉన్న గనులన్నింటినీ సింగరేణికే కేటాయిస్తూ వచ్చింది. అయితే.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 2015లో బొగ్గు గనుల వేలానికి కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. తెలంగాణలోని సత్తుపల్లి బ్లాక్-3, కోయగూడెం బ్లాక్-3, కళ్యాణఖని బ్లాక్-6, శ్రావణపల్లి గనుల్లో బొగ్గు నిక్షేపాలను గుర్తించేందుకు సింగరేణి కంపెనీ రూ.66 కోట్ల దాకా ఖర్చు చేసినా.. కేంద్రం ఈ బ్లాకులను సింగరేణికి కేటాయించకుండా వేలంలో పెట్టింది. దీంతో సింగరేణివ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు హోరెత్తాయి. అయినప్పటికీ కేంద్రం వెనక్కి తగ్గకుండా వేలం నిర్వహించింది. తొలి రెండు టెండర్లలో పాల్గొనేందుకు కంపెనీలు ముందు కు రాలేదు. మూడోసారి మాత్రం కోయగూడెం బ్లాక్-3, సత్తుపల్లి బ్లాకు-3లను ప్రైవేటు కంపెనీలు సింగిల్ బిడ్డర్లుగా దక్కించుకున్నాయి. అలాగే గత శుక్రవారం వేలం వేసిన 60 గనుల్లో తెలంగాణకు చెందిన శ్రావణపల్లి గని కూడా ఉంది. అందులో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. ఈ గని కూడా ఏదో ఒక ప్రైవేటు కంపెనీకి వెళ్లే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కోయగూడెం బ్లాక్-3, సత్తుపల్లి బ్లాక్-3లలో సుమారు 20కోట్ల టన్నులకు పైగా బొగ్గు ఉన్నట్లుగా గుర్తించారుగానీ.. ఇప్పటి వరకూ ఆ రెండు గనుల్లో కంపెనీలు బొగ్గు ఉత్పత్తి చేయట్లేదు. దీంతో ఈ రెండు గనులను సింగరేణికి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోవటం లేదు. కనీసం శ్రావణపల్లి గనినైనా తమకే నేరుగా కేటాయించాలని పట్టుబట్టినా నిబంధనల పేరుతో వేలంలో పెట్టింది. ఈ మూడు గనులూ వేలంలో చేజారిపోవడంతో రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత ఏర్పడే అవకాశాలు లేకపోలేదనే చర్చ జరుగుతోంది.

తీవ్ర ప్రయత్నాలు..

తాటిచర్ల-2 గనిలో 180 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లుగా గుర్తించారు. సుమారు 30ఏళ్ల కాలపరిమితితో ఇక్కడి నుంచి బొగ్గు ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ బ్లాకు చేజారిపోకుండా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రంలో తాజాగా కొలువుదీరిన కొత్త సర్కారులో.. బొగ్గు, గనుల శాఖ మంత్రిగా తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తుండటం కొంతమేర ఊరటగా భావిస్తున్నారు. అయితే వేలం జోష్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వం తాటిచర్ల-2ను కూడా వేలం వేస్తే మాత్రం సింగరేణి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడనుంది.



చిరంజీవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంజయ్

చిరంజీవితో బండి సంజయ్ భేటీ

- మీకు తగిన పదవి లభించిందన్న చిరు

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం నటుడు చిరంజీవిని కలిశారు. ఢిల్లీ బయలుదేరే ముందు సంజయ్.. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి నివాసానికి వెళ్లారు. ఆయనను చిరంజీవి సాదరంగా ఆహ్వానించారు. శాలువాతో సత్కరించి.. ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. "మీరు ఎంతో కష్టపడి పైకొచ్చారు. మీరు కేంద్ర మంత్రి కావడం చాలా ఆనందంగా ఉంది. మీ కృషికి తగిన పదవి లభించింది" అని సంజయ్‌ను ఉద్దేశించి చిరంజీవి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రధాని మోదీ తమను దగ్గరకు తీసుకుని పలకరించడం మర్చిపోలేని అనుభూతి మిగిల్చిందని చిరంజీవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ స్పందిస్తూ.. 'నేను విద్యార్థి దశలో మీ సినిమాలకు అభిమానిని" అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మంచి ఫలితాలను ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రజలకు మంచి పాలన అందిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వారిద్దరు జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

సింగరేణి మనుగడ ఎలా?

(మొదటిపేజీ తరువాయి)



మైన్స్ అండ్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2016 ప్రకారం వేలం పాటలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా, 2020 నుంచి బొగ్గు గనుల వేలం దేశంలో ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పటికే తొమ్మిది సార్లు వేలం నిర్వహించగా 10వ విడత వేలం హైదరాబాద్‌లోనే జరిగింది. ఇందులో.. బొగ్గు నిల్వలు ఉన్నట్లు సింగరేణి స్వయంగా అన్వేషించిన బ్లాకులు, అందులోనూ ఆ సంస్థ ఇప్పటికే మైనింగ్ చేస్తున్న బ్లాకుల ముందు, వెనుక ఉన్న బ్లాకులను కూడా ఇతర సంస్థలు ఎగరేసుకుపోయాయి. సింగరేణి మాత్రం ప్రభుత్వ అనుమతి లేక వేలంలో పాల్గొనలేని పరిస్థితిలో ఉంది. అయితే ఎంఎండీఆర్ యాక్ట్-2016లోని సెక్షన్ 17(2)ఏ ప్రకారం దక్కిన ప్రత్యేక అధికారాలతో బొగ్గు బ్లాకులను రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థకు కేటాయించే విచక్షణ కేంద్రానికి ఉంది. ఈ చట్టం ప్రకారంబొగ్గు బ్లాకులను సింగరేణికి రిజర్వ్ చేయవచ్చు. ప్రస్తుతం కేంద్రాన్ని తెలంగాణ ఇదే కోరుతోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతోపాటు విపక్షాలు కూడా కేంద్రానికి ఉన్న విచక్షణతో సింగరేణికి బ్లాకులు కేటాయించాలని తాజాగా నివేదించారు. అయితే ఈ విజ్ఞప్తిని పరిశీలిస్తామని కేంద్రం చెప్పినప్పటికీ.. ఎక్కడా విచక్షణతో బ్లాకులు కేటాయిస్తామనే హామీ మాత్రం ఇవ్వలేదు.

12కు చేరనున్న సింగరేణి గనులు!

సింగరేణి సంస్థ ప్రస్తుతం 39 బొగ్గు గనుల్లో మైనింగ్ చేస్తోంది. వీటిలో రానున్న ఐదేళ్లలో 8 భూగర్భ గనులు, మూడు ఓపెన్‌కాస్టులు మూతపడనున్నాయి. ఆ తర్వాత మరో ఐదేళ్లలో అంటే 2032 నాటికి మరో 5 భూగర్భ గనులు, 6 ఓపెన్ కాస్టులు కలిపి... 11 గనులు బంద్ కానున్నాయి. 2037-38 నాటికి ఇంకో 5 గనులు మూతపడనుండగా... 12 గనులకు సింగరేణి కుదించుకుపోనుంది. 2014 నాటికి సింగరేణిలో కార్మికుల సంఖ్య 60 వేలకు పైగా ఉండగా... ప్రస్తుతం 40 వేలకు తగ్గింది. రానున్న 15 ఏళ్లలో గనుల సంఖ్య 12కు తగ్గి.. కార్మికుల సంఖ్య 8వేల మందికి తగ్గిపోయే ప్రమాదం ఏర్పడనుంది. కాగా, గడచిన పదేళ్లలో సింగరేణి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.49,666 కోట్లను పన్నుల రూపంలో చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వానికి 9 రకాల ట్యాక్సులు, రాయల్టీల రూపంలో రూ.23,446 కోట్లను చెల్లించగా, కేంద్ర ప్రభుత్వానికి 21 రకాల పన్నుల ద్వారా రూ.26,207 కోట్లు చెల్లించింది. అంతేకాదు.. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో వివిధ గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన, సీవరేజీ, తాగునీటి సౌకర్యం, పాఠశాల భవనాల నిర్మాణం వంటి వాటికి జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్(డీఎంఎఫ్‌టీ) కింద రూ.3 వేల కోట్లను, సామాజిక బాధ్యత కార్యక్రమాల అమలు(సీఎస్ఆర్) కింద భారీగా నిధులు వెచ్చించింది. ఇలాంటి సంస్థ కోసం కేంద్ర ప్రభుత్వం ఉదారంగా గనులు కేటాయించాల్సిన బాధ్యత ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ తీర్పులో ప్రభుత్వ రంగానికి రక్షణ

బొగ్గు గనుల విషయంలో ప్రభుత్వ రంగ సంస్థలకు సుప్రీంకోర్టు గతంలోనే తమ తీర్పు ద్వారా రక్షణ కల్పించింది. 2014 ఆగస్టు 25వ తేదీన బొగ్గు బావులపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎం లోధా, న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌ల నేతృత్వంలోని ధర్మాసనం చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఆ తీర్పు సందర్భంగా 1993 నుంచి 2010 మధ్యలో కేటాయించిన 214 కోల్‌బ్లాకుల లీజును సుప్రీంకోర్టు రద్దు చేస్తూ.. ప్రభుత్వరంగ సంస్థలు సెయిల్, ఎన్‌టీపీసీకి ఇచ్చిన లీజులకు రక్షణ కల్పించింది. అయితే సింగరేణి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ కావడంతో దీనికి కేటాయింపులు ఏ విధంగానూ చట్టవిరుద్ధం కావని పలువురు గుర్తు చేస్తున్నారు.

వేలంతోనే మేలు!

వేలం పాటతోనే సింగరేణికి మేలు జరుగుతుందని అధికార వర్గాలు అంటున్నాయి. నామినేషన్ పద్ధతిలో పొందిన బ్లాకుల్లో బొగ్గు ఉత్పత్తి చేస్తే 14% దాకా రాయల్టీని రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే అదే వేలం పాటలో అయితే 2022 నుంచి ఉన్న నిబంధన ప్రకారం కనిష్ఠంగా 4% నుంచి పాట మొదలవుతుంది. ఈ మేరకు కోయగూడం బ్లాకును 5% రాయల్టీ, సత్తుపల్లి బ్లాకును 7.5% రాయల్టీ చెల్లించడానికి అంగీకరిస్తూ ప్రైవేట్ సంస్థలు దక్కించుకున్నాయి. ఏ లెక్కన చూసుకున్నా వేలం పాటలో సింగరేణి పాల్గొంటే ఏ గని అయినా 10 శాతం లోపే దక్కేదని అధికారులు గుర్తు చేస్తున్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులు.. సింగరేణి ఇప్పటికే తవ్వకాలు జరుపుతున్న బ్లాకుల మధ్య ఉండటం వల్ల ఆయా బ్లాకుల్లో ఉత్పత్తి ద్వారా ఏటా 5 మిలియన్ టన్నుల బొగ్గును తక్కువ ధరకే ఉత్పత్తి చేసే అవకాశాన్ని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సింగరేణికి స్వేచ్ఛ ఇస్తే.. బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొని, కోల్‌బెల్ట్‌లో ఉన్న బ్లాకులను దక్కించుకొని, మనుగడను కాపాడుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.



సచివాలయం ముందు వరదలో వాహనదారుల ఇక్కట్లు

హైదరాబాద్‌లో జోరు వాన

(మొదటి పేజీ తరువాయి)

వ్యవధిలోనే నగరమంతా విస్తరించింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వాన దంచికొట్టింది. దీంతో ప్రధాన రహదారులపై మోకాళ్లలోతు వరద నిలిచి పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాత్రి 8 గంటల వరకు డబీర్‌పురాలో అత్యధికంగా 7.1 సెం.మీ, సర్దార్‌మహల్‌లో 7 సెం.మీ వర్షం కురిసింది. ఆసిఫ్‌నగర్, గౌలిగూడ, బేగంబజార్ ప్రాంతాల్లో 6 సెం.మీ.కు పైగా.. నాంపల్లి, లంగర్‌హౌస్, అజంపురా, దూద్‌బౌలి, విజయనగర్ కాలనీ, అంబర్‌పేటలో 5 సెం.మీ.కు పైగా.. హయత్‌నగర్, నెహ్రూనగర్, ఎన్‌జీవోస్‌కాలనీ, కిషన్‌బాగ్‌లో 4 సెం.మీ.కు పైగా వర్షం కురిసింది. వనస్థలిపురంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వరదనీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మెహిదీపట్నం 11 కేవీ సాయిగార్డెన్ ఫీడర్ పరిధిలో భారీ వృక్షం పడటంతో విద్యుత్ తీగలు తెగిపోయి స్తంభం విరిగిపడింది. ఎర్రగడ్డ స్వర్ణ జయంతి ఫీడర్ పరిధిలో చెట్టు విరిగి కరెంటు తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విపత్తు నిర్వహణ బృందాలు పలు ప్రాంతాల్లో వరద నీటిని తొలగించాయి. కాగా, హైదరాబాద్‌లో మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశముంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పారు. సోమ, మంగళవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు యెల్లో హెచ్చరిక జారీచేశారు.

పలు జిల్లాల్లో మోస్తరు వాన..

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం మోస్తరు వాన కురిసింది. నిర్మల్ జిల్లాలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కడెం ప్రాజెక్టుకు 2,900 క్యూసెక్కుల వరద వస్తోంది. యాదగిరిగుట్టలో సాయంత్రం అరగంట పాటు జోరు వాన పడింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వాన కురిసింది. వాంకిడి మండలంలో 4.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కాగజ్‌నగర్ మండలం అందవెల్లిలో పెద్ద వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో భీమిని, దహెగాం మండలాలకు చెందిన 50 గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల, సంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో మోస్తరు వాన కురిసింది.



హైదరాబాద్‌లో వరద నీటిని తొలగిస్తున్న విపత్తు నిర్వహణ బృందం

మృతుడు.. తిరిగొస్తే?

- రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం
- గుర్తుపట్టలేని విధంగా దెబ్బతిన్న శరీరం
- ఫోన్ ఆధారంగా 'కుటుంబానికి' సమాచారం
- గ్రామంలో అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు
- ఇంతలో.. ఇంటికొచ్చిన అసలు వ్యక్తి
- వికారాబాద్ జిల్లా నవాంద్గీలో ఘటన
- పట్టాలపై లభ్యమైన మృతదేహం ఎవరిదో?



ఇంటికి చేరుకున్న పిట్టల ఎల్లప్ప

బషీరాబాద్/వికారాబాద్, జూన్ 23(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో మృతదేహాలు తారుమారై.. ఒకరికి బదులు మరొకరికి అంత్యక్రియలు చేసిన ఉదంతాలను చదివి ఉంటాం..! ఇది మాత్రం మరో రకం..! సినిమాల్లో చూపించినట్లుగా.. ఎక్కడో జరిగినట్లుగా చెప్పుకొనే తరహా ఘటన..! 'మృతుడు' తమవాడే అనుకుని తీసుకెళ్లి కర్మకాండలు చేస్తుండగా.. అతడు నిక్షేపంగా ఊళ్లో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచాడు. వికారాబాద్ జిల్లా నవాంద్గీ గ్రామానికి చెందిన పిట్టల ఎల్లప్ప (47) బషీరాబాద్‌లో ఓ వ్యక్తి వద్ద పశువుల కాపరిగా పనిచేసేవాడు. మద్యానికి బానిస కావడంతో ఇటీవల అతడిని పనిలో నుంచి తీసేశారు. కాగా, ఎల్లప్ప రెండు రోజుల కిందట భార్యాపిల్లలకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. వికారాబాద్ స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా.. శనివారం రాత్రి 11 గంటల సమయంలో జమ్మూకశ్మీర్ నుంచి తిరుపతి వెళ్లే నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ ఓ గుర్తుతెలియని వ్యక్తి(45)ని ఢీకొట్టింది. అతడి వద్ద ఫోన్ లభించగా కాలింగ్ లిస్టులో ఉన్న నంబర్‌కు రైల్వే పోలీసులు ఫోన్ చేశారు. ఆ ఫోన్ నావంద్గీలోని ఎల్లప్ప కుటుంబానికి వెళ్లింది. దీంతో వారు వికారాబాద్ వచ్చారు. ఎల్లప్ప ఈ మధ్య అతిగా తాగుతూ అక్కడఇక్కడ తిరుగుతున్నాడు. రెండు రోజులుగా ఇంటికి కూడా రావడం లేదు. ఇలాంటి సమయంలో అతడి ఫోన్ నుంచే కాల్ రావడంతో.. కుటుంబసభ్యులు సైతం చనిపోయింది తమవాడేనని భావించారు. మరోవైపు ప్రమాదంలో మృతదేహం గుర్తుపట్టలేనంతగా దెబ్బతినడంతో ఎక్కువగా ఆలోచించలేదు. పోస్టుమార్టం అనంతరం నావంద్గీకి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు.

తాండూరులో తారసపడడంతో..

ఎల్లప్ప నవాంద్గీ గ్రామానికే చెందిన వ్యక్తికి తాండూరులో కనిపించాడు. "నువ్వు బతికే ఉన్నావా? మరి ఊర్లో నీ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు కదా?" అని చెప్పడంతో ఎల్లప్ప అవాక్కయ్యాడు. వెంటనే గ్రామానికి వెళ్లాడు. అతడిని చూసి కుటుంబసభ్యులు, బంధువులు షాక్ అయ్యారు. వెంటనే చనిపోయిన వ్యక్తి తమవాడు కాదంటూ వికారాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు సైతం ఆశ్చర్యపోయి.. మృతదేహాన్ని తీసుకురావాలని సూచించారు. కాగా, ఈ మొత్తం ఉదంతంలో ఎల్లప్ప తన ఫోన్ పోగొట్టుకోవడం పెద్ద మలుపు. రైలు ఢీకొని చనిపోయిన గుర్తుతెలియని వ్యక్తి.. ఎల్లప్ప ఫోన్‌ను చోరీ చేసిన వాడిగా అనుమానిస్తున్నారు. అతడు ఫోన్‌తో వికారాబాద్‌కు రావడం, అనూహ్యంగా ప్రమాదానికి గురికావడంతో పెద్ద డ్రామానే నడిచింది.

అమెరికాలో పేలిన తూటా.. బాపట్ల వాసి బలి

- ఉపాధి కోసం 9 నెలల క్రితమే అమెరికాకు పయనం
- డల్లాస్‌లోని సూపర్‌మార్కెట్‌లో పార్ట్‌టైమ్ జాబ్
- ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో గాయపడి దుర్మరణం
- గోపీకృష్ణ మృతితో బాపట్ల జిల్లా యాజలి గ్రామంలో విషాదం



దాసరి గోపీకృష్ణ (ఫైల్)

కర్లపాలెం, జూన్ 23: అమెరికాలో తుపాకీ తూటాకు తెలుగు యువకుడు బలయ్యాడు. ఇంజనీరింగ్ చదివి విదేశాల్లో మంచి ఉద్యోగం చేసి కుటుంబాన్ని బాగా చూసుకోవాలనే ఆశయంతో అమెరికాకు వెళ్లిన ఆ యువకుడు తన కలను సాకారం చేసుకోకుండానే కన్నుమూశాడు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన నిరుపేద ఇంజనీర్ దాసరి గోపీకృష్ణ (32) టెక్సాస్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో తుదిశ్వాస విడిచాడు. యాజలి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు ధనలక్ష్మి దంపతులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. అయినప్పటికీ తమ కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలనే ఆశయంతో విజ్ఞాన్ లారా కళాశాలలో బీటెక్ చదివించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో మూడేళ్లపాటు ప్రైవేటు ఉద్యోగం చేశాడు. ఈలోగా వీసా రావడంతో.. తమకున్న ఎకరం పొలం అమ్మేసి 9 నెలల క్రితం అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం (అమెరికా కాలమాన ప్రకారం శుక్రవారం రాత్రి 1.30 గంటలకు) గోపీకృష్ణ కౌంటర్‌లో ఉండగా.. ఓ దుండగుడు లోపలికి ప్రవేశించి తుపాకీతో అతనిపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత కౌంటర్‌లోకి దూకి తనకు కావాల్సిన ప్యాకెట్ తీసుకుని వెళ్లిపోయాడు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన గోపీకృష్ణ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున ప్రాణాలు విడిచాడు. అమెరికా నుంచి ప్రతిరోజూ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడే గోపీ నుంచి శనివారం ఫోన్ రాలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేసినా స్పందన లేదు. అయితే కాల్పుల్లో గోపీకృష్ణ మృతి చెందాడని వారికి ఆదివారం ఉదయం సమాచారం అందింది. ఆ వార్త వినగానే తల్లిదండ్రులు తాత నాయనమ్మ, భార్య ప్రవల్లిక శోకసంద్రంలో మునిగిపోయారు. గోపీకృష్ణ దంపతులకు 18 నెలల కుమారుడు రియాంత్ ఉన్నారు. గోపీ మృతి వార్తతో యాజలిలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..

గోపీకృష్ణ మరణవార్త తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా ఆదివారం ఉదయం యాజలిలోని గోపీకృష్ణ గృహానికి చేరుకుని వివరాలు సేకరించి కలెక్టర్‌కు అందించారు. గోపీ మృతదేహం మంగళవారం ఉదయానికి యాజలి స్వగృహానికి చేరే అవకాశం ఉందని తహసీల్దార్ తెలిపారు. కాగా, మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు మృతుని కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.



సూర్యాపేటలో నిర్వహించిన వివేక్ స్మారకోపన్యాసంలో మాట్లాడుతున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్

దేశం దృఢంగా ఉండాలి.. ప్రభుత్వాలు కాదు

- సంతృప్తి ఇచ్చిన 2024 ఎన్నికలు
- 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్

సూర్యాపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): "ప్రజాస్వామ్యంలో దేశం దృఢంగా ఉండాలి కానీ ప్రభుత్వం కాదు, ప్రభుత్వం దృఢంగా ఉంటే ప్రజలు బలహీనంగా ఉంటారు.. ప్రభుత్వం బలహీనంగా ఉంటే ప్రజలు దృఢంగా ఉంటారు.. తమ కోరికలు చెప్పుకోగలుగుతారు.. సాధించుకోగలుగుతారు" అని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన కొదుమగుండ్ల వివేక్ 9వ వర్ధంతిని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్మారకోపన్యాసంలో '2024 ఎన్నికల ఫలితాలు-ఓ అవగాహన' అనే అంశంపై కె.శ్రీనివాస్ మాట్లాడారు. పదేళ్ల కాలంలో బలహీనపడిన పౌర సమాజం, బలహీనపడిన ప్రజలు పుంజుకోవటానికి, బలపడేందుకు ఇప్పుడు ఒక అవకాశం వచ్చిందనే 2024 ఎన్నికలను మనం అర్థం చేసుకోవాలని వివరించారు. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు మోదీని గెలవలేం... అన్న వాతావరణం నుంచి పర్వాలేదు మనం కట్టడి చేయగలిగాం అన్న సంతృప్తిని 2024 ఎన్నికలు తీసుకువచ్చాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలే కీలకమని విరసం సభ్యుడే సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇంకా ఎన్‌కౌంటర్లు ఉంటున్నాయంటే అది ముమ్మాటికీ ప్రజాస్వామ్యం కాదన్నారు. కార్యక్రమంలో వివేక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిస్తాం : కిషన్‌రెడ్డి



శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకోవడం కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదానం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే జెండా ఒకే రాజ్యాంగం ఉండాలని ముఖర్జీ కోరుకున్నారని, ఆయన లక్ష్యానికి అనుగుణంగా ప్రధాని మోదీ, జమ్మూ కశ్మీర్‌లో జిన్నా రాజ్యాంగాన్ని రద్దుచేసి, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. మైనార్టీ, బుజ్జగింపు రాజకీయాలు చేసిన కాంగ్రెస్‌ను నాడు ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని ఎంపీ కె. లక్ష్మణ్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు మురళీధర్ రెడ్డి కన్నుమూత

న్యూఢిల్లీ, జూన్ 23: సీనియర్ జర్నలిస్టు బి. మురళీధర్ రెడ్డి(64) కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మురళీధర్ రెడ్డి ఢిల్లీలోని రామ్‌మనోహర్ లాల్ ఆస్పత్రిలో శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ది హిందూ పత్రికకు సుదీర్ఘ కాలం పనిచేసిన మురళీధర్ రెడ్డి.. ఆ వార్తాపత్రిక పాకిస్థాన్, శ్రీలంక కరస్పాండెంట్‌గా పనిచేశారు. బాబ్రీ మసీదు విధ్వంసం వంటి ముఖ్యమైన ఘటనలను రిపోర్ట్ చేశారు. మురళీధర్ రెడ్డి ఆరోగ్యం క్షీణించడంతో నెల రోజులుగా ఆయన్ను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. రెండు వారాల క్రితం కార్డియాక్ అరెస్ట్‌కు గురైన ఆయన అప్పట్నించి తుది శ్వాస విడిచే వరకు కోమాలోనే ఉన్నారు. మురళీధర్ రెడ్డికి భార్య, పీటీఐ మాజీ జర్నలిస్టు అపర్ణ శ్రీవాస్తవ, కుమారుడు మనన్ ఉన్నారు. కాగా, జర్నలిస్టు మురళీధర్ రెడ్డి మరణం బాధాకరమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన సానుభూతి తెలియజేశారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో మరో చీలిక

ఇల్లెందు, జూన్ 23: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీలో మరో చీలిక సంభవించింది. రాష్ట్రంలోని ప్రజా బాహుళ్యంలో గట్టి ప్రాబల్యం న్యూడెమోక్రసీ గత పదేళ్లకాలంలో నాలుగు ముక్కలుగా చీలిపోయింది. తాజాగా పాతూరి నారాయణ స్వామి అలియాస్ చంద్రన్న కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న న్యూడెమోక్రసీ (ఎన్డీ)లో రెండేళ్లుగా అంతర్గత విబేధాలు, ఉల్లంఘనలు, అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం, రాజకీయ ఎత్తుగడల్లో తలెత్తిన విబేధాలు, గుంటూరులో పార్టీకి చెందిన ఒకరి హత్య ఘటనలు చినికి చినికి గాలివానగా మారి పార్టీలో చీలికకు కారణమైనట్లు తెలిసింది. చంద్రన్న నాయకత్వాన్ని విభేదిస్తూ సెంట్రల్ కమిటీ నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరో కమిటీని ఏర్పాటు చేయడం, ప్రజా సంఘాలపై పట్టుకోసం ఇరువర్గాలు పోటాపోటీగా సభలు, సదస్సులు నిర్వహించడం పరస్పర నిందారోపణలు, బహిష్కరణలు వంటివి మరోసారి ఆ పార్టీ చీలికను ధ్రువపరిచాయి.

సెల్‌ఫోన్ దొంగల కోసం పోలీసు వేట

(మొదటి పేజీ తరువాయి)

రష్మి పెరుమాళ్ కథనం ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన మసూద్ ఉర్ రహమాన్, బోలక్‌పూర్ ముషీరాబాద్‌కు చెందిన ఫజల్ ఉర్ రెహమాన్ బంధువులు. విలాసవంతమైన జీవితం, చెడు అలవాట్లకు బానిసలైన వీరిద్దరూ దొంగతనాలు చేస్తుంటారు. జూన్ 19, బుధవారం అర్ధరాత్రి తర్వాత ఒక ద్విచక్రవాహనంపై వెళ్లిన వీరిద్దరూ మలక్‌పేట పరిధిలోని ఓ బార్ వద్ద ద్విచక్రవాహనాన్ని చోరీ చేసి మసూద్ ఇంటి దగ్గర పెట్టారు. తిరిగి రాత్రి రెండున్నర గంటల సమయంలో సికింద్రాబాద్ వచ్చిన ఇరువురు రైల్వేస్టేషన్ వైపు వెళుతున్న ఓ వ్యక్తిని ఆపి కత్తులతో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కున్నారు. అక్కడి నుంచి పారిపోయే క్రమంలో నానా బీభత్సం చేశారు. బాధితుడు సాయం కోసం కేకలు వేయడంతో అక్కడే మఫ్టీలో ఉన్న యాంటీ చైన్ స్నాచింగ్ టీమ్ (క్రైమ్ డెకాయ్) పోలీసులు అప్రమత్తమై దొంగలను వెంటాడారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న దొంగలు.. పోలీసులకు కత్తులు చూపించి బెదిరిస్తూ పాదచారుల సెల్‌ఫోన్లు లాక్కునేందుకు యత్నించారు. దీంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు తమ వద్ద ఉన్న తుపాకీతో బైక్ టైర్‌కు కాల్చారు. ఈ క్రమంలో బుల్లెట్ మసూద్ కుడి కాలికి తగిలింది. అయినా వాహనం ఆపకపోవడంతో మరోసారి కాల్పులు జరిపేందుకు పోలీసులు యత్నించగా తుపాకీ పేలలేదు. బుల్లెట్ గాయంతోనే దొంగలు పరారయ్యారు. అయితే, విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలించిన పోలీసులు మసూద్, ఫజల్‌ను 48 గంటల్లోపే అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఓ ద్విచక్రవాహనం, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ గోపాలపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'పుష్పక్' హ్యాట్రిక్



(మొదటి పేజీ తరువాయి)

ఎల్ఈఎక్స్-03ను కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ఆదివారం ఉదయం 7.10 గంటలకు నిర్వహించినట్టు ఇస్రో ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. గతంలో నిర్వహించిన ఎల్ఈఎక్స్-01, ఎల్ఈఎక్స్-02 విజయవంతమైన నేపథ్యంలో ఈసారి మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్ల, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించినట్టు పేర్కొంది. ప్రయోగంలో భాగంగా పుష్పక్‌ను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. అక్కడి నుంచి పుష్పక్ స్వయంగా క్రాస్ రేంజ్ కరెక్షన్ విన్యాసాలను చేపడుతూ.. రన్‌వేపైకి చేరుకుని నిర్దేశిత సెంటర్ లైన్ వద్ద ల్యాండ్ అయింది. పుష్పక్ రన్‌వేపై ల్యాండయిన తర్వాత బ్రేక్ పారాచూట్ సాయంతో దాని వేగాన్ని గంటకు 100 కి.మీ.కు తగ్గించామని, ఆ తర్వాత ల్యాండింగ్ గేర్ బ్రేక్‌లను ఉపయోగించి దాన్ని రన్‌వేపై నిలిపివేశామని పేర్కొంది. అంతరిక్షం నుంచి తిరిగొచ్చే సమయంలో ఆర్ఎల్‌వీ విధానం ఎలా ఉంటుంది, హైస్పీడ్ ల్యాండింగ్‌ను అది ఎలా నియంత్రించగలుగుతుంది వంటి పరిస్థితులను ఈ మిషన్ విజయవంతంగా ప్రదర్శించిందని ఇస్రో వివరించింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) నేతృత్వంలో సాగిన ఈ మిషన్‌ను ఇస్రో కేంద్రాలైన స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ), ఇస్రో టెలిమెట్రి, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్), శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌ల నుంచి శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు. ఎంతో సంక్లిష్టమైన ఈ పరీక్షను విజయవంతం చేసిన బృందాన్ని ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ అభినందించారు.

హోమో సెక్స్ కేసులో సూరజ్ రేవణ్ణ అరెస్టు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి మరో షాక్ తగిలింది. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ హోమోసెక్స్ కేసులో అరెస్టయ్యారు. అసహజ లైంగిక దౌర్జన్యం వివాదంలో సాక్ష్యాలను పోలీసులకు వివరించేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ సూరజ్‌ను హొళెనరసీపుర పోలీసులు శనివారం రాత్రంతా విచారించారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు సూరజ్ రేవణ్ణను అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు. సూరజ్‌పై ఐపీసీ 377 (అసహజ లైంగిక దౌర్జన్యం), 342, 506, సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై సూరజ్‌రేవణ్ణ లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని జేడీఎస్ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు ఆరోపించారు. ఈ ఆరోపణలను సూరజ్‌రేవణ్ణ ఖండించారు. తననుంచి రూ.5కోట్లు పొందాలని చేతన్ అనే వ్యక్తి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలావివాదం సాగుతుండగానే.. తనను చేతన్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు సాక్ష్యాలున్నాయంటూ శనివారం రాత్రి సూరజ్‌రేవణ్ణ హొళెనరసీపుర గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే, చేతన్ అంతకుముందే డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు సూరజ్‌ను తెల్లవారుజామున 4 గంటలదాకా విచారణ జరిపారు. తర్వాత అరెస్టు చేశారు. మరోవైపు బాధితుడిని బెంగళూరులోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

లోకం తీరు



నేటి నుంచి లోక్‌సభ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకారం చేస్తారు. ఒక్కో ఎంపీ ప్రమాణానికి ఒక నిమిషం సమయం ఉంటుంది. ప్రధాని మోదీ క్యాబినెట్‌లోని మంత్రుల్లో 58 మంది లోక్‌సభ సభ్యులు, 13 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు లూధియానా నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడం గమనార్హం. లోక్‌సభ సమావేశాలు జూలై 3 వరకు కొనసాగనున్నాయి. కాగా, లోక్‌సభలో తొలి రోజే ఏపీకి చెందిన 25 మంది సభ్యులు ప్రమాణం చేయనుండగా, రెండో రోజు తెలంగాణకు చెందిన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తారు. మూడో రోజైన 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. రాజ్యాంగంలోని 93వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగానే జరుగుతూ వస్తోంది. సహజంగా అధికార పక్షానికి చెందిన ఎంపీకి స్పీకర్ పదవి, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ప్రతిపక్షాలకు ఇచ్చే ఉపసభాపతి పదవిని తమకు ఇవ్వాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. 17వ లోక్‌సభలో బీజేపీకి చెందిన ఓంబిర్లా స్పీకర్‌గా ఉన్నారు. ఉపసభాపతి స్థానానికి ఎవరినీ ఎంపిక చేయకపోవడం వల్ల ఆ పదవి ఐదేళ్లు ఖాళీగా ఉంది. ఈ సారి ఉపసభాపతిని ఇండియా కూటమికి ఇస్తుందా? లేదా ఎన్డీయే మిత్రపక్షాల్లో ఎవరికైనా అప్పగిస్తుందా? అన్నది వేచిచూడాల్సిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 27న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆమె ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ 2న లోక్‌సభలో, 3న రాజ్యసభలో ప్రసంగిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌తోపాటు సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, సంజయ్, శ్రీనివాస వర్మలు తొలిరోజే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అవహేళనలకు గురైనవేళ
మీ ఆదరణే రక్షించింది

» వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగ లేఖ



వయనాడ్, జూన్ 23: కేరళలోని వయనాడ్ నియోజకవర్గానికి రాజీనామా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం అక్కడి ప్రజలకు భావోద్వేగపూరిత లేఖ రాశారు. వయనాడ్, రాయ్‌బరేలీ రెండు చోట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికవడంతో ఆయన ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. వంశపారంపర్య స్థానంగా గుర్తింపు పొందిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకొని వయనాడ్‌ను విడిచిపెట్టారు. ఇక్కడ ఆయన సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వయనాడ్ ప్రజలకు లేఖ రాశారు. 'ప్రతి రోజూ అవహేళనలకు గురైన సమయంలో మీరు చూపించిన అపరమిత ప్రేమే నన్ను కాపాడింది' అని ఆ లేఖలో ప్రధానంగా పేర్కొన్నారు. "వయనాడ్‌ను వదులుకోవాలన్న నిర్ణయాన్ని ప్రకటించేందుకు మీడియా ముందుకు వచ్చినప్పుడు నా కళ్లలోని విచారాన్ని మీరు చూసే ఉంటారు. అయిదేళ్ల క్రితం ఓ పరాయివ్యక్తిగా మీ ముందుకు వచ్చాను. అయినా మీరు నన్ను నమ్మారు. హద్దులు లేని ప్రేమ, అభిమానంతో అక్కున చేర్చుకున్నారు. ప్రతి రోజూ దుర్భాషలకు గురయిన సమయంలో మీరు చూపిన షరతుల్లేని ప్రేమే నన్ను సంరక్షించింది. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు. మీరు నా కుటుంబంలో సభ్యులు" అని పేర్కొన్నారు.

సగం మందే హాజరు

(మొదటి పేజీ తరువాయి)



సీబీఐ అధికారుల కారుకు అడ్డుపడిన కసియాడిహ్ గ్రామస్థులు

నిర్వహించగా.. చండీగఢ్ కేంద్రంలో పరీక్ష రాయాల్సిన ఇద్దరూ హాజరు కాలేదు. ఛత్తీసగఢ్‌లో రెండు కేంద్రాల్లో 602 మంది పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేయగా.. కేవలం 291 మందే వచ్చారు. హరియాణాలో రెండు కేంద్రాల్లో 494 మందికి ఏర్పాట్లు చేయగా.. 287 మంది, మేఘాలయలో 464 మందికిగాను 234 మంది మాత్రమే పరీక్ష రాశారు. గుజరాత్‌లో ఒకే ఒక్క అభ్యర్థి కోసం పరీక్ష పెట్టారు. మరోవైపు.. నీట్ కేసు దర్యాప్తును చేపట్టిన సీబీఐ.. ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు.. నీట్-యూజీ 2024 పరీక్ష నిర్వహణలో కొన్ని రాష్ట్రాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్టు పేర్కొంటూ గుర్తు తెలియని వ్యక్తులపై ఐపీసీ సెక్షన్ 120-బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 420 (చీటింగ్) కింద కేసులు నమోదు చేసింది. ఇక.. నీట్, యూజీసీ నెట్ ప్రశ్నపత్రాలు లీక్ అయిన నేపథ్యంలో.. ఆ రెండింటితోపాటు జేఈఈ మెయిన్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ సహా పలు ప్రవేశ, పోటీ పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ వెబ్‌సైట్ హ్యాక్ అయ్యిందన్న వదంతులు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఎన్‌టీఏ అప్రమత్తమై.. అలాంటిదేమీ లేదని, ఎన్‌టీఏ, దాని అనుబంధ వెబ్‌సైట్లన్నీ అత్యంత భద్రంగా ఉన్నాయని ప్రకటించింది. మరోవైపు.. పరీక్షల సంస్కరణలపై ఇస్రో మాజీ చీఫ్ రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్రం నియమించిన ఏడుగురు సభ్యుల ప్యానెల్ సోమవారం సమావేశం కానుంది.

ఆ నలుగురికే కాదు..

నీట్ పేపర్ లీక్ కేసులో బిహార్ పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు కీలక నిందితులు తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురికి కాదు.. మొత్తం 25 నుంచి 30 మంది విద్యార్థులకు ప్రశ్నపత్రాన్ని అమ్మారు. ఒక్కొక్కరికీ రూ.30 నుంచి రూ.40 లక్షలకు విక్రయించినట్టు.. సికందర్ యాదవేందు, అఖిలేశ్ కుమార్, బిట్టు కుమార్ , సంజీవ్ సింగ్, రాకీ, నీతీశ్, అమిత్ ఆనంద్ తదితర నిందితులు తమ నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈమేరకు.. బిహార్‌లో అదనపు డీజీపీ ఎన్‌హెచ్ ఖాన్ నేతృత్వంలో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఆర్థిక నేరాల విభాగం కేంద్ర విద్యాశాఖకు శనివారం ఆరు పేజీల నివేదిక పంపింది. తాము సేకరించిన ప్రాథమిక ఆధారాలు, నిందితుల వాంగ్మూలాలు, నేరాంగీకార పత్రాల ఆధారంగా.. నీట్ పేపర్ లీక్ అయ్యిందన్న అభిప్రాయాన్ని అందులో వెలిబుచ్చింది. అలాగే.. ఈ వ్యవహారంలో అంతర్రాష్ట్ర ముఠాల ప్రమేయం ఉందని, బిహార్‌లో సాల్వర్ గ్యాంగ్ ఈ పేపర్ లీక్ చేసిందని స్పష్టం చేసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మే 4వ తేదీ రాత్రి బిహార్‌లోని సాల్వర్ గ్యాంగు మునిసిపల్ జూనియర్ ఇంజనీర్ సికందర్ యాదవేందు ద్వారా నలుగురు విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాన్ని జవాబులతో సహా అందజేసే సమయంలోనే పట్నా పోలీసులకు ఝార్ఖండ్ పోలీసుల నుంచి ఈ వ్యవహారంపై ఉప్పందింది. ఈ వ్యవహారంలో మొత్తం 13 మంది నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలను మే 5వ తేదీనే నమోదు చేశారు. కానీ.. వారి అరెస్టు గురించి మే 7వ తేదీ దాకా వెల్లడించలేదు. అప్పటికే తాము అరెస్టు చేసిన 13 మందినీ కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఇన్ని వివరాలు తెలిసినా.. బిహార్ పోలీసులు తొలినాళ్లలో నీట్ పేపర్ లీక్ అయినట్టు తెలపకపోవడం గమనార్హం. దరిమిలా ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతో బిహార్ సర్కారు ఈ కేసును పోలీసుల నుంచి తప్పించి ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేసింది. కాగా.. కేంద్రానికి బిహార్ ఈవోయు పంపిన ఆరు పేజీల నివేదిక ఆధారంగా ఎన్‌టీఏ మరో 17 మంది విద్యార్థులను డిబార్ చేసింది. దీంతో ఈ ఏడాది నీట్ రాసినవారిలో 110 మందిని డిబార్ చేసినట్టయింది. అలాగే.. ఈ కేసులో బిహార్ ఈవోయు యూనిట్ మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటిదాకా బిహార్‌లో అరెస్టయినవారి సంఖ్య 18కి చేరింది.

మహారాష్ట్రలోనూ..

నీట్ పేపర్‌ను లీక్ చేశారనే అనుమానంతో.. నాందేడ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు లాతూర్‌లో సంజయ్ తుకారాం జాదవ్, జలీల్ ఉమర్‌ఖాన్ పఠాన్ అనే ఇద్దరు టీచర్లను అదుపులోకి తీసుకున్నారు. వారు గతంలో జిల్లా పరిషత్ స్కూల్‌లో బోధించారని.. ప్రైవేటు కోచింగ్ సెంటర్లను నడుపుతున్నారని సమాచారం. వారిని కొన్ని గంటలపాటు ప్రశ్నించిన పోలీసులు.. మళ్లీ తాము పిలిచినప్పుడు రావాలని హెచ్చరించి వదిలిపెట్టినట్టు తెలుస్తోంది.

సీబీఐ బృందంపై దాడి

యూజీసీ-నెట్ కేసు దర్యాప్తులో భాగంగా.. ఫూల్ చంద్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేస్తూ బిహార్‌లోని నవాదా ప్రాంతానికి వెళ్లిన సీబీఐ బృందంపై కసియాడిహ్ గ్రామవాసులు దాడి చేశారు. సీబీఐ బృందంలో నలుగురు అధికారులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. గ్రామస్థులు వారిపై దాడి చేయగా.. సీబీఐ బృందం స్థానిక పోలీసులకు ఫోన్ చేసింది. వెంటనే వారు వచ్చి ఆ బృందాన్ని కాపాడారు. అనంతరం స్థానిక పోలీసుల సమక్షంలో దర్యాప్తు కొనసాగించిన సీబీఐ బృందం రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. కాగా.. తమ గ్రామానికి వచ్చింది నకిలీ అధికారుల బృందం అనే సందేహంతోనే గ్రామస్థులు సీబీఐ అధికారులపై దాడి చేసినట్టు స్థానిక పోలీసులు చెప్పారు.

నీట్ స్కామ్‌కు మోదీ సర్కారుదే బాధ్యత: ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): 'నీట్ కుంభకోణానికి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ వల్ల కుళ్లిపోయిన విద్యా వ్యవస్థ.. అధికారులను మార్చినంత మాత్రాన బాగుపడదని శనివారం 'ఎక్స్' పోస్టులో వ్యాఖ్యానించారు. ఇప్పుడు నీట్-పీజీని వాయిదా వేశారని, గత పది రోజుల్లో నాలుగు పరీక్షలను వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేశారని గుర్తుచేశారు. విద్యా వ్యవస్థలోకి ప్రశ్నపత్రాల లీక్‌లు, అవినీతి, అక్రమాలు, మాఫియా చొరబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్ రాకెట్, మాఫియా ముందు ప్రధాని మోదీ నిస్సహాయంగా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీట్-పీజీ వాయిదా పడడం మోదీ హయాంలో ధ్వంసమైన విద్యా వ్యవస్థకు మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థను, పిల్లల భవిష్యత్తును మాఫియా, అవినీతిపరులు, భజనపరులైన అసమర్థుల చేతుల్లో పెట్టిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఒక్క పరీక్షను కూడా సక్రమంగా పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. యువత భవిష్యత్తుకు బీజేపీయే అతిపెద్ద అడ్డంకిగా మారిందన్నారు.

డీఎస్పీకి వివాహేతర సంబంధం
కానిస్టేబుల్‌గా రివర్షన్!

లఖ్‌నవూ, జూన్ 23: ఓ మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న పోలీసు ఉన్నతాధికారికి తగిన శాస్తి జరిగింది. ఆయన్ను డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ స్థాయికి రివర్షన్ చేస్తూ యూపీ పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. క్రిపాశంకర్ కనౌజియా కానిస్టేబుల్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి డీఎస్పీ స్థాయికి చేరుకున్నారు. మూడేళ్ల క్రితం ఉన్నావ్‌లో సర్కిల్ ఆఫీసర్ (సీవో)గా పనిచేస్తున్న సమయంలో ఆయన ఓ మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే 2021 జూలైలో కుటుంబ సమస్యలు కారణంగా చూపి సెలవు పెట్టారు. అయితే ఆయన ఇంటికి వెళ్లకుండా ఆ కానిస్టేబుల్‌తో కలసి కాన్పూర్‌లోని ఓ హోటల్‌కు వెళ్లారు. కనౌజియా ఫోన్ కలవకపోవడంతో ఆయన భార్య ఉన్నావ్ ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు..ఆ హోటల్‌కెళ్లి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. కనౌజియా చర్యను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాదికారులు ఆయనపై చర్యలు తీసుకున్నారు.

మేనల్లుడే వారసుడు: మాయావతి

లఖ్‌నవూ, జూన్ 23: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను మరోసారి తన రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆయనకు పార్టీ జాతీయ సమన్వయ కర్తగా తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. గతనెలలో ఎన్నికల సమయంలో ఆకాశ్‌కు పరిపక్వత లేదని పేర్కొంటూ ఆయనను వారసుడిగా తొలగించడంతో పాటు పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. "ఆకాశ్ పూర్తి పరిణతి కలిగిన నేత ఎదుగుతారని ఆశిస్తున్నా. భవిష్యత్తులో అతను నా అంచనాలను అందుకోగలరు" అని తాజాగా మాయావతి పేర్కొన్నారు.

బిహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

మోతీహారి, జూన్ 23: బిహార్‌లో మరో బ్రిడ్జి కూలింది. తూర్పు చంపారన్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఓ వంతెన ఆదివారం కూలిపోయింది. ఆ రాష్ట్రంలో గడిచిన వారం రోజుల్లో బ్రిడ్జి కూలిపోవడం ఇది మూడోసారి. ఘోరసహన్ బ్లాక్‌లో జరిగిన ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. రాష్ట్ర గ్రామీణ పనుల శాఖ(ఆర్‌డబ్ల్యూడీ) ఓ కాలువపై రూ. 1.5 కోట్లతో నిర్మిస్తోన్న ఈ బ్రిడ్జి పూర్తవకుండానే కూలింది. ఆర్‌డబ్ల్యూడీ శాఖ చీఫ్ సెక్రటరీ దీపక్ సింగ్ మాట్లాడుతూ... బ్రిడ్జి కూలడంపై శాఖాపరమైన విచారణకు ఆదేశించామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పద్మశ్రీ గ్రహీత రామచంద్రయ్య కన్నుమూత

» ఊపిరితిత్తుల వ్యాధితో అస్వస్థత
» కొంతకాలం హైదరాబాద్‌లో చికిత్స
» పరిస్థితి విషమించి తుదిశ్వాస
» రామచంద్రయ్యకు రూ.కోటి సాయం ప్రకటించి.. ఇవ్వని గత ప్రభుత్వం



అప్పటి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న సకిని రామచంద్రయ్య (ఫైల్)

మణుగూరు/హైదరాబాద్, జూన్ 23: కంచుమేళం (డోలి) కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య (65) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. అంతరించిపోతున్న డోలు వాయిద్యానికి జీవం పోసిన ఆయన 2022 జనవరి 25న రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన రామచంద్రయ్య గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందారు. ఆయనకు భార్య బాపనమ్మ, కుమారుడు బాబూరావు, కుమార్తెలు వాణి, వసంత, సుమలత ఉన్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి తన తండ్రి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారని, రూ.14 లక్షల వరకు అప్పులు తెచ్చి ఖమ్మం, హైదరాబాద్, విజయవాడకు తీసుకెళ్లి వైద్యం చేయించామని రామచంద్రయ్య కుమారుడు బాబూరావు తెలిపారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో మెరుగైన వైద్య సేవలు అందించలేకపోయామన్నారు. పద్మశ్రీ లభించిన సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తామన్న ప్రోత్సాహకం ఇచ్చి ఉంటే తన తండ్రి ఇంకొన్నాళ్లయినా బతికి ఉండేవాడని కన్నీటిపర్యంతమయ్యాడు. రామచంద్రయ్య మృతితో కూనవరంలో విషాదం అలుముకుంది. సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అంతరించిపోతున్న డోలు వాయిద్యానికి జీవం పోసి.. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడిన రామచంద్రయ్య మృతి జానపద కళకు తీరని లోటు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. వారసత్వంగా వచ్చిన డోలు వాయిద్య కళతో ఆయన తెలంగాణ రాష్ట్రానికి కీర్తి సాధించిపెట్టారన్నారు. రామచంద్రయ్య మృతికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ కూనవరం వెళ్లి రామచంద్రయ్యకు నివాళులర్పించారు.

రామచంద్రయ్యకు అందని రూ.కోటి సాయం

కోయ అధ్యయన వేదిక ఆత్మీయ మిత్రుడైన సకిని రామచంద్రయ్య వయసు పైబడి మరణించలేదని, ఆయన ఆర్థిక ఇబ్బందులతో చనిపోవడం బాధాకరమని తెలంగాణ చారిత్రక పరిశోధకుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, పద్దం అనసూయ, డాక్టర్ గూడూరు మనోజ పేర్కొన్నారు. రామచంద్రయ్యకు గత ప్రభుత్వం ఇస్తామన్న కోటి రూపాయల ఆర్థిక సహాయం ఇప్పటికీ అందలేదన్నారు. కేసీఆర్ హయాంలో పద్మశ్రీ పురస్కార గ్రహీతల్లో కొందరికి డబ్బులు ఇచ్చి, మరికొందరికి ఇవ్వలేదన్నారు.

దివ్యాంగ బాలికపై లైంగిక దాడి

» నాలుగు రోజులుగా నిర్బంధించి దారుణం

మిర్యాలగూడ అర్బన్, జూన్ 23: దివ్యాంగ బాలికను లోబరుచుకున్న ఓ యువకుడు రాష్ట్ర సరిహద్దు దాటించాడు. రహస్య ప్రదేశంలో నాలుగు రోజులుగా నిర్బంధించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా ఈ విషయం వెలుగు చూసింది. ఏపీలోని కృష్ణా జిల్లా కోడూరు మండల కేంద్రానికి చెందిన బొట్టు బేబీరావు రెండేళ్లుగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఉంటూ ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. దానికి ఎదురుగా నివసించే దివ్యాంగ బాలికతో అతడు పరిచయం పెంచుకున్నాడు. అయితే ఈనెల 18 నుంచి బాలిక కనపడకపోవటంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమెతో సన్నిహితంగా మెలిగే బేబీరావుపై అనుమానం వ్యక్తం చేయగా.. అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బేబీరావు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు కోడూరు మండల కేంద్రానికి వెళ్లారు. శనివారం రాత్రి బేబీరావును అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. దివ్యాంగ మైనర్ బాలిక ఆచూకీ లభ్యమైంది. నాలుగు రోజులుగా బాలికను నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాలికను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షల అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు బేబీరావుపై కిడ్నాప్, పోక్సో, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

నీట్‌పై సుప్రీంకోర్టు జ్యుడీషియల్
కమిటీతో విచారణ జరపాలి

» ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్
» ప్రధాని క్షమాపణలు చెప్పాలి: ఒవైసీ

హైదరాబాద్/ కరీంనగర్ అర్బన్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని జ్యుడీషియల్ కమిటీతో విచారణ జరిపించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం లోపభూయిష్టంగా ఉందని, నీట్‌లో జరిగిన అక్రమాలకు అదే కారణమని ఆయన ఆరోపించారు. నీట్‌లో జరిగిన అక్రమాలతో 24 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, నీట్, నెట్ పరీక్షలను పూర్తిగా రద్దు చేసి గతంలో మాదిరిగా వీటి నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హరగోపాల్ మాట్లాడారు. జాతీయ విద్యా విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకించి, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక విద్యా విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు. ప్రధాని యువత భవిష్యత్తుపై యుద్ధం ప్రకటించారని, 23 లక్షల మంది రాసిన నీట్- యూజీ పరీక్షపై గందరగోళ పరిస్థితులు నెలకొల్పారని, 9 లక్షల మంది రాసిన యూజీసీ-నెట్, 2 లక్షల మంది రాసిన సీఎస్ఐఆర్- నెట్ పరీక్షలను రద్దు చేశారని.. 2లక్షల మంది పరీక్షకు సిద్ధమైన తరుణంలో రాత్రికి రాత్రే నీట్- పీజీ పరీక్షను రద్దు చేశారని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఈ పరిణామాలకు మోదీ ఆయన మంత్రి వర్గం బాధ్యత వహిస్తూ యువతకు క్షమాపణలు చెప్పాలని ఆదివారం ఎక్స్ వేదికగా ఒవైసీ డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా నీట్‌ను రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇంటి ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

ఎంఎన్‌జేలో 'ఎముక మజ్జ మార్పిడి'

» ప్రైవేట్‌లో రూ.10-30 లక్షల వ్యయం
» క్యాన్సర్ రోగులకు ఉచితంగా చికిత్స
» ఇప్పటి వరకు వంద మందికి బోన్‌మ్యారో



హైదరాబాద్ సిటీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ జబ్బుకు చికిత్స ఖరీదైన విషయం. ముఖ్యంగా లుకేమియా వంటి క్యాన్సర్ రోగులకు ఎముక మజ్జ మార్పిడి (బోన్‌మ్యారో) చికిత్స చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అయితే దాదాపు రూ.10-30 లక్షల దాకా ఖర్చవుతుంది. ఇంతటి ఖరీదైన చికిత్సను ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచితంగా అందిస్తున్నారు. గత ఏడాది ఈ ఆస్పత్రిలో కొత్తగా నిర్మించిన అరబిందో అంకాలజీ బ్లాక్‌లో ఈ చికిత్సలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు వంద మందికి ఎముక మజ్జ మార్పిడి చికిత్సలు నిర్వహించినట్లు ఎంఎన్‌జే డైరెక్టర్ ముక్తా శ్రీనివాసులు చెప్పారు. రక్త క్యాన్సర్, పుట్టుకతో ఇతర రక్త సంబంధిత రోగాలకు ఎముక మజ్జ మార్పిడి అవసరమవుతుందని తెలిపారు.

మూలకణాలు సేకరించి..

రోగికి తప్పనిసరిగా బోన్ మ్యారో చికిత్స చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే రక్త సంబంధీకుల నుంచి మూలకణాలను సేకరించి వాటిని రోగికి మార్పిడి చేస్తారు. తద్వారా కొత్త కణాలు వృద్ధి చెంది క్యాన్సర్ నియంత్రణలోకి వస్తుందని, ఈ ప్రక్రియను ఆటోలోగస్‌గా పేర్కొంటారని వైద్యులు చెప్పారు. రోగికి సంబంధించి ఒకరి 'హ్యూమన్ లుకోసైట్ యాంటిజన్ (హెచ్ఎల్ఏ)'తో మరొకరి హెచ్ఎల్ఏ పూర్తిగా సరిపోలితేనే మార్పిడి చేస్తారు. కానీ, ఎంఎన్‌జేలో సగం సరిపోలినప్పటికీ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని మార్పిడి చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మరో విధానంలో రోగి నుంచే మూల కణాలను సేకరించి, వాటిని శుద్ధి చేసి మంచి కణాలను మళ్లీ అతనికి అందిస్తామని చెప్పారు. ఉచిత బోన్‌మ్యారో కేసులు నాలుగు రెట్లు పెరిగినట్లు పేర్కొన్నారు. అలాగే కీమోథెరపీ చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య 62 శాతం పెరిగిందన్నారు. గత జూన్‌లో అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.80 కోట్ల వ్యయంతో 300 పడకల అత్యాధునిక అంకాలజీ బ్లాక్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎంఎన్‌జేలో 1.35 లక్షల మంది రోగులు క్యాన్సర్ చికిత్స పొందినట్లు చెప్పారు.

మొబైల్ స్క్రీనింగ్ పరీక్షలు

ఆస్పత్రికి సంబంధించిన మొబైల్ స్క్రీనింగ్ బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రాథమిక స్క్రీనింగ్ క్యాంపులతో 1.5 శాతం మంది రోగుల్లో ఆరంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లు చెప్పారు. కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసా, ఛత్తీస్‌గఢ్, బిహార్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కూడా రోగులు వచ్చి క్యాన్సర్‌కు చికిత్స పొందారని తెలిపారు. కొత్త భవనం అందుబాటులోకి వచ్చిన తర్వాత కీమోథెరపీ చేయించుకుంటున్న రోగుల నిరీక్షణ 48 గంటల నుంచి 6 గంటలకు తగ్గిందన్నారు. కాగా, తెలంగాణలో క్యాన్సర్‌కు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో ఈ భవనంలో అందిస్తున్న సేవలు కీలకంగా నిలుస్తాయని అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్, అరబిందో ఫార్మా లిమిటెడ్ వీసీఎండీ కె.నిత్యానందరెడ్డి తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. టెకీ మృతి

» హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఘటన
» మృతుడిది వనపర్తి జిల్లా..



బంజారాహిల్స్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చూపులకని వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ టెకీ దుర్మరణం పాలైన ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన శివశంకర్ (30) మాదాపూర్‌లోని ఓ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సంస్థకు సమీపంలోనే హాస్టల్‌లో ఉంటున్నాడు. అయితే అతడికి పెళ్లి సంబంధాలు చూస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు ఇంటికి రమ్మని చెప్పారు. ఈక్రమంలోనే శనివారం అర్ధరాత్రి తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-1 ఎవిస్ ఆస్పత్రి వద్దకు రాగానే అప్పుడే పెద్ద కంటైనర్ యూటర్న్ తీసుకుంటుండటంతో శివశంకర్ బైక్ వేగాన్ని తగ్గించాడు. ఇంతలో వెనుక నుంచి వచ్చిన ఓ టిప్పర్ బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఎగిరి కిందపడ్డ శివశంకర్ తలకు తీవ్ర గాయమైంది. అక్కడే ఉన్న మిగతా వాహనదారులు అంబులెన్స్‌తో పాటు పోలీసులకు సమాచారమిచ్చారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా.. శివశంకర్ అప్పటికే మృతి చెందాడు.

హైదరాబాద్-విజయవాడ హైవేపై 17 బ్లాక్ స్పాట్లకు మోక్షం!

- ప్రమాదాల నివారణకు 10 చోట్ల అండర్‌పాస్‌లు
- మిగతాచోట్ల సర్వీస్ రోడ్ల నిర్మాణం వంటి చర్యలు
- పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి


చిట్యాలలో ఫ్లైఓవర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్/చిట్యాల, జూన్ 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163)పై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించిన 17 బ్లాక్ స్పాట్‌ల బెడద త్వరలో తొలగిపోనుంది. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చేపట్టే పనులతో పాటు నల్లగొండ జిల్లా చిట్యాలలో హైవేపై నిర్మించే ఫ్లై ఓవర్ నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. 17 బ్లాక్‌స్పాట్‌ల పనులకు రూ.288 కోట్లు, మరో రెండుచోట్ల బ్రిడ్జిలకు రూ.73 కోట్లు ఖర్చు చేయనున్నారు. మొత్తంగా ఈ హైవేపై ప్రమాదాల నివారణకు రూ.361 కోట్లతో పనులు చేపడుతున్నారు. గతంలో సర్వే చేసిన జాతీయ రహదారుల సంస్థ.. ఈ హైవేలో 17 చోట్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించింది. మూడేళ్ల(2015-2018)లో 548 ప్రమాదాలు జరిగాయని, 264 మరణాలు సంభవించాయని సర్వేలో తేలింది. దీంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. గతంలో టెండర్లను ఆహ్వానించినా పలు కారణాలతో ఈ పనులు మొదలుకాలేదు. కోమటిరెడ్డి భువనగిరి ఎంపీగా ఉన్నప్పటి నుంచే ఈ హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. ఆయన కృషి ఫలించి పనులకు ఇప్పుడు శంకుస్థాపన జరిగింది. ఈ పనులను 18 నెలల్లో పూర్తిచేసేలా జాతీయ రహదారుల సంస్థ.. కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్‌హెచ్-163పై చౌటుప్పల్ నుంచి నవాబ్‌పేట జంక్షన్ వరకు ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాల్లో 10 చోట్ల వెహికల్ అండర్‌పాస్‌ల నిర్మాణం, రోడ్ల వెడల్పు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. కాగా, చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల టేకుమట్ల, జనగామ క్రాస్, ఎస్వీ కాలేజ్, సూర్యాపేట ఫ్లై ఓవర్ ముగిసే చోట, ముకుందాపురం కొమరబండ క్రాస్‌రోడ్, రామాపురం క్రాస్ రోడ్ వద్ద అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.

రూ.30 వేల కోట్లతో ట్రిపుల్ ఆర్

హైదరాబాద్ చుట్టూ రూ.30 వేల కోట్లతో త్వరలో రీజనల్ రింగ్ రోడ్డు పనులను చేపట్టనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్-విజయవాడ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా మార్చడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆదివారం ఆయన చిట్యాలలో ఫ్లై ఓవర్‌కు శంకుస్థాపన అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని, రూ.7లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతున్నామన్నారు. వచ్చే వారం నుంచి రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించి ఆగస్టు 15లోగా పూర్తి చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులకు రూ.2,200 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. వారం రోజుల్లో ఆ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.500 కోట్లతో ఆర్‌అండ్ బీ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.

సీఎం అంటే కటింగ్ మాస్టరా?: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): "మొన్న లక్షల మందిని రూ.500 సిలిండర్ పథకానికి దూరంచేశారు... నిన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ఆగం చేశారు... నేడు రూ.2లక్షల రుణమాఫీకి ఆంక్షలు విధించి, లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టాలని చూస్తున్నారు! అసలు సీఎం అంటే కటింగ్ మాస్టరా?" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. "ప్రతి పథకంలో లబ్ధిదారుల సంఖ్యకు కోతపెట్టడమే లక్ష్యమా? సీఎం అనే పదానికి ఇది సరికొత్త నిర్వచనమా?" అంటూ 'ఎక్స్' వేదికగా ఆయన నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో అందరికీ అన్నీ ఇస్తామన్న కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొందరికే కొన్ని అని కోతలు పెడుతోందన్నారు. హామీ ప్రకారం రుణమాఫీ చేయకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి లీగల్ నోటీసు జారీ

హైదరాబాద్, కరీంనగర్ అర్బన్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఫ్లైయాష్ రవాణాకు సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేసినందుకు గాను బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి లీగల్ నోటీసు జారీ అయింది. ఆయనతో పాటుగా ఆ వార్తలను ప్రసారం చేసిన టీ న్యూస్, నమస్తే తెలంగాణ దినపత్రికలు, టీ న్యూస్ ఎండీ జోగినిపల్లి సంతోష్‌కుమార్‌లకూ లీగల్ నోటీసులు జారీ అయ్యాయి. మంత్రి పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేసినందుకుగాను ఆయన తరపు అడ్వకేటు ఈటూరు పూర్ణచంద్రరావు ఈ నోటీసులు ఇచ్చారు.

వాంగ్మూలంలో తప్పులు బయటపెడతా

- విద్యుత్ కమిషన్ లేఖపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కమిషన్ నుంచి తనకు లేఖ వచ్చిందని, తనకు తెలిసిన సమాచారాన్ని అందజేస్తానని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. అయితే, కమిషన్‌కు అందిన వాంగ్మూలాల్లో తప్పులను బయటపెడతానని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చిన వారిపై వారం రోజుల్లో అభిప్రాయం చెప్పాలని కోరుతూ తనకు లేఖ వచ్చిందని తెలిపారు. ఈ విషయంలో సమగ్ర సమాచారం రావాలంటే విద్యుత్ కమిషన్ అందరినీ విచారించాలని, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్, అక్కడి విద్యుత్ అధికారుల నుంచి సమాచారం తీసుకోవాలని సూచించారు. అలాగే, ఈఆర్సీపై స్టే ఇచ్చిన ఎన్జీటీని, పర్యావరణ అనుమతులు ఇచ్చిన వారిని కూడా విచారణకు పిలుస్తారా? అని ప్రశ్నించారు. కాగా, రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ విప్‌గా ఎంపీ దివకొండ దామోదర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు ఆదివారం లేఖ రాశారు.

దళిత అధికారిణిని దూషించిన జూనియర్‌పై చర్యలు తీసుకోవాలి

- విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ హైదరాబాద్ జిల్లా సభ్యులు

బర్కత్‌పుర, జూన్ 23(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో దళిత అధికారిణిని కులం పేరుతో దుర్భాషలాడిన జూనియర్ అధికారిణిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బత్తుల రాంప్రసాద్, బోయిని ఎల్లేష్ మాదిగలు డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సచివాలయం ఆర్థిక శాఖ విభాగంలో జాయింట్ సెక్రటరీ హోదాలో పనిచేస్తున్న దళిత అధికారిణిని డిప్యూటీ సెక్రటరీ హోదాలో ఉన్న అగ్ర కుల అధికారిణి మార్చి నెలలో దూషించారని ఆరోపించారు. ఈ మేరకు వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారని పేర్కొన్నారు. దీనిని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. దళిత అధికారిణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ లాభం లేకపోయిందన్నారు. ఆమెను దూషించిన జూనియర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారిణిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలన్నారు. కమిటీ సభ్యులు ఎన్.దాస్, శివ, అనిల్, బలరాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికపై అధిష్ఠానంతో చర్చ!


హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న సీఎం.. 2 రోజులపాటు ఢిల్లీలోనే మకాం వేయనున్నారు. మంగళవారం రాత్రికి హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ఈ 2 రోజుల్లో రాష్ట్ర అభివృద్ధి, ఆర్థికంగా కేంద్ర సహకారానికి సంబంధించి ఆయా శాఖల కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కలవనున్నారు. రాష్ట్రానికి కేంద్ర సాయాన్ని కోరుతూ వారికి వినతిపత్రాలు ఇవ్వనున్నారు. ముఖ్యంగా రుణమాఫీ వంటి పెద్ద కార్యక్రమాలు పెట్టుకున్నందున కేంద్రం నుంచి సహకారం కోరనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అధికారికంగా కేంద్ర మంత్రులను కలుస్తూనే.. కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలనూ కలిసి రాష్ట్రంలో రాజకీయ కార్యాచరణపైనా రేవంత్ చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. ఈ చేరికలపై అధిష్ఠానం పెద్దలతో సీఎం రేవంత్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే.. బడ్జెట్ సమావేశాలలోపే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరతారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాగా, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపైనా కాంగ్రెస్ హైకమాండ్‌తో సీఎం చర్చించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యంపైనే చర్చించనున్నట్లు చెబుతున్నారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్‌సాగర్‌రావు లేదా ఎడ్మ బొజ్జుకు మంత్రివర్గంలో చోటు కల్పించే అంశంపై చర్చిస్తారని పేర్కొంటున్నారు. బీసీల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని రేవంత్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ సామాజికవర్గం నుంచి ఒక నేతను ఎమ్మెల్సీగా తీసుకుని మంత్రిని చేసే చాన్స్ కూడా ఉందని ఒక సందర్భంలో ఆయనే అన్నారు. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కుతుందా? లేక మరో నేతను వరిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఢిల్లీ పర్యటనలో రాష్ట్ర అభివృద్ధి పైనే సీఎం రేవంత్ ప్రధానంగా దృష్టి పెట్టారని, ఇందులో భాగంగా కేంద్ర మంత్రులు, ప్రభుత్వ పెద్దలను కలిసేందుకే ప్రాధాన్యం ఇస్తారని చెబుతున్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్!

(మొదటిపేజీ తరువాయి)

చేరిన సంగతి తెలిసిందే. పోచారం కాంగ్రెస్‌లో చేరిన రెండోరోజే.. మరో పెద్ద వికెట్ పడడం బీఆర్ఎస్‌కు షాకే! నిజానికి.. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల 'కారు' దిగి హస్తం గూటికి చేరడానికి సర్వం సిద్ధమైందంటూ శనివారం విస్తృతంగా ప్రచారం జరిగింది. అంతలోనే అనూహ్యంగా సంజయ్‌కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం చర్చనీయాంశంగా మారింది. వీరే కాదు.. హైదరాబాద్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జూలై మొదటివారంలోగా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈమేరకు చర్చలు సఫలమైనట్టుగా చెబుతున్నారు. 8-10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు వారి పేర్లతో సహా దానం ఇటీవలే ప్రకటించడం గమనార్హం. ఇదిలా ఉండగా.. గంగుల కాంగ్రెస్‌లో చేరతారంటూ వార్తల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఆయన్ను తన ఫామ్‌హౌజ్‌కు పిలిపించుకుని మాట్లాడారు. గంగులతోపాటు కరీంనగర్ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు కూడా ఉన్నారు. గంగుల ఫామ్‌హౌజ్ వద్దకు వచ్చేసరికే.. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ కూడా అక్కడికి చేరుకున్నారు.

తొందరపాటువల్లే..



(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేస్తున్నారు. బ్యారేజీల నిర్మాణ ప్రదేశాల్లో 100 మీటర్ల లోతు వరకు భూభౌతిక స్థితిగతుల డాటాను సేకరించాల్సి ఉండగా కేవలం 25 మీటర్లకే పరిమితమయ్యారని గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా.. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలు మూడింటి జీఎస్ఐ డాటా అందుబాటులో లేదని చెబుతున్నారు. మేడిగడ్డ కుంగిపోయేందుకు చిన్న చిన్న లీకేజీలే పెను విపత్తుకు కారణమని ఎన్‌డీఎస్ఏ ప్రాథమికంగా పరీక్షల్లో తేల్చినా.. ఏడాది కాలంపాటు నిర్వహణను నిర్లక్ష్యం చేశారని చెబుతున్నారు. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను అనుసరించలేదని అన్నారు.

పనుల్లో డిజైన్లను అనుసరించినా..

బ్యారేజీల నిర్మాణ సమయంలో డిజైన్లను అనుసరించి పనులు చేపట్టినా.. కొన్ని కీలకమైన సాంకేతిక అంశాలను విస్మరించారని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బ్యారేజీల ఫౌండేషన్ సందర్భంగా పైల్స్ రాఫ్ట్‌ల నిర్మాణం సమయాల్లో నిర్ధారిత ప్రమాణాలు పాటించలేదని అంటున్నారు. పైల్స్ ఏర్పాటు సందర్భంగా లీకేజీలు ఏర్పడకుండా బెంటోనైట్ కెమికల్‌తో వాటర్ ప్రూఫ్ చేయాల్సి ఉన్నా దానిని సరిగ్గా చేయలేదని పేర్కొంటున్నారు. కటాఫ్ పైలింగ్ నిర్మాణ సమయంలో ఒకదానిపై మరో పైల్ వేసేటప్పుడు పగుళ్లు ఏర్పడతాయని, ఆ పగుళ్లను బెంటోనైట్ కెమికల్‌తో పక్కాగా ప్రూఫింగ్ చేయాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు. కానీ, వాటిని సరిగ్గా చేశారా? లేదా? అని చెప్పేందుకు సరైన డేటా రికార్డులు కూడా అందుబాటులో లేవంటున్నారు. ఇక్కడ ఏమాత్రం గ్యాప్ ఉన్నా సకాలంలో గుర్తించకపోతే అదే పెను విపత్తుకు దారి తీస్తుందని, మేడిగడ్డ బ్యారేజీలో అదే జరిగిందని అంటున్నారు. దీంతోపాటు బ్యారేజీలో అంతర్గత ప్రవాహం (అండర్ కరెంట్ ఫ్లో) తీవ్రత అధికంగా ఉంటుందని, ఇసుక మధ్యలోనుంచి చిన్నగా మొదలయ్యే లీకేజీని పట్టించుకోకపోతే లీకేజీల తీవ్రత పెద్దగా మారి బ్యారేజీ పియర్ల బరువు కారణంగా ఫౌండేషన్ కుంగిపోతుందని, మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో అదే జరిగిందని చెబుతున్నారు. ఇన్నాళ్లు ఇసుక ఉండటం వల్ల సింక్ హోల్స్ కనిపించకుండా పోయాయని, తాజాగా పరీక్షల కోసం ఇసుక తీసివేయడం వల్ల ఆ రంధ్రాల తీవ్రత బయట పడిందని అన్నారు. ఇక బోర్ హోల్స్ వేసిన ప్రదేశంలోనే బ్యారేజీలు నిర్మించారా? లేదా? అని చెప్పేందుకు కూడా అవసరమైన సమాచారం లేదన్నారు. ముఖ్యంగా బోర్ హోల్స్ వేసినప్పుడు రాతి అవశేషాలను నిల్వ చేసే పరిస్థితి ఉంటుందే తప్ప ఇసుక ప్రాంతం కావడం వల్ల అక్కడ ఏం జరిగిందో చెప్పేందుకు ఆధారాలు లేని పరిస్థితిని సృష్టించారని చెప్పారు.

క్లిష్టతరమే.. అయినా పునరుద్ధరణ సాధ్యమే

దెబ్బతిన్న మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను పునరుద్ధరించడం సాధ్యమేనని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బ్యారేజీ మొత్తం డాటాను విశ్లేషించడం, లోపాలను కనుగొనడం, వాటిని సరిచేయడం వంటి అంశాలపై ప్రస్తుతం ఎన్‌డీఎస్ఏ దృష్టి సారించినట్లు పేర్కొంటున్నారు. ఇటీవల రెండు దఫాలుగా పర్యటించి వెళ్లిన ఎన్‌డీఎస్ఏ నిపుణులు డ్యామ్ సేఫ్టీ అథారిటీకి ఇదే విషయాన్ని తేల్చి చెప్పినట్లు వెల్లడించారు. దెబ్బతిన్న పియర్ల వద్ద గ్రౌటింగ్‌ను పకడ్బందీగా చేయడంతోపాటు గోడను నిర్మించి బ్యారేజీని రక్షించుకునేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అంతర్వాహినులే అగాధానికి కారణం!

మహదేవపూర్ రూరల్: మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో పిల్లర్ల కుంగుబాటుకు అంతర్వాహినులే (సబ్ సర్ఫేస్ ఫ్లోలు) ప్రధాన కారణమని తెలుస్తోంది. వీటివల్లే బ్యారేజీ కింద భారీ స్థాయిలో ఇసుక జారిపోయి అగాధం ఏర్పడినట్లు భావిస్తున్నారు. బ్యారేజీ పిల్లర్లు కుంగిన తర్వాత ప్రభుత్వానికి ఇచ్చిన ప్రాథమిక రిపోర్టులోనూ అంతర్వాహినుల ప్రభావాన్ని ప్రస్తావిస్తూ ఇంజనీరింగ్ అధికారులు వివరణ ఇచ్చినట్లు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి ముందే ఆ ప్రాంతంలో సుడిగుండాల ప్రభావం ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో గోదావరి నది రెండు పాయలుగా ప్రవహించేదని, అందులో ఒకటి బ్లాక్-7 మీదుగానే ఉండేదని చెబుతున్నారు. నది పాయలుగా ఏర్పడి ప్రవహిస్తున్నప్పుడు దాని కిందే అంతర్వాహినులు ప్రవహిస్తాయని నిపుణులు చెబుతున్నారు. బ్యారేజీలో డ్యామ్ మాదిరిగా నెలల తరబడి నీటిని నిల్వ చేయడం వల్లే అంతర్వాహినుల ప్రభావానికి ఆజ్యం పోసినట్లయిందని ఓ అధికారి చెప్పారు. అంతేకాకుండా.. గోదావరి నదిలో ఒక్కో చోట ఒక్కో రకం ఇసుక లభిస్తుందని, మేడిగడ్డ బ్యారేజీ వద్ద పూర్తిగా సన్న రకం ఇసుక ఉండటమే కుంగుబాటుకు మరో కారణమని తెలుస్తోంది.

చివరి దశకు మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు

అన్నారం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జూన్ 23 : మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాకులో చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు చివరి దశకు చేరుకున్నాయి. గ్రౌటింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకోగా షీట్ పైల్స్ అమరిక పనులు పూర్తికావస్తున్నాయి. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలతో కొంత మేర పనులకు అంతరాయం ఏర్పడింది. గతంలో న్యూఢిల్లీకి చెందిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పలు పరీక్షలు చేసి వెళ్లింది. బ్లాక్-7లోని గేట్ల ఎగువన, దిగువన సేకరించాల్సిన మట్టి నమూనాల పనులు నిర్మాణ సంస్థతోపాటు స్థానిక అధికారులకు అప్పజెప్పి వెళ్లింది. అయితే.. గేట్ల బే ప్రాంతంలో భారీగా వర్షపు నీరు చేరడంతో నమూనాల సేకరణ కొనసాగడం లేదని తెలిసింది. మరోవైపు బ్యారేజీకి సంబంధించిన ఉన్నతాధికారి న్యాయ విచారణ అనంతరం బదిలీ కాబోతున్నారంటూ చర్చ జరుగుతోంది. అన్నారం బ్యారేజీ వద్ద కేంద్ర జలశక్తి పరిశోధన కేంద్ర నిపుణుల బృందం ఆదివారం కూడా పరీక్షలు నిర్వహించింది.


సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుపై సమీక్ష

- పైలట్ ప్రాజెక్టు కింద కొడంగల్, మధిర నియోజకవర్గాల ఎంపిక

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, వాటి తీరుతెన్నులు ఇతర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఆదివారం సీఎం నివాసంలో జరిగిన ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో స్కూల్ భవనం, పరిసరాలు, ఏవిధంగా ఉండాలో సూచిస్తూ ఆర్కిటెక్చర్ రూపొందించిన పలు నమూనాలను సీఎం, డిప్యూటీ సీఎం పరిశీలించారు. నాణ్యమైన విద్యా బోధనకు వీలుగా తరగతి గదులతో పాటు, విద్యార్థులకు అన్ని వసతులుండేలా ఇంటర్నేషనల్ స్కూళ్లకు దీటుగా అధునాతన భవనాలు నిర్మించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. రాష్ట్రమంతటా స్థలాలు అందుబాటులో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో వెంటనే ఇంటిగ్రేటెడ్ రిసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనారిటీ గురుకులాలను ఒకేచోట నిర్మించి మినీ ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలని, అప్పుడు గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా నిర్వహించే వీలుంటుందని సర్కారు భావిస్తోంది. వీటి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర సర్కారు పైలట్ ప్రాజెక్ట్ కింద కొడంగల్, మధిర నియోజవర్గాలను ఎంపిక చేసింది. ఇప్పటికే కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కోసం ఒక్కోచోట 20 ఎకరాల చొప్పున ప్రభుత్వం భూమిని సేకరించింది.

ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత కరెంట్!

ఇతర సర్కారు విద్య, వైద్య సంస్థలన్నింటికి కూడా.. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం.. త్వరలో ఉత్తర్వులు

- వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు
- సంస్థల విభాగాధిపతులకు బిల్లులు
- నెలనెలా చెల్లింపుల బాధ్యత వీరిదే

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ విద్య, వైద్య సంస్థలన్నింటికీ త్వరలో ఉచితంగా విద్యుత్తు సరఫరా కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలతోపాటు జూనియర్ కాలేజీలు, ఐటీఐలు, డిగ్రీ, పీజీ కాలేజీలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్‌లు, గురుకులాలు, హాస్టళ్లు, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)కు కూడా ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులు వెలువరించే అవకాశం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద వర్గాలకు 200 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్తు అందిస్తున్న విషయం తెలిసిందే. రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వ విద్య, వైద్య సంస్థలకు కూడా ఉచిత విద్యుత్తుకు సంబంధించి కేటాయింపులు చేసే అవకాశం ఉంది. ఈ సంస్థలకు ఉచిత విద్యుత్తు కల్పించేందుకుగాను ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్గదర్శకాలపై ఇంధనశాఖ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే ఉచిత విద్యుత్తు అమల్లోకి రానుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు సకాలంలో నిధులు విడుదల కాకపోతుండడంతో కరెంట్ బిల్లులు చెల్లించకలేక అవి ఇబ్బంది పడుతున్నాయి. తాజా నిర్ణయంతో ఆ సమస్య తీరనుంది. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు సరఫరా కోసం డిస్కమ్‌లు(దక్షిణ, ఉత్తర డిస్కమ్‌లు) ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను డిజైన్ చేస్తున్నాయి. విద్యాసంస్థలు ఏ విభాగాధిపతి (హెచ్‌వోడీ) పరిధిలోకి వస్తే ఆ విభాగాధిపతి ఆ పోర్టల్‌లోకి లాగిన్ అయి.. తమ శాఖ పరిధిలోని విద్యాసంస్థల వివరాలను వెబ్‌పోర్టల్‌లో చేర్చడం/తొలగించడంవంటి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

నెలనెలా బిల్లులు ఇన్‌చార్జులకే..

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు సరఫరా చేసినా.. ప్రతినెలా క్రమం తప్పకుండా మీటర్ రీడింగ్ తీసి బిల్లులను ఆ సంస్థల ఇన్‌చార్జులకు అందజేస్తారు. ప్రాథమిక/ప్రాథమికోన్నత/ఉన్నత పాఠశాలలకు అయితే మండల విద్యాధికారి (ఎంఈవో)కి కరెంట్ బిల్లులు అందజేస్తారు. ఉచిత విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అరికట్టేందుకు వీలుగా వీరు పర్యవేక్షించనున్నారు. కాగా, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించిన బిల్లులను ఆయా విభాగాధిపతులు తమ శాఖ బడ్జెట్ నిధుల నుంచి ప్రతి నెలా డిస్కమ్‌లకు చెల్లిస్తారు. వీరు తమ శాఖ పరిధిలోని విద్యా సంస్థల విద్యుత్తు వినియోగం, బిల్లుల మొత్తం, గత కాలానికి సంబంధించిన వినియోగ చరిత్ర, జారీ అయిన బిల్లులు, జరిపిన చెల్లింపులు, చెల్లించాల్సిన బకాయిలు వంటి సమాచారంతో కూడిన నివేదికలను వెబ్‌పోర్టల్‌లో చూసుకునే వీలుంటుంది. విద్యాసంస్థ, మండలం, జిల్లా వారీగా కూడా ఈ నివేదికలు ఆన్‌లైన్‌లో జనరేట్ కానున్నాయి. సంబంధిత విభాగాధిపతులు బడ్జెట్ కేటాయింపుల నుంచి విద్యుత్తు బిల్లులు చెల్లించడానికి వీలుగా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో అనుసంధానం చేయనున్నారు. మొత్తంగా 30,200 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 450 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 268 దాకా ఎస్సీ గురుకులాలు, 183 దాకా ఎస్టీ గురుకులాలు, 265 బీసీ గురుకులాలు, 204 మైనారిటీ గురుకులాలు, 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ఉచిత విద్యుత్తు అందనుంది.



విద్యా సంస్థ	కరెంట్ బిల్లులు చెల్లించే అధికారి
ప్రభుత్వ పాఠశాలలు	పాఠశాల విద్యాశాఖ సంచాలకులు
జూనియర్ కాలేజీలు	ఇంటర్ బోర్డు డైరెక్టర్
డిగ్రీ/పీజీ కాలేజీలు	కళాశాల విద్య కమిషనర్
ఐటీఐలు	ఉపాధి కల్పన, శిక్షణ శాఖ కమిషనర్
విశ్వవిద్యాలయాలు	ఉపకులపతులు
వైద్య కళాశాలలు	వైద్య విద్యశాఖ డైరెక్టర్
పాలిటెక్నిక్ కళాశాలలు	సాంకేతిక విద్యాశాఖ కమిషనర్
బీసీ వసతి గృహాలు	బీసీ సంక్షేమశాఖ సంచాలకులు
బీసీ గురుకులాలు	బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ
ఎస్సీ హాస్టళ్లు	ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు
ఎస్సీ గురుకులాలు	ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ
ఎస్టీ హాస్టళ్లు	గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు
ఎస్టీ గురుకులాలు	ఎస్టీ గురుకుల విద్యాలయాల సంస్థ
మైనారిటీ గురుకులాలు	మైనారిటీ విద్యాలయాల సంస్థ
నిమ్స్	డైరెక్టర్ నిమ్స్

సీఎంకు ఉపాధ్యాయ సంఘాల కృతజ్ఞతలు

ఉపాధ్యాయులకు పదోన్నతులతో 15ఏళ్ల సమస్యను తీర్చారని హర్షం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవ మరువలేనిదని, 15ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను మరింత మెరుగుపరచడానికి ఈ సందర్భంగా వారు కొన్ని సూచనలు చేశారు. రెవెన్యూ డివిజన్ల మాదిరిగా ప్రతీ 4,5 మండలాలకు ఒక ఎడ్యుకేషన్ డివిజన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డివిజనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టును మంజూరు చేసి ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలన్నారు. అలాగే మండలంలోని అన్ని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలపై పర్యవేక్షణ అధికారి స్థాయిలో ఒక మండల స్థాయి అధికారి పోస్టును క్రియేట్ చేయాలని కోరారు. సీఎంను రేవంత్‌ను కలిసిన వారిలో తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కరివేద మహిపాల్ రెడ్డి, అరికెల వెంకటేశం, జగదీశ్, నర్సింహులు, మహ్మద్ అబ్దుల్లా, రాజభాను చంద్రప్రకాశ్, రాజ గంగారెడ్డి, తుకారాం, మారెడ్డి అంజిరెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 1849 మంది పీఈటీలకు ఫిజికల్ డైరెక్టర్లు (పీడీలు)గా పదోన్నతులు కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం (పెటా టీఎస్) నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సీఎంను మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. పోస్టుల అప్‌గ్రేడేషన్ ద్వారా కొందరు పదోన్నతులు పొందినప్పటికీ.. కొన్ని జిల్లాల్లో కొంతమందికి పదోన్నతులు రాలేదని సీఎంకు వివరించారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) విద్యార్హత ఉండి ఆయా జిల్లాల్లో అప్‌గ్రేడేషన్ అయిన పోస్టులు ఉన్నందున అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని నాయకులు కోరారు. కాగా, దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

చెంచు మహిళపై దాడి ఘటనలో కొత్త కోణం!

- బాధితురాలి చిన్న మామనూ కొట్టి చంపిన వైనం
- ఎస్టీ కమిషన్‌కు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- నాగన్న మృతిపై విచారణకు పోలీసులకు ఆదేశాలు

కొల్లాపూర్, జూన్ 23: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లిలో చెంచు మహిళపై పాశవిక దాడి ఘటనలో మరో కొత్త విషయం వెలుగు చూసింది. దాడి ఘటనపై విచారణకు ఆదివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్.. ఆ ఊరిలో పర్యటించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు విస్తుపోయే విషయాన్ని వెల్లడించారు. బాధితురాలిపై దాడి చేసిన వారే, 20 రోజుల క్రితం ఆమె చిన్న మామ చెంచు నాగన్న(40)ను కూడా కొట్టి చంపి పూడ్చిపెట్టారని తెలిపారు. ఆ తర్వాత 'నాగన్న చనిపోయాడు.. దినాలు చేసుకోండంటూ డబ్బులిచ్చారని బోరున విలపించారు. దీంతో అవాక్కయిన ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్.. నాగన్న మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీఎస్పీ శ్రీనివాస్‌ను ఆదేశించారు. కాగా, 20 రోజుల కింద నాగన్న తన బావమరిది గురువన్నతో కలిసి అడవికి వెళ్లి రెండు ఉడుములను తెచ్చి విక్రయించి.. వచ్చిన డబ్బుతో సారా తాగారని గ్రామస్థులు చెప్తున్నారు. ఆ తర్వాత పెద్ద చెరువు సమీపంలోని రసూల్ చెల్కలోని ఒడ్డుపై నాగన్న మృతి చెందాడని, కుటుంబసభ్యులే దహన సంస్కారాలు నిర్వహించారని అంటున్నారు.

యాదగిరికొండపై భక్తుల సందడి

- స్వామివారిని దర్శించుకున్న 40 వేలమంది భక్తులు

భువనగిరి అర్బన్, జూన్ 23: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 40 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి వచ్చారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఉభయ క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడాయి. కొండపైన బస్టాండ్‌లో ఆలయ అధికారులు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడంతో బస్సు ఎక్కాలంటే తీవ్ర ఆటంకం కలిగింది. ఆలయ ఖజానాకు రూ.64,43,032 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాస్‌రావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామిఅమ్మవార్ల పూజల్లో పాల్గొన్నారు.

ఔను.. ఖర్చు రెట్టింపైంది!

సచివాలయ నిర్మాణ వ్యయం రూ.1,140 కోట్లు.. రూ.617 కోట్లు అనుకున్నది కాస్తా డబులైంది

- మంత్రి కోమటిరెడ్డికి చెప్పిన అధికారులు
- ఐటీ 181 కోట్ల నుంచి 361 కోట్లకు
- పరికరాల కొనుగోలులో అక్రమాలు?
- విజిలెన్స్ విచారణకు ప్రభుత్వ నిర్ణయం
- 'సెక్రటేరియట్'పై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



హైదరాబాద్, జూన్ 23(ఆంధ్రజ్యోతి): కొత్త సచివాలయ నిర్మాణ ఖర్చు ఎంతనేది ఎట్టకేలకు తేలింది. అనుకున్నదానికంటే వ్యయం రెట్టింపైనట్లు స్పష్టమైంది. పాత భవనాల సముదాయాన్ని కూల్చివేసి చేపట్టిన పనుల వ్యయాన్ని బీఆర్‌ఎస్ సర్కారు అత్యంత గోప్యంగా ఉంచింది. ఏ చిన్న విషయాన్నీ బయటకు రానీయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. గత ప్రభుత్వం మొదలుపెట్టిన నిర్మాణాలు, వెచ్చించిన నిధులపై దృష్టిసారించింది. దీంతో నూతన సచివాలయం గురించిన వివరాలు సహా ఇంకా ఇతర బకాయిలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

కాగా, రూ.617 కోట్ల అంచనాతో ప్రారంభమైన సచివాలయం నిర్మాణం పూర్తయ్యేసరికి రూ.1,140 కోట్లకు చేరింది. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు నివేదించగా.. ప్రభుత్వం విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సంబంధిత నివేదికను అధికారులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కూడా అందించారు. మరోవైపు సచివాలయంలోని విభాగాధిపతుల కార్యాలయాల్లో ఐటీ పరికరాల కోసం వెచ్చించిన నిధులు, వాటి కొనుగోలులోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత రూ.181 కోట్ల మేర ఖర్చవుతుందని భావించగా, ఇది ఏకంగా రూ.361 కోట్లకు చేరింది. ఈ పనులను టెండర్ల ద్వారా కాకుండా నామినేషన్ పద్ధతిలో అప్పగించారన్న అంశం తెరమీదకు వచ్చింది. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయిస్తున్నట్టు సమాచారం. కాగా, సచివాలయ నిర్మాణ ఖర్చు రూ.1,140 కోట్లకు చేరిందన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' గతంలోనే చెప్పింది. 'సచివాలయం ఖర్చు డబుల్' శీర్షికన మార్చి 24న కథనాన్ని ప్రచురించింది. మరోవైపు సచివాలయం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, అమర వీరుల స్మారక స్తూపం, జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు సహా పలు నిర్మాణాలకు రూ.3,740 కోట్ల ఖర్చు కాగా రూ.1,251 కోట్లను ఆయా సంస్థలకు చెల్లించాల్సి ఉంది.

ఇదీ విషయం..

కొత్త సచివాలయ నిర్మాణానికి 2019 జూన్ 27న అప్పటి సీఎం కేసీఆర్ పాత సచివాలయంలోని డి-బ్లాక్ వెనుకభాగంలో శంకుస్థాపన చేశారు. 2023 ఏప్రిల్ 30న ప్రారంభోత్సవం చేశారు. అయితే, ఖర్చుపై గత ప్రభుత్వం, అర్‌అండ్‌బీ అధికారులు అత్యంత గోప్యత పాటించారు. ఎవరైనా సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగినా రూ.617 కోట్ల అంచనాతో కూడిన జీవో గురించి మాత్రమే చెబుతూ వచ్చారు. తప్పితే పెరిగిన అంచనాల గురించి ప్రస్తావించలేదు. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా సచివాలయ నిర్మాణంపై అనుమానాలను వ్యక్తం చేసింది. ఇప్పుడు అధికారంలోకి రావడంతో గతంలో చేపట్టిన నిర్మాణాలు, చేసిన ఖర్చులపై వివరాలు సేకరిస్తున్నది. ఈ క్రమంలో సచివాలయం వ్యయం రూ.1,140 కోట్లు అయిందని తేలింది. ఇక ఐటీ పరికరాల వ్యయం రూ.361 కోట్లు కూడా కలిపితే కొత్త సచివాలయం ఖర్చు మొత్తం రూ.1,501 కోట్లుగా ఉంది.

రోడ్లు, భవనాల శాఖ పరిధిలో, పర్యవేక్షణలో చేపట్టిన పలు నిర్మాణాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సమీకృత కలెక్టరేట్‌లు, అధికారుల నివాస సముదాయాలకు సంబంధించి దాదాపు రూ.468 కోట్లు, 119 మంది ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల బిల్లులు రూ.22 కోట్లు, నూతన సచివాలయానికి రూ.523 కోట్లు, అమరుల స్మారక స్తూపం (రూ.6.58 కోట్లు), అంబేడ్కర్ విగ్రహం (రూ.13.99 కోట్లు), ప్రెస్ అకాడమీ భవనం (రూ.3 కోట్లు), ఈవీఎం, వీవీప్యాట్ల స్టోరేజీ గోదాం (రూ.11.42 కోట్లు), ఆర్‌అండ్‌బీ ఇన్‌స్పెక్షన్ బంగ్లా (రూ.98.73 కోట్లు)లతో పాటు మరికొన్నిటికి సంబంధించి దాదాపు రూ.1,251 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కొన్ని ఆర్థిక శాఖ వద్దే ఉన్నాయి. కాగా, ఆయా భవనాలు, నిర్మాణాలు చేపట్టిన సంస్థలు తమకు బిల్లులు చెల్లించాలంటూ రోడ్లు, భవనాల శాఖకు విజ్ఞప్తి చేస్తున్నాయి.



మావోయిస్టుల శిబిరంలో లభించిన ఆయుధాలు, సామగ్రి

ఐఈడీ పేలి ఇద్దరు జవాన్ల మృతి

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో ఘటన
- మావోయిస్టుల స్థావరంలో బయటపడ్డ దొంగనోట్ల ముద్రణ యంత్రం

దుమ్ముగూడెం, జూన్ 23 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో ఆదివారం మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలడంతో ఇద్దరు జవాన్లు మృతి చెందారు. విధి నిర్వహణలో భాగంగా 210 కోబ్రా బలగాలు జేగురుగొండ పోలీస్‌స్టేషన్ క్యాంపు నుంచి టేకులగూడెం వైపు ట్రక్కు, ద్విచక్రవాహనాలపై బయల్దేరారు. భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని వారు ప్రయాణించే మార్గంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలడంతో ట్రక్కు గాల్లోకి లేచింది. దీంతో ట్రక్కు నడుపుతున్న డ్రైవర్ సహా ట్రక్కులోనే ఉన్న మరో డ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇతర జవాన్లు సురక్షితంగా బయటపడ్డారు. మృతి చెందిన జవాన్లను ఆర్.విష్ణు, శైలేంద్రలుగా గుర్తించారు.

సుక్మా జిల్లా కొరాజ్‌గూడ అటవీ ప్రాంతంలోని మావోయిస్టుల స్థావరంపై పోలీసు బలగాలు ఆదివారం దాడి చేశాయి. ఈ సందర్భంగా అక్కడ నకిలీ రూ.50, 100, 200, 500 కరెన్సీ నోట్లతోపాటు నకిలీ నోట్ల ముద్రణ యంత్రాన్ని పోలీసులు గుర్తించారు. నిధుల కొరత కారణంగా మావోయిస్టులు నకిలీ నోట్లను ముద్రించి చెలామణి చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. శిబిరంలో తుపాకులు, పేలుడు పదార్థాలు, ముద్రించిన కరెన్సీనోట్లు, వాకీటాకీలు, మందులు, దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా మావోయిస్టుల శిబిరంలో కరెన్సీ నోట్లను ముద్రించే యంత్రం లభించడం ఇదే మొదటిసారని పోలీసు అధికారులు తెలిపారు.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను 24వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఇంటర్ బోర్డు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేయనున్నారు. విద్యార్థులు https://tgbie.cgg.gov.in, http://results.cgg.gov.in వెబ్‌సైట్‌లలో తమ ఫలితాలను పరిశీలించుకోవచ్చని అధికారులు తెలిపారు.

హాస్టల్‌లో ఉండలేక విద్యార్థిని ఆత్మహత్య



వర్షిణి (ఫైల్)

చిలుపూర్, జూన్ 23: వసతి గృహంలో ఉండడం ఇష్టం లేక ఓ తొమ్మిదో తరగతి విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన జనగామ జిల్లా చిలుపూర్ మండలం రాజవరం సమీపంలోని కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం)లో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం... రాజవరం రెవెన్యూ పరిధిలోని పకీరతండాకు చెందిన ఇస్లావత్ వర్షిణి (14)ని తల్లిదండ్రులు ఈనెల 21న స్థానిక కేజీబీవీలో చేర్పించారు. అక్కడ ఉండడం ఇష్టం లేని వర్షిణి తాను వెంట తెచ్చుకున్న పురుగుల మందు కలిసిన కూల్‌డ్రింక్‌ను అదే రోజు రాత్రి తాగి పడుకుంది. ఉదయం నిద్ర లేచిన కాసేపటికే అస్వస్థతకు గురై వాంతులు చేసుకుంది. దాంతో కేజీబీవీ సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారమిచ్చి వెంటనే బాలికను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున వర్షిణి మృతి చెందింది. బాలిక తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఎలాంటి తినుబండారాలను పాఠశాలలోనికి అనుమతించని కేజీబీవీ సిబ్బంది పురుగుల మందు కలిపిన కూల్‌డ్రింక్ బాటిల్‌ను విద్యార్థిని వెంట పట్టుకెళ్లినా గమనించకపోవడం బాధాకరమని వాపోతున్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ఓఆర్‌ఆర్‌పై ప్రైవేటు బస్సు బోల్తా

- మహిళ మృతి, 16 మందికి గాయాలు

నార్సింగి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ మహిళ ప్రాణం పోయింది. మద్యం మత్తులో బస్సు నడపడంతో ఔటర్ రింగ్ రోడ్డుపై బోల్తా పడింది. ప్రైవేట్ ట్రావెల్స్ (మార్నింగ్ స్టార్) బస్సు ఆదివారం రాత్రి గచ్చిబౌలి నుంచి చెన్నైకు బయల్దేరింది. నానక్‌రామ్‌గూడ టోల్‌గేట్ వద్దకు రాగానే ఇతర వాహనాల లైట్లకు డ్రైవర్ కళ్లు బైర్లుకమ్మాయి. హఠాత్తుగా బ్రేక్ వేయడంతో బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు కింద పడిపోయినట్లు తెలిసింది. వారిలో ఒక మహిళ మృతి చెందారు. మరో 16 మందికి గాయాలయ్యాయి. మృతి చెందిన మహిళ స్వస్థలం ఒంగోలు కాగా.. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటున్నట్లు తెలిసింది. క్షతగాత్రులను గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతనికి శ్వాసపరీక్ష(ఆల్కహాల్) నిర్వహించగా 187 పాయింట్ల రీడింగ్ వచ్చినట్లు సమాచారం. నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తమాషా చేస్తున్నారా?

- సెలవు రోజు తలుపులు మూసి పనిచేస్తారా?
- బాలానగర్ ఆర్‌ఐపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆగ్రహం

బాలానగర్, జూన్ 23: ఏం తమాషా చేస్తున్నారా? సెలవురోజు ప్రైవేట్ వ్యక్తిని లోపల పెట్టుకుని తలుపులుమూసి పనిచేస్తారా? ఇలా చేయమని ఎవరు చెప్పారు?' అంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ ఆర్‌ఐ వెంకట్‌రెడ్డిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు తలుపులుమూసి పని చేస్తున్నారన్న సమాచారం ఎమ్మెల్యేకు అందింది. దీంతో ఆయన ఒంటరిగానే కార్యాలయానికి చేరుకున్నారు. లోపలికి వెళ్లి చూడగా ఆర్‌ఐ, రిటైర్డ్ డీటీ గిరప్ప కంప్యూటర్ ముందు కూర్చుని ఉన్నారు. గిరప్ప చేతిలోని పత్రాలు ఎమ్మెల్యే తీసుకుని పరిశీలించారు. ఆదివారం పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చింది? మీకెవరు చెప్పారు? అంటూ ఎమ్మెల్యే నిలదీశారు. దీనికి ఆర్‌ఐ బదులిస్తూ ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి సెలవు రోజుల్లోనూ పని చేయాలని అడిషనల్ కలెక్టర్ చెప్పారన్నారు. దీంతో అడిషనల్ కలెక్టర్‌కు ఫోన్ చేయమనగా ఆర్‌ఐ ఫోన్ చేసి విషయం చెప్పారు. ఎమ్మెల్యే ఫోన్ తీసుకుని ప్రైవేట్ వ్యక్తిని తెచ్చి పనులు చేయిస్తున్నారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోకుంటే తాను కలెక్టరేట్ ముందు కూర్చుంటానన్నారు. అయితే అవి ప్రజాపాలన దరఖాస్తులు కావని, భూముల పంచనామా చేస్తున్నారని అదనపు కలెక్టర్‌కు చెప్పారు. ఇంతలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని ఆర్‌ఐ ఇలా చాలా చేశారన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వెళ్లి ఆర్‌ఐ, రిటైర్డ్ డీటీ గిరప్పపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి మాత్రం ప్రజాపాలన ఫిర్యాదుల సవరణకు సెలవు రోజుల్లోనూ పనిచేయాలని ఉన్నతాధికారులు చెప్పారని, బక్రీద్ రోజు కూడా పనిచేశామని తెలిపారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో సెలవు రోజుల్లో పని చేస్తున్నారని, భూములకు సంబంధించిన పనికాదన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor:* **K. Srinivas.** *Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741,* **Managing Director : Vemuri Radha Krishna** *Founder: K.L.N.Prasad.*